www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 30-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 135 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి రా.10.47 తదుపరి అష్టమి, నక్షత్రం: విశాఖ మ.2.37 తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.7.05-8.52, దుర్ముహూర్తం: ఉ.6.04-7.43, అమృతఘడియలు: శేషం ఉ. 6.31, మరల తె 5.49 మొదలు, రాహుకాలం: ఉ. 9.00-10.30, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హలో ఏపీ.. మేమొస్తున్నాం

అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్ పెడుతున్నాం

మార్చికల్లా ప్రారంభించే యత్నాలు

'ఐబీఎం క్వాంటమ్' ప్రతినిధి క్రౌడర్ ప్రకటన

న్యూయార్క్, ఆగస్టు 29: 'అమరావతిలో అడుగు పెడుతున్నాం' అని గ్లోబల్ టెక్ దిగ్గజం ఐబీఎం ధ్రువీకరించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏర్పాటుకానున్న క్వాంటమ్ వ్యాలీ టెక్‌పార్క్‌లో వచ్చే ఏడాది మార్చి నాటికి ఐబీఎం తన క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్‌ను

మిగతా 13వ పేజీలో...

'మెగా' ప్రోత్సాహం!

పెట్టుబడి రూ.200 కోట్లు దాటితే మెగా హోదా

సరైన సమయం... సద్వినియోగం చేసుకోండి

ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా గ్లోబల్ హబ్‌గా ఏపీ

వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడులు లక్ష్యం

ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద ప్రోత్సాహకం

ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు

'ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్' సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సుకు హాజరైన ప్రతినిధులకు సీఎం చంద్రబాబు అభివాదం

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): "ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. రూ.200 కోట్లకు పైగా పెట్టుబడులు పెడితే, వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణిస్తాం. మరిన్ని ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తాం. ఇదే సరైన సమయం. పెట్టుబడిదారులు సద్వినియోగం చేసుకోండి. ఆంధ్రప్రదేశ్‌కు తరలి రండి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు గ్లోబల్ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు. 'భారత వాణిజ్య ప్రోత్సాహక మండలి' ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం 'ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్' సదస్సును సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లలో ఆయా రంగాల్లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తామన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా, సుస్థిరంగా మార్చడమే

మిగతా 13వ పేజీలో...

ఆసియా టెక్ హబ్‌గా విశాఖ

'సీ-కేబుల్'తో ప్రపంచం అనుసంధానం



విశాఖను నంబర్ 1 సిటీగా మారుస్తాం

బీచ్‌రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మహిళలతో కలిసి కాసేపు ప్రయాణం

డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు దుర్గేశ్, అనిత, డోలా, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా తదితరులు

చంద్రబాబు @ 3

అత్యంత జనాదరణ కలిగిన సీఎంలలో మూడో స్థానం

'ఇండియా టుడే' సర్వేలో వెల్లడి 13

తొలి రెండు స్థానాల్లో యోగి, మమత

గత సర్వేలో 5వ స్థానంలో బాబు



మీ ప్రాజెక్టు.. మా బాధ్యత

పారిశ్రామికవేత్తలకు లోకేశ్ భరోసా

ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపు

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు సులభతర విధానం 13

పాఠశాల వ్యవస్థ బలోపేతానికి ఐదుగురు సభ్యుల సలహా మండలి



విశాఖ రుషికొండ ప్యాలెస్‌లో బాత్‌టబ్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. చిత్రంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, తదితరులు

ఉక్కుపై విషం

ప్రైవేటీకరణ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

ప్రైవేటీకరణ ఆగింది.. కాబట్టే ఆర్థిక సాయం

కేంద్రం రూ.14 వేల కోట్ల సాయం చేస్తోంది

మరి ఇంకెందుకు కార్మిక సంఘాల ఆందోళన?

వైసీపీ హయాంలో ఈ సంఘాలు ఏం చేశాయి?

ఢిల్లీని ఆనాడు జగన్ ఒక్కసారైనా ప్రశ్నించారా?

కేసుల భయంవల్లే కేంద్రాన్ని ఆయన అడగలేదు

నాకు అలాంటి భయాలేవీ లేవు

ఈ విషయాలు బలంగా జనంలోకి తీసుకెళ్లండి

జనసేన భేటీలో డిప్యూటీ సీఎం పవన్ నిర్దేశం

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆగింది కాబట్టే ఆర్థిక సాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చిందనే విషయాన్ని ప్రజలకు గట్టిగా వివరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకులకు సూచించారు. విశాఖలో జరుగుతున్న పార్టీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఎంపీలు,

మిగతా 14వ పేజీలో...

శీతాకాలంలోగా వినియోగంలోకి రుషికొండ ప్యాలెస్

ఎలా ఉపయోగిస్తే మంచిదో సలహాలివ్వండి: పవన్

జనసేన ప్రజా ప్రతినిధులతో కలిసి ప్యాలెస్ సందర్శన 14

రుషికొండపై ఉపసంఘం.. వెంటనే సిఫారసులు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు



ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన!

చేతిపై పెద్ద మచ్చ, చీలమండల వద్ద వాపు, ఉబ్బిన కళ్లు, నడకలో తడబాటు

హృద్రోగ లక్షణాలనే అంచనాలు

చర్మవ్యాధి కావొచ్చనే విశ్లేషణలు 2

ట్రంప్ ఆరోగ్యం బాగుంది: వైట్‌హౌస్

అనుకోని ఘోర విషాదం జరిగితే అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు నేను సిద్ధం: ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

వైసీపీ నేతలతో పరిచయాలు నిజమే



విచారణ అనంతరం అరుణను జైలుకు తరలిస్తున్న పోలీసులు

పోలీసుల ఎదుట కి'లేడీ' అరుణ అంగీకారం

గత ప్రభుత్వంలోని పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులతో పరిచయాలు

ఆ ప్రభుత్వంలో ఉండి, కూటమిలోనూ కొనసాగుతున్న ఇద్దరు, ముగ్గురితోనూ..

'కీలక' వివరాలు సేకరించిన పోలీసులు

రెండో రోజు ఏడు గంటలపాటు విచారణ

నెల్లూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలోని పలువురు ప్రముఖులతో తనకు పరిచయాలు ఉన్నాయని కి'లేడీ' నిడిగుంట అరుణ పోలీసుల ముందు అంగీకరించినట్లు తెలిసింది. ఆ ప్రభుత్వంలో ఉండి, ప్రస్తుతం అధికార కూటమిలోనూ కొనసాగుతున్న ఇద్దరు, ముగ్గురితోనూ సంబంధాలు

మిగతా 14వ పేజీలో...

శ్రీకాంత్ వ్యవహారంలో మరో ముగ్గురు కానిస్టేబుళ్లపై వేటు

ఇప్పటికే ముగ్గురి సస్పెన్షన్ 13



మేకిన్ ఇండియా కోసం రండి.. ప్రపంచం కోసం తయారు చేయండి.. పెట్టుబడులకు గమ్యం భారత్

భారత్-జపాన్ ఆర్థిక సదస్సులో ప్రధాని మోదీ

భారత్‌లో పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులే జపాన్ లక్ష్యం.. ఇరుదేశాల కీలక ఒప్పందాలు

ఒమన్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం.. సౌదీ, ఖతార్‌తోనూ చర్చలు: పీయూష్ గోయల్

టోక్యోలో జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో ప్రధాని నరేంద్ర మోదీ కరచాలనం

భారత్, చైనా కలిసి పనిచేయాలి!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు ఇది అవసరం

జపాన్ మీడియాకు ప్రధాని మోదీ ఇంటర్వ్యూ

టోక్యో, ఆగస్టు 29: ప్రపంచ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచాలంటే భారత్, చైనా కలిసి పనిచేయడం అవసరమని ప్రధాని మోదీ అన్నారు. పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం ఆధారంగా ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక, దీర్ఘకాలిక సంబంధాలను పెంపొందించుకునేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం జపాన్ వెళ్లిన మోదీ.. శుక్రవారం స్థానిక పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, చైనాలు ప్రపంచంలోనే అతిపెద్ద దేశాలని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య స్థిరమైన, బలమైన బంధాలు

మిగతా 2వ పేజీలో...

అమిత్‌షా తల నరికి బల్లపై పెట్టాలి!

బంగ్లా నుంచి చొరబాట్లను అడ్డుకోవడంలో విఫలమయ్యారు

టీఎంసీ ఎంపీ మహువా వివాదాస్పద వ్యాఖ్యలు 2

పిన్నెల్లి సోదరులకు ఝలక్

టీడీపీ నేతల హత్య కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత

నేరపూరిత కుట్రలో పిటిషనర్ల పాత్ర ఉందన్న ప్రాసిక్యూషన్ వాదనలో బలం ఉంది: హైకోర్టు 3

'ఉమెన్ జస్టిస్'లో ఏపీ @ 9

హైకోర్టులో 30 మంది జడ్జీలలో ఐదుగురు మహిళలు 11

జాబితాలో తెలంగాణ టాప్.. 30 మందిలో 10 మంది వారే

లా అండ్ పాలసీ రిసెర్చ్ నివేదికలో వెల్లడి



పట్నాలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల బాహాబాహీ

రాహుల్ సభపై దుమారం

ప్రధాని మోదీ తల్లిపై కొందరు దుర్భాషలాడినట్టు ఆరోపణలు

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ.. పట్నాలో రాహుల్‌పై కేసు

రాహుల్ క్షమాపణ చెప్పాలన్న అమిత్ షా

'ఓటర్' యాత్రకు బ్రహ్మరథం.. అందుకే బీజేపీ కుట్రలు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 29: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న బిహార్ దర్భంగా ఓటర్ అధికార్ యాత్ర సభ వేదికపై నుంచి ప్రధాని మోదీ తల్లిని కొందరు దూషించడంపై కలకలం రేగుతోంది. మోదీ మాతృమూర్తిని హిందీలో దుర్భాషలాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో రాహుల్‌పై బిహార్ బీజేపీ నేత కృష్ణ సింగ్ పట్నాలో కేసు నమోదు

మిగతా 2వ పేజీలో...

జీడీపీ హుషారు.. రూపాయి బేజారు



- జూన్ త్రైమాసిక వృద్ధి 7.8 శాతం
- అంచనాలను మించి పరుగు
- ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి ఇది
- 2025-26లో వృద్ధి రేటు 6.3-6.8 శాతంగా ఉండే చాన్స్ 10
- జీవితకాల కనిష్ఠానికి రూపాయి
- ఒక్క రోజులో 51 పైసలు డౌన్
- రూ.88.09 వద్ద ముగింపు

98.4 శాతం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

15,308 మందికి కాల్ లెటర్లు: డీఎస్సీ కన్వీనర్ 11

ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన!

» చేతి వెనుక వంకాయ రంగు మచ్చ, ఉబ్బిపోయిన కళ్లు



వాషింగ్టన్, ఆగస్టు 29: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయన ఆరోగ్యం అంతా బాగానే ఉందని అమెరికా అధ్యక్ష కార్యాలయం శ్వేత సౌధం వైద్యుడు, ఇతర అధికారులు చెబుతున్నా.. కొంతకాలం నుంచి ఆయనను గమనిస్తున్నవారు ట్రంప్ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆయన కాలి చీలమండల వద్ద వాపు, కుడిచేతి వెనకాల కమిలిపోయినట్టుగా వంకాయ రంగు పెద్ద మచ్చ, ఉబ్బిపోయిన కళ్లు, రంగుమారిపోయిన పెదవులు, నడిచేప్పుడు బ్యాలెన్స్ కోల్పోతుండటం వంటివాటిని ప్రస్తావిస్తున్నారు. ఇవి తీవ్రమైన గుండె వ్యాధి, దానికి వాడే మందుల దుష్ప్రభావాల లక్షణాలని విశ్లేషిస్తున్నారు. ఇటీవల అలాస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఆహ్వానించే సమయంలో.. ట్రంప్ కార్పెట్‌పై నేరుగా కాకుండా, కాస్త తూలుతున్నట్టుగా అటూఇటూ నడిచారని గుర్తు చేస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ కుడిచేతిపై మచ్చ చర్చనీయాంశం కావడంతో శ్వేతసౌధం వైద్యుడు సియాన్ బార్బబెల్లా ఇటీవల వివరణ ఇచ్చారు. రక్తాన్ని పలుచన చేసే ఆస్పిరిన్ వాడుతున్న ట్రంప్.. ఇటీవల చాలా మందిని కలసి కరచాలనం చేయడంతో చర్మం రాపిడికి గురై మచ్చ ఏర్పడిందని చెప్పారు. ట్రంప్ వయసు ప్రస్తుతం 79 ఏళ్లు అని, ఈ వయసులో ఇలాంటి సమస్యలు సాధారణమేనని, తీవ్రమైన గుండె, రక్తనాళాల వ్యాధులేమీ లేవని పేర్కొన్నారు.

అవసరమైతే అధ్యక్ష బాధ్యతలకు సిద్ధం: వాన్స్



వాషింగ్టన్, ఆగస్టు 29: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ అనుకోని ఘోరమైన విషాదం జరిగితే దేశ అధ్యక్షుడి బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అయితే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(79) ఆరోగ్యం చాలా బాగుందని చెప్పారు. ఆయన తన పూర్తి పదవీ కాలం బాధ్యతలు నిర్వర్తిస్తారని తాను విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. 'యూఎస్ఏ టుడే'కి గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్ ట్రంప్ ఆరోగ్యంపై వస్తోన్న వదంతులను కొట్టి పారేశారు. అయితే ప్రస్తుతం తానున్న పదవి రీత్యా అనుకోనిది జరిగితే అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి సన్నద్ధం అయినట్లు తెలిపారు.

బిజినెస్ క్లాస్ విమాన టికెట్ల ధరలపై జీఎస్టీ పెంపు!

న్యూఢిల్లీ, ఆగస్టు 29: కొత్తగా రెండు శ్లాబుల జీఎస్టీ విధానాన్ని తీసుకురానున్న కేంద్రం.. విమానాల్లో ప్రీమియం, బిజినెస్ క్లాస్ టికెట్ల ధరలపై 18 శాతం పన్ను విధించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ టికెట్ల ధరలపై 12 శాతం జీఎస్టీ విధిస్తున్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే.. సంపన్న తరగతుల విమాన టికెట్ల ధరలు పెరగనున్నాయి. మరోవైపు, ఎకానమీ క్లాస్ సినిమా టికెట్ల ధరల మీద ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతాలతో కూడిన 4 శ్లాబులున్నాయి. వీటిని రెండింటికి కుదించి 5 శాతం, 18 శాతానికి పరిమితం చేయనున్నట్లు కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే.

అమెరికా మాదిరి సరిహద్దు గోడ కడతారా?

» అక్రమ వలసదార్లపై విధానమేంటి.. కేంద్రానికి సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, ఆగస్టు 29: అక్రమ వలసదారులను నిరోధించడానికి అమెరికాలో మాదిరిగా సరిహద్దుల్లో గోడ నిర్మిస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముఖ్యంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారిని తిప్పి పంపించడానికి అనుసరిస్తున్న ప్రామాణిక నిర్వహణ విధానం (ఎస్ఓపీ) ఏమిటని అడిగింది. వీటిపై సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది. బెంగాలీ మాట్లాడుతున్న వలస కార్మికులను బంగ్లాదేశీయులు అన్న అనుమానంతో పలు చోట్ల అదుపులోకి తీసుకోవడాన్ని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ వలసదార్ల సంక్షేమ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ ప్రారంభించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ ఇలాంటి విషయాల్లో అసలైన బాధితులు వేసిన పిటిషన్లను స్వీకరించాలే తప్ప సంస్థలు, సంఘాలు వేసినవి కావని అన్నారు. కొన్ని సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు కూడా ఉందని, కొన్ని ప్రభుత్వాలు అక్రమ వలసదార్ల కారణంగా మనుగడ సాగిస్తున్నాయని తెలిపారు.

ఇద్దరు సుప్రీం న్యాయమూర్తుల ప్రమాణం

న్యూఢిల్లీ, ఆగస్టు 29: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ పంచోలీ శుక్రవారం ప్రమాణం చేశారు. సీజేఐ జస్టిస్ గవాయ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. దాంతో సుప్రీంకోర్టు తన పూర్తి బలం 34 మందికి చేరుకుంది. ఈ నెల 27న వారిద్దరి నియామకాన్ని కేంద్రం ఖరారు చేసింది. జస్టిస్ పంచోలీ సీనియారిటీ ప్రకారం 2031 అక్టోబరు 3 సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అవుతారు. 2033 మే 27 వరకు సీజేఐగా కొనసాగుతారు.

జర్నలిస్టులకు దేశమంతా ఒకే పెన్షన్ ఉండాలి

» సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రిటైర్డు జర్నలిస్టులకు దేశమంతటా ఒకే పెన్షన్ విధానం ఉండాలని సీనియర్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీర్మానం చేసింది. కేరళలో ఇటీవల జరిగిన ఫెడరేషన్ తొలి సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఢిల్లీకి చెందిన సందీప్ దీక్షిత్ ఎంపికయ్యారు. నేషనల్ కౌన్సిల్ మెంబర్‌గా తెలుగు పత్రికలలో పనిచేసిన సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ రజాక్ ఎంపికయ్యారు. కర్ణాటక నుంచి కార్యదర్శిగా కె. శాంత కుమారి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరుగా ఆర్‌పీ సాంబశివారెడ్డి, నేషనల్ కౌన్సిల్ మెంబర్లుగా రుద్రప్ప అసంగి, పండిత్ నాటికర్, జాకీర్ హుసేన్ ఎంపికయ్యారు.

ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల కింద డ్రగ్స్!

» మట్టి గాజుల పార్సిళ్లలోనూ సరఫరా చేస్తున్న ముఠా

» ఢిల్లీలోని 10 కొరియర్ సంస్థలపై ఈగల్ బృందాల నిఘా

» మహీంద్రా వర్సిటీలో 14 మంది విద్యార్థులకు డ్రగ్ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ రవాణాకు ఆయా ముఠాలు.. సరి కొత్త దారులను ఎంచుకుంటున్నాయి. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, మట్టి గాజుల పార్సిళ్లలో డ్రగ్స్ పెట్టి.. దర్జాగా కొరియర్‌లోనే పంపిస్తున్నాయి. ఎక్కడా లింకులు బయటపడకుండా గుట్టుగా దందా కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న పది కొరియర్ సంస్థల ద్వారా ఏడాదిలోనే రూ.100కోట్లకుపైగా విలువైన డ్రగ్స్‌ను దేశవ్యాప్తంగా తరలించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థుల డ్రగ్స్ దందాను ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందాలు ఇటీవల బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. మల్నాడు కిచెన్ కేసులో కొరియర్ పార్సిళ్ల ద్వారా హైదరాబాద్‌కు డ్రగ్స్ చేరుతున్నట్లు గుర్తించిన ఈగల్ బృందాలు.. ఆపై ఢిల్లీలో నిఘా పెట్టగా పది కొరియర్ సంస్థల నుంచి నిక్ అతని అనుచరులు దేశంలోని వివిధ ప్రాంతాలకు డ్రగ్స్‌ను పంపిస్తున్నట్లు తేలింది. ఎండీఎంఏ, కొకైన్, ఓజీ(ఓషన్ గంజా) కుష్ వంటి మత్తు పదార్థాలను మట్టి గాజులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల మధ్య పెట్టి కొరియర్ చేసినట్లు ప్రస్తావించాయి. మొత్తం స్మగ్లింగ్ వ్యవహారానికి ఢిల్లీలో నివసిస్తున్న నైజీరియన్ దేశస్థుడు సూత్రధారి అని ఈగల్ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, మహీంద్ర యూనివర్సిటీలోని 50మంది విద్యార్థులు తరచూ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో అనుమానిత విద్యార్థులకు కొన్ని రోజులుగా డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తాజాగా 14మంది విద్యార్థులలకు డ్రగ్ టెస్టు నిర్వహించగా.. ఐదుగురికి పాజిటివ్ వచ్చినట్లు సమాచారం.

భారత్-చైనా కలిసి పనిచేయాలి!

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని.. ఆ ప్రభావం ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సౌభ్రాతృత్వంపైనా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చైనాతో సంబంధాలు మెరుగుపర్చుకోవడంపై అడిగిన ప్రశ్నకు మోదీ స్పందిస్తూ.. "చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు షాంఘై సహకారం సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొనడానికి తియాంజిన్ వెళ్తున్నా. గత ఏడాది కజాన్‌లో జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యాను. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాల్లో స్థిరమైన, సానుకూల పురోగతి ఉంది" అని చెప్పారు. ఇరుదేశాల మధ్య దృఢమైన బంధం ఆసియాకే గాక యావత్ ప్రపంచానికే కీలకమని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అస్థిరంగా ఉందని.. ఈ పరిస్థితుల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్, చైనా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జపాన్ ప్రభుత్వ 'స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో-పసిఫిక్' విధానంపై స్పందిస్తూ.. ఈ విధానానికి, భారత్ 'విజన్ మహాసాగర్'కు సారూప్యత ఉందని మోదీ చెప్పారు.



జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో మోదీ

ప్రపంచం కోసం తయారు చేయండి..

ప్రధాని మోదీ భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో ప్రసంగిస్తూ.. మేకిన్ ఇండియా కోసం రావాలని, ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. సెమీ కండక్టర్ పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ భారత్‌కు జపాన్ అత్యంత కీలక భాగస్వామిగా ఉందని చెప్పారు. జపాన్ సంస్థలు భారత్‌లో రూ.3.50 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. "ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. త్వరలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది" అని మోదీ పేర్కొన్నారు. జపాన్ సాంకేతికత, భారతీయుల ప్రతిభ కలిస్తే ఈ శతాబ్దపు సాంకేతిక విప్లవాన్ని ముందుకు నడిపించగలవని అన్నారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు భారత్, జపాన్‌ల మధ్య ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని ప్రధాని మోదీ చెప్పారు. మరికొన్ని ఏళ్లలోనే రైలు సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. మరోవైపు, చంద్రుడిపై పరిశోధనల కోసం చేపడుతున్న చంద్రయాన్-5 మిషన్ కోసం జపాన్‌తో కలిసి పనిచేయనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందు కోసం ఇరుదేశాల అంతరిక్ష సంస్థలు ఇస్రో, జాక్సాల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిపారు.

పదేళ్లలో రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు

భారత్‌లో రాబోయే పదేళ్లలో దాదాపు రూ.6 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని జపాన్ లక్ష్యంగా పెట్టుకుంది. కీలక గనులు, రక్షణ, సాంకేతిక రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి. జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో జరిగిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు మోదీ తెలిపారు. ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, స్వచ్ఛ ఇంధనం, టెలికం, ఫార్మా, సరికొత్త, అధునాతన సాంకేతికత తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య 13 ఒప్పందాలు జరిగాయి.

చైనాలో జిన్‌పింగ్, పుతిన్‌తో భేటీ

జపాన్ పర్యటనను ముగించుకొని మోదీ చైనా వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1న తియాంజిన్‌లో జరిగే ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. అక్కడ జిన్‌పింగ్‌తో భేటీ కానున్నారు. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత మోదీ చైనా పర్యటనకు వెళ్లడం ఇదే మొదటిసారి. మరోవైపు, రష్యా అధ్యక్షుడు పుతిన్ సోమవారం మోదీతో సమావేశమనున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. అలాగే, డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు. రష్యా చమురును కొంటున్నందుకే ట్రంప్ భారత్‌పై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే.



టోక్యోలో ప్రధాని మోదీకి స్థానిక ఆలయ పూజారి 'దారుమా డాల్'ను బహుమతిగా ఇచ్చారు. జపాన్ సంప్రదాయంలో అదృష్టం, పట్టుదలకు చిహ్నంగా భావించే ఈ బొమ్మను.. ఇరుదేశాల మధ్య సుహృద్భావానికి ప్రతీకగా అందించినట్లు సమాచారం.

ఒమన్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం: గోయల్

న్యూఢిల్లీ, ఆగస్టు 29: అమెరికా టారిఫ్‌ల నేపథ్యంలో కేంద్రం ఆయా పరిశ్రమలకు కొత్త మార్కెట్లు తీసుకొచ్చేందుకు వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోంది. ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారు కానుందని.. సౌదీ అరేబియా, ఖతార్ కూడా భారత్‌తో ఒప్పందాలపై చర్చలు జరపాలనుకుంటున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఒక దేశం ఏకపక్ష చర్యల కారణంగా వాణిజ్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన అనిశ్చితులను ఎదుర్కోవడానికి ఎగుమతిదారులకు అన్ని రకాల మద్దతునిస్తామని చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం యూరోపియన్ యూనియన్‌తోనూ చర్చలు ఊపందుకున్నాయన్నారు. 'ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటా 2 శాతమే. అమెరికాకు ఎగుమతి చేసే వాటిలో దాదాపు 40% వస్తువులు 50% సుంకాల పరిధిలోకి రావు. దీంతో ప్రభావం తక్కువే..' అని వివరించారు.

థాయ్‌లాండ్ ప్రధాని ఔట్

» పేటోంగ్టార్న్ షినవత్రాను తొలగించిన ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం

బ్యాంకాక్, ఆగస్టు 29: థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాపై ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం వేటు వేసింది. ఆమెను పదవి నుంచి తొలగిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది. పేటోంగ్టార్న్ నైతిక ప్రమాణాల ఉల్లంఘనకు పాల్పడినట్లు రుజువైందని పేర్కొంది. కంబోడియాతో సరిహద్దు ఉద్రిక్తతల సమయంలో ఆ దేశ నేత హున్ సేన్‌తో మాట్లాడిన ఓ ఫోన్‌కాల్ ఆమె పదవికి ఎసరు తెచ్చింది. జూన్‌లో వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ అయింది. ఆ కాల్‌లో హున్ సేన్‌ను పేటోంగ్టార్న్ 'అంకుల్'గా సంబోధించారని, థాయ్ సీనియర్ మిలటరీ కమాండర్‌ను విమర్శించారని అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. అయితే ఆ తర్వాత తన వ్యాఖ్యలపై పేటోంగ్టార్న్ క్షమాపణలు చెప్పారు. కాగా, శ్రేత్త థావిసిన్ స్థానంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పేటోంగ్టార్న్ షినవత్రా దాదాపు ఏడాది పాటు పదవిలో కొనసాగారు. థావిసిన్‌ను కూడా రాజ్యాంగ న్యాయస్థానమే పదవి నుంచి తప్పించింది. ఇప్పుడు షినవత్రాపై వేటు నేపథ్యంలో ఆ దేశ పార్లమెంట్ కొత్త ప్రధానిని ఎన్నుకోవాల్సి ఉంది.



లోకం తీరు



భారత ఏనుగును అమెరికా ఎలుక ఢీకొన్నట్టే!

» అమెరికా సుంకాలతో భారత్ కొత్త మార్కెట్లు వెతుక్కుంటుంది

» బ్రిక్స్ కూటమి బలోపేతం అవుతుంది

» అమెరికా ఆర్థికవేత్త రిచర్డ్ వూల్ఫ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 29: భారత్‌పై అమెరికా అడ్డగోలుగా సుంకాలు విధించడాన్ని ఆ దేశ ఆర్థికవేత్త రిచర్డ్ వూల్ఫ్ తప్పుబట్టారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న భారత్ అతి పెద్ద మార్కెట్ అని.. అలాంటి దేశంతో అమెరికా తీరు ఏనుగును ఎలుక ఢీకొట్టినట్టేనని వ్యాఖ్యానించారు. తాజాగా రష్యా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిచర్డ్ వూల్ఫ్ మాట్లాడారు. "భారత్ విషయంలో అమెరికా చాలా కఠినంగా ఉన్నట్టు వ్యవహరిస్తోంది. భారత్‌వైపు తుపాకీ గురిపెట్టానని అనుకుంటూ.. తన కాలిని తానే కాల్చుకుంటోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధిస్తే.. రష్యా కొత్త మార్కెట్లను వెతుక్కుంది. ఇప్పుడు అమెరికా సుంకాలతో భారత సరుకులను అడ్డుకుంటే.. భారత్ ఆ సరుకులను బ్రిక్స్ కూటమికి అమ్ముకుంటుంది. దీనితో బ్రిక్స్ కూటమి బలోపేతం అవుతుంది. పశ్చిమ దేశాలకు ఆర్థిక ప్రత్యామ్నాయంగా ఎదుగుతుంది. భారత్‌పై అడ్డగోలు సుంకాలతో ఒక రకంగా బ్రిక్స్ కూటమిని అమెరికాయే బలోపేతం చేస్తోంది.." అని పేర్కొన్నారు. మరోవైపు, పాక్‌తో యుద్ధాన్ని తానే ఆపానన్న మాటను భారత్ తిరస్కరించినందుకు ట్రంప్ వ్యక్తిగత ద్వేషంతోనే అడ్డగోలుగా 50% సుంకాలు విధించారని అమెరికా ఆర్థిక సేవల సంస్థ జెఫరీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. నోబెల్ శాంతి బహుమతి కోసం తహతహలాడుతున్న ట్రంప్.. భారత్ తీరుతో ఆ అవకాశానికి దూరమయ్యానని భావిస్తున్నారని తెలిపింది. ట్రంప్ సుంకాలతో భారత ఆర్థిక వ్యవస్థకు రూ.5 లక్షల కోట్ల వరకు నష్టం జరుగుతుందని జెఫరీస్ సంస్థ ఈక్విటీ స్ట్రేటజీ విభాగం అధిపతి క్రిస్ వుడ్ అంచనా వేశారు.

బిహార్ ఓటరు జాబితాలో విదేశీయులు

న్యూఢిల్లీ, ఆగస్టు 29: నిన్న ఇద్దరు పాక్ మహిళలు.. ఇప్పుడు అఫ్ఘానిస్థాన్, మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్ పౌరులు బిహార్ ఓటరు జాబితాలో కనిపించారు. వెంటనే అప్రమత్తమైన ఎన్నికల సంఘం(ఈసీ) ఆ జాబితాలో గుర్తించిన విదేశీయులకు నోటీసులు జారీచేసింది. బిహార్‌లో సమగ్ర ఓటరు సవరణ(సర్) చేపట్టిన ఈసీ 3లక్షల మందికి నోటీసులు జారీచేసింది. వీరిలో బిహార్‌లో ఓటరు కార్డులు పొందిన పలువురు విదేశీయులు కూడా ఉన్నట్టు ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' ప్రక్రియలో భాగంగా ఎన్నికల అధికారులు జరిపిన ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో ఈ విషయం బయటపడింది. "బిహార్ ఓటరు జాబితాను లోతుగా ప్రక్షాళన జరుపుతున్నాం. ఈ ప్రక్రియ ఈ నెల 1న మొదలైంది. శనివారం వరకు కొనసాగుతుంది. ఈ క్రమంలో అనర్హులుగా తేలినవారిని జాబితా నుంచి తొలగిస్తాం. తుది జాబితాను సెప్టెంబరు 30వ తేదీన ప్రకటిస్తాం." అని ఈసీ వర్గాలు తెలిపాయి. నోటీసులు అందుకున్న వారు వారం రోజుల్లో ఎన్నికల అధికారి ఎదుట హాజరై తమ పత్రాలను తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. కాగా, ఓటరు జాబితాలో పేర్ల చేర్పు లేక తొలగింపును కోరుతూ గురువారంనాటికి వ్యక్తుల నుంచి 1,95,802 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో 24,991 దరఖాస్తులను ఈసీ ఇప్పటికే పరిష్కరించిందని వెల్లడించింది. ఇక.. సీపీఐ (ఎమ్-ఎల్) 79 దరఖాస్తులు, ప్రతిపక్ష పార్టీ ఆర్జేడీ మూడు దరఖాస్తులు ఇచ్చిందని తెలిపింది. అభ్యంతరం చెబుతూ బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఇంతవరకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదని పేర్కొంది.

అమిత్‌షా తల నరకాలి!

బంగ్లా నుంచి చొరబాట్లను అడ్డుకోవడంలో ఆయన విఫలమయ్యారు

» టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా వ్యాఖ్య

» ఆమెపై పోలీసులకు బీజేపీ ఫిర్యాదు

కోల్‌కతా, ఆగస్టు 29: కేంద్ర హోం మంత్రి అమిత్ షాను లక్ష్యంగా చేసుకుని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. గురువారం నదియా జిల్లాలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సరిహద్దు భద్రత విషయంలో తన బాధ్యతల నుంచి తప్పించుకుంటోందన్నారు. ఈ సందర్భంగా అమిత్‌షాపై వ్యక్తిగత విమర్శలకు దిగారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను అడ్డుకోవడంలో షా విఫలమయ్యారన్నారు. ఆయన తలను నరికి బల్లపై పెట్టాలంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశ సరిహద్దును ఐదు దళాలు కాపాడుతున్నాయని, అది నేరుగా హోం మంత్రిత్వ శాఖ బాధ్యతని పేర్కొన్నారు. ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చొరబాట్లపై మాట్లాడుతున్నప్పుడు ముందు వరుసలో ఉన్న హోం మంత్రి చప్పట్లు కొట్టారన్నారు. "మన సరిహద్దులను కాపాడటానికి ఎవరూ లేకపోతే, వేరే దేశం నుంచి ప్రతిరోజూ ప్రజలు ప్రవేశిస్తుంటే, చొరబాటుదారులు మన తల్లులు, సోదరీమణులపై కన్నేయడంతోపాటు మన భూములను లాక్కుంటున్నారని మన దేశ పౌరులు ఫిర్యాదు చేస్తుంటే.. మొదట మీరు అమిత్ షా తల నరికి బల్లపై పెట్టాలి" అని వ్యాఖ్యానించారు. హోం మంత్రిత్వ శాఖ, హోం మంత్రి దేశ సరిహద్దులను రక్షించలేనప్పుడు, ప్రధాని స్వయంగా చొరబాటుదారులు మన ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని చెప్పినప్పుడు తప్పు మీదా? మాదా? అని ఆమె ప్రశ్నించారు. మొయిత్రా వ్యాఖ్యల పట్ల బీజేపీ స్పందించింది. ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. మోయిత్రా వ్యాఖ్యలు అసహ్యం కలిగించేలా, అభ్యంతరకరంగా ఉన్నాయని బీజేపీ నేతలు మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు ఆమె, టీఎంసీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఇదే టీఎంసీ వైఖరా అని ప్రశ్నించారు. ఒకవేళ కాకుంటే క్షమాపణలు చెప్పడమేకాకుండా మోయిత్రాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా మొయిత్రా వ్యాఖ్యలపై టీఎంసీ స్పందించలేదు.



రాహుల్ సభపై దుమారం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. బీజేపీ దర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆదిత్య నారాయణ్ ఇచ్చిన మరో ఫిర్యాదుతో పోలీసులు దర్భంగాలోని సింఘ్వారా ప్రాంతానికి చెందిన మహ్మద్ రిజ్వీ అనే 20 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. వేదికపైనుంచి మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిలో రిజ్వీ కూడా ఉన్నారని బీజేపీ నేతలు కేసు పెట్టారు. మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పాట్నాలో బీజేపీ-కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు విసరగా, బీజేపీ కార్యకర్తలు పార్టీ జెండా కర్రలు విసిరారు. దీంతో సదాఖత్ ఆశ్రమ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. మోదీ తల్లిపై దూషణ నేపథ్యంలో రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ రాజకీయాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయని షా వ్యాఖ్యానించారు. మోదీ తల్లి పేదరికంలో నుంచి వచ్చినా విలువలు నేర్పారని, అందువల్లే మోదీ ప్రధాని స్థాయికి చేరుకున్నారని షా చెప్పారు. ఒక పేద తల్లి కుమారుడు 11 ఏళ్లుగా ప్రధాని పీఠంపై ఉండటాన్ని కాంగ్రెస్ జీర్ణం చేసుకోలేకపోతోందన్నారు. మోదీ తల్లిని దూషిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఉపయోగించిన భాష అసభ్యకరంగా ఉందని బిహార్ సీఎం నితీశ్ ఖండించారు. కాగా, ఓటర్ అధికార్ యాత్ర నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని జైరాం రమేశ్ అన్నారు.

ఎంపీలందరి మద్దతు కోరుతా

» ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ముంబై, ఆగస్టు 29: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరినీ కోరుతానని ప్రతిపక్షాల అభ్యర్థి బీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి పార్టీలకు అతీతంగా ఎంపీలందరికీ లేఖలు రాస్తానని ప్రకటించారు. ఉపరాష్ట్రపతిగా తనకు అవకాశం లభిస్తే రాజ్యాంగాన్ని కాపాడతానని పేర్కొన్నారు. మహారాష్ట్రలో శుక్రవారం పర్యటించిన బీ సుదర్శన్ రెడ్డి.. శివసేన(యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌ను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన సుదర్శన్‌రెడ్డి.. ఉపరాష్ట్రపతి ఎన్నికను దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీగా చూడడం తగదన్నారు. తాను ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, ఏ పార్టీలోనూ చేరే ఆలోచన కూడా లేదని చెప్పారు. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నికలో తమతోపాటు మహావికాస్ అఘాడీలోని పార్టీలకు చెందిన ఎంపీలందరి మద్దతు ప్రతిపక్షాల అభ్యర్థికేనని తన కలిసిన బీ సుదర్శన్‌రెడ్డికి ఉద్ధవ్ ఠాక్రే హామీ ఇచ్చారు. దేశం మీద ప్రేమ ఉన్న ఎన్డీఏ ఎంపీలంతా ఉపరాష్ట్రపతి ఎన్నికలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీ సుదర్శన్‌రెడ్డికే ఓటేస్తారని ఠాక్రే తెలిపారు. ఓ రాష్ట్ర ముఖ్యమంత్రిని రాజ్‌భవన్‌లో అరెస్టు చేయించిన వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి ఏం గౌరవం తీసుకొస్తారంటూ ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి ఎన్‌సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్‌పవార్ ప్రశ్నించారు. సీపీ రాధాకృష్ణన్ ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఆ రాష్ట్ర సీఎం హేమంత్ సోరేన్‌ను రాజ్‌భవన్‌లోనే అరెస్టు చేయించిన విషయాన్ని పవార్ గుర్తు చేశారు. రాధాకృష్ణన్‌కు వ్యవస్థలపై ఎలాంటి గౌరవం ఉందో ఆ అరెస్టు చెబుతోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో భేటీ అనంతరం పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా, కాగా, ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆమోదిస్తూ వామపక్షాలు శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈ ప్రకటన విడుదల చేసిన వామపక్షాల్లో సీపీఐ (ఎం), సీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉన్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నిక రెండు విభిన్న సిద్ధాంతాల మధ్య పోరాటమని ఈ పార్టీలు పేర్కొన్నాయి.



ఉద్ధవ్ ఠాక్రేతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి


ఉత్తరాఖండ్‌లో వరుస మేఘ విస్ఫోటాలు

» నాలుగు జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్.. ఐదుగురి మృతి.. 11మంది గల్లంతు

డెహ్రాడూన్, ఆగస్టు 29: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో శుక్రవారం మేఘ విస్ఫోటాలు సంభవించాయి. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రంలో ఐదుగురు చనిపోయారు. 11మంది గల్లంతయ్యారు. అనేక మంది ఇళ్లు కొట్టుకుపోయాయి. కొండచరియలు విరిగిపడి చాలా ప్రాంతాల్లో రోడ్లు మూసుకుపోయాయి. శుక్రవారం ఉదయం చమోలీ, టెహ్రీ, బాఘేశ్వర్, రుద్రప్రయాగ జిల్లాల్లో మేఘ విస్ఫోటాలు సంభవించాయి. ఈ క్రమంలో కొండచరియలు విరిగిపడటంతో చమోలీ జిల్లాలోని ఓ గ్రామంలో పశువుల కొట్టం పూర్తిగా మట్టిలో కూరుకుపోయింది. అందులో ఉన్న దంపతులిద్దరూ చనిపోయారు. ఇరవైకి పైగా పశువులు గల్లంతైనట్లు తెలుస్తోంది. బాఘేశ్వర్ జిల్లాలో ఇద్దరు చనిపోయారు. ముగ్గురు గల్లంతయ్యారు. భారీ వరదలతో రుద్రప్రయాగ జిల్లాలో ఓ మహిళ చనిపోయింది. అలకనంద, మందాకిని నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

ముగ్గురు పిల్లలతో భారత మహిళపై భారం

» మోహన్ భాగవత్‌పై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ముగ్గురు పిల్లల పేరుతో భారతీయ మహిళలపై భారం పెంచొద్దని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ వ్యాఖ్యానించారు. ముగ్గురు పిల్లలుంటే ఆ కుటుంబంలోని పిల్లల మధ్య సాన్నిహిత్య సంబంధాలు దృఢమవుతాయన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యల్లో ద్వంద్వార్థాలున్నాయని శుక్రవారం దారుసలాంలో మీడియాతో అన్నారు. ముగ్గురు పిల్లలను కనాలని భారతీయ మహిళలపై భారం మోపాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారని మోహన్ భాగవత్‌ను ప్రశ్నించారు. ప్రధాని మోదీ హయాంలో దేశంలోని ముస్లింలపై శత్రుత్వం సుస్థిరమైందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్, దానికి మద్దతుగా నిలిచిన మితవాద సంస్థలు నిరంతరం మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని జనాభా పెరుగుదలపై తప్పుడు సమాచారంతో విమర్శలు చేస్తుంటాయని, కానీ వాస్తవ పరిస్థితులు దానికి భిన్నమని చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారం హిందువులు 80% కాగా, ముస్లింలు కేవలం 14.23 శాతమని స్పష్టం చేశారు. ఏది ఏమైనా ప్రజల వ్యక్తిగత, కుటుంబ జీవితంపై మాట్లాడేందుకు మీరెవరని భాగవత్‌ను ప్రశ్నించారు.

వివేకా హత్య కేసును మళ్లీ దర్యాప్తు చేయాలి

- సీబీఐ విచారణ సజావుగా లేదన్న సునీత ఆరోపణల్లో నిజం ఉంది
- జగన్‌ను, అవినాశ్‌రెడ్డిని కాపాడడానికి ప్రధాని మోదీ సీబీఐ గొంతు నొక్కుతున్నారు: షర్మిల



అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై సీబీఐ మళ్లీ దర్యాప్తు జరపాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం మీడియాతో ఆమె మాట్లాడారు. 'వివేకా హత్య కేసు దర్యాప్తులో ఆయన కుమార్తె సునీతారెడ్డికి న్యాయం జరగలేదు. దీనిపై సీబీఐ మళ్లీ దర్యాప్తు ఎందుకు చేయకూడదు? ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడు. మోదీ చేతిలో సీబీఐ కీలుబొమ్మ. జగన్ కోసం సీబీఐ గొంతును మోదీ నొక్కుతున్నారు. జగన్ కోసం అవినాశ్‌రెడ్డిని కాపాడుతున్నారు. నిజంగా వివేకా హత్య కేసులో నిందితులను పట్టుకోవాలంటే నేరస్థులెవరో సీబీఐ ఎప్పుడో తేల్చేసేది. సీబీఐ వద్ద గూగుల్ మ్యాప్‌లు, లొకేషన్లతో సహా సాక్ష్యాధారాలన్నీ ఉన్నాయి. సీబీఐ విచారణ సరిగా లేదని సునీత చేస్తున్న ఆరోపణల్లో నిజముంది' అని షర్మిల స్పష్టంచేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం హయాంలోనే కేంద్రం ప్రకటించిందంటూ గుర్తు చేసిన షర్మిల.. నాడు ప్రధాని మోదీని జగన్ ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. అధికారం పోయిన తరువాత నేడు విశాఖ ఉక్కు కోసం పోరాటం చేస్తామని ప్రకటించడానికి జగన్‌కు సిగ్గుండాలన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో పుట్టిన టీడీపీ ఈ విషయంలో మౌనంగా ఉండడం ఏమిటంటూ షర్మిల నిలదీశారు.

మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

- జైలు నుంచి విడుదలైన దిలీప్

విజయవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించేందుకు మధ్యంతర బెయిల్, మద్యం కేసులో రెగ్యులర్ బెయిల్ ఇప్పించాలని ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ వచ్చే నెల రెండో తేదీకి వాయిదా పడింది. అదేవిధంగా కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, చెరుకూరి వెంకటేష్ నాయుడు దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్‌పై విచారణ కూడా 2వ తేదీకి వాయిదా వేసింది. కాగా, మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న పైలా దిలీప్‌కు బెయిల్ మంజూరు కావడంతో విజయవాడ జిల్లా జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యాడు. దిలీప్ సతీమణి కోర్టుకు శుక్రవారం పూచీకత్తులను సమర్పించారు. సిట్ అధికారులు తన తల్లిని బెదిరిస్తున్నారని లీప్ ఏసీబీ కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని సిట్ అధికారులను ఆదేశిస్తూ విచారణను మూడో తేదీకి కోర్టు వాయిదా వేసింది.


కోర్టుకు హాజరైన వరుణ్ పురుషోత్తం

మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న వరుణ్ పురుషోత్తం విజయవాడ ఏసీబీ కోర్టుకు శుక్రవారం హాజరయ్యాడు. స్కాంలో నగదు లావాదేవీలు నిర్వహించిన వారి ఆస్తులను జప్తు చేస్తామని సిట్ అధికారులు మొత్తం 11 మందికి ఏసీబీ కోర్టు అనుమతితో నోటీసులు జారీ చేశారు. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బూనేటి చాణక్య, కాశీచయనుల శ్రీనివాస్, పైలా దిలీప్, వరుణ్ పురుషోత్తం, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ డిస్టిలరీస్ అధినేత నల్లనన్ మతప్పన్, ఎస్ఎన్‌జే షుగర్స్ అధినేత నల్లనన్ మేతప్పన్, ఎస్‌బీఐ చెన్నై శాఖ, హైదరాబాద్ ఐసీఐసీఐ బ్రాంచ్, విజయవాడ ఖజానా అధికారికి ఈ నోటీసులు అందజేశారు. వారిలో వరుణ్ పురుషోత్తం కోర్టుకు హాజరై తన అభిప్రాయాన్ని మెమో రూపంలో తెలియజేశాడు. నల్లనన్ మతప్పన్ తరఫున న్యాయవాది హాజరయ్యారు.

'పాత పెన్షన్' పోరాటానికి ఫ్యాప్టో మద్దతు

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానం తిరిగి ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో సెప్టెంబరు 1న సీపీఎస్ ఉద్యోగుల సంఘం విజయవాడలో చేపడుతున్న పోరాటానికి మద్దతిస్తున్నట్టు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రకటించింది. సామాజిక భద్రతలేని సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని, దీనిపై రోడ్‌మ్యాప్ ప్రకటించాలనే డిమాండ్‌తో సీపీఎస్ ఉద్యోగుల సంఘం పోరాటాన్ని ప్రకటించింది.

పిన్నెల్లి సోదరులకు ఝలక్



టీడీపీ నేతల హత్య కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత

నేరపూరిత కుట్రలో పిటిషనర్ల పాత్ర ఉందన్న ప్రాసిక్యూషన్ వాదనలో బలం ఉంది: హైకోర్టు

- వారిని కస్టడీలో విచారించడం చాలా ముఖ్యం
- బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఆటంకం
- చట్టం ముందు అంతా సమానమే
- ముందస్తు బెయిల్ పొందడానికి వారు అనర్హులు
- తీర్పులో న్యాయమూర్తి స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య కేసులో ముందస్తు బెయిల్ కోసం వారు దాఖలుచేసిన పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు శుక్రవారం తీర్పు ఇచ్చారు. సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేవరకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని పిన్నెల్లి సోదరుల తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. పిటిషన్లపై విచారణ జరిపి నిర్ణయం వెల్లడించిన తర్వాత ఆ తరహా ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. పిటిషన్లను కొట్టివేసిన అనంతరం అప్పీల్ వేసుకునే వరకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు సైతం తప్పుపట్టిందని గుర్తుచేశారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో ముందస్తు బెయిల్ కోసం పిన్నెల్లి సోదరులు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై గురువారం హైకోర్టు తుది విచారణ జరిపింది. పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఫిర్యాదుదారు తోట ఆంజనేయులు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ నిర్ణయం వెలువరించారు.

తీర్పులో ఏముందంటే...

'టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్యల వెనుక కీలక కుట్రదారులు పిన్నెల్లి సోదరులేననేది వారిపై ఉన్న ప్రధాన ఆరోపణ. సాక్షుల వాంగ్మూలాలు పరిశీలిస్తే ఈ రెండు క్రూరమైన హత్యలకు జరిగిన నేరపూరిత కుట్రలో పిటిషనర్లకు భాగస్వామ్యం ఉందన్న ప్రాసిక్యూషన్ వాదనలో బలం ఉంది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం వెల్లడించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. నేర తీవ్రత, ఆధారాలు, ఇతర పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే.. పిటిషనర్లకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుంది. హత్య ఘటనలో కీలక కుట్రదారులుగా ఉన్న పిటిషనర్లు ఇప్పటివరకు అరెస్టు కాలేదు. వచ్చిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తునకు వారిని కస్టడీలోకి తీసుకుని విచారించడం అత్యంత ముఖ్యం. దురుద్దేశపూర్వకంగా కేసులో ఇరికించారని, స్వేచ్ఛను దుర్వినియోగం చేయరంటూ ప్రాథమిక అభిప్రాయానికి వచ్చి.. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి. హత్య కేసుల్లో దర్యాప్తు కీలక దశలో ఉన్నప్పుడు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి వీల్లేదని పలు తీర్పులు ఉన్నాయి. ముందస్తు బెయిల్ మంజూరుకు పిటిషనర్ల హోదా ముఖ్యం కాదు. చట్టం ముందు అందరూ సమానులే. ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్లు అనర్హులు. ఈ నేపథ్యంలో వ్యాజ్యాలను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

విజయనగరం రైల్వేస్టేషన్ నుంచి శుక్రవారం ఉదయం కాకినాడ పోర్టుకు బయలుదేరిన గూడ్స్ రైలు కొద్ది నిమిషాల్లోనే పట్టాలు తప్పింది. దెబ్బతిన్న వ్యాగన్లను పక్కకు తొలగించి అధికారులు ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

తాడిపత్రి వెళ్లేందుకు పెద్దారెడ్డికి సుప్రీం అనుమతి

- హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై స్టే

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి వెళ్లేందుకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులను నిలిపివేసింది. తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లేందుకు భద్రత కల్పించాలని ఆయన గతంలో హైకోర్టును ఆశ్రయించగా.. పోలీసులు భద్రత కల్పించాలని సింగిల్ జడ్జి బెంచ్ తీర్పు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను అనంతపురం ఎస్పీ సవాల్ చేశారు. ఆ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. ఈ ఆదేశాలపై పెద్దారెడ్డి ఈ నెల 22న సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఆయన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే, అల్లంకి రమేశ్ వాదనలు వినిపించారు. భద్రతకు అవసరమైన ఖర్చులన్నీ తామే భరిస్తామని తెలియజేశారు. దీంతో ధర్మాసనం ఏపీ హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థించింది. డివిజన్ బెంచ్ ఉత్తర్వులపై స్టే విధించింది. పెద్దారెడ్డి తాడిపత్రి వెళ్లేందుకు అనుమతి ఇస్తూ.. విచారణను ముగించింది.

ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మికి ఊరట

- తెలంగాణ హైకోర్టు తాజా తీర్పుపై సుప్రీం స్టే
- ప్రతివాదులందరికీ నోటీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆమెను మళ్లీ నిందితురాలిగా చేరుస్తూ ఇచ్చిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. గతంలో ఈ కేసులో తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మిని నిందితుల జాబితా నుంచి తొలగించింది. ఈ నిర్ణయంపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శ్రీలక్ష్మి పేరు తొలగించడాన్ని హైకోర్టు పునఃపరిశీలించాలని సుప్రీం ఆదేశించింది. ఆ తర్వాత హైకోర్టు మళ్లీ ఆమె విచారణను ఎదుర్కోవలసిందేనని స్పష్టం చేస్తూ ఇటీవల తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఈ నెల 12న శ్రీలక్ష్మి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆమె పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. గతంలో శ్రీలక్ష్మిని నిందితుల జాబితా నుంచి తొలగించిన హైకోర్టే.. మళ్లీ ఇప్పుడు నిందితురాలిగా చేరుస్తూ తీర్పు ఇచ్చిందా అని ప్రశ్నించింది. ఆ తీర్పుపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వంతోపాటు ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సెప్టెంబరు 28కి వాయిదా వేసింది.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

శ్రీవారి సేవలో జస్టిస్ జ్యోతిర్మయి

తిరుమల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం వేకువజామున శ్రీవారి ఆలయంలో అభిషేక సేవలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురహరి శ్రీరామన్ కూడా అభిషేకసేవలో శ్రీవారిని దర్శించుకున్నారు.

ముగిసిన నూర్ మహమ్మద్ కస్టడీ

- కడప సెంట్రల్ జైలుకు తరలింపు

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్ పోలీసు కస్టడీ శుక్రవారం ముగిసింది. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు విచారించిన పోలీసులు, పుట్టపర్తి కోర్టులో హాజరుపరచి, తిరిగి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. నూర్ మహమ్మద్ ప్రియురాలు పర్వీన్‌ను కూడా విచారించి పంపించినట్టు సమాచారం.

ఎన్ఐఏ కోర్టుకు ఉగ్ర కుట్ర నిందితుడు

విశాఖపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఐసిస్ ఉగ్రవాదుల కుట్ర కేసులో మరో కీలక నిందితుడు ఆరిఫ్ హుస్సేన్ అలియాస్ అబూ తలిబ్‌ను ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేసిన జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఏ) విశాఖపట్నం కోర్టులో శుక్రవారం హాజరుపరిచింది. బిహార్‌కు చెందిన ఆరిఫ్ దేశం విడిచి పారిపోతుండగా అరెస్ట్ చేశారు. కోర్టు నిందితునికి సెప్టెంబరు 12వ తేదీ వరకు రిమాండ్ విధించగా విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన సిరాజ్-ఉర్.రెహ్మాన్, సయ్యద్ సమీర్‌తో ఆరిఫ్‌కు సంబంధాలున్నట్టు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్ర కార్యకలాపాలకు ఆయుధాల అక్రమ రవాణా చేయడంలో అతను పాల్గొన్నట్టు వెల్లడైంది.

టీడీఆర్ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

- కరుణాకర్‌రెడ్డి అక్రమాలను నిగ్గు తేల్చాలి
- కీలక అధికారిణి పాత్రపైనా దర్యాప్తు జరపాలి
- ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లేఖ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో 2019-24 మధ్య కాలంలో రూ.వందల కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగింది. దానిపై సమగ్ర విచారణ జరపాలి' అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని శుక్రవారం విలేకరులకు విడుదల చేశారు. "తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఇటీవల మాట్లాడుతూ, 'టీడీఆర్ బాండ్ల జారీలో రాష్ట్ర స్థాయి అధికారిణి ఆధ్వర్యంలో తిరుపతిలోనే రూ.వందల కోట్ల అక్రమాలు జరిగాయి. ఆ డబ్బంతా ఆ అధికారిణికే చేరింది. నేను వ్యక్తిగతంగా ఎలాంటి అవినీతికి పాల్పడలేదు' అంటూ సెల్ఫ్ సర్టిఫికేట్ ఇచ్చుకున్నారు. తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని అప్పటి అధికార పార్టీ శాసనసభ్యుడు, అప్పుడు కీలక పదవిలో ఉన్న అధికారిణిపైనే ఆరోపణలు చేస్తున్నందున దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. దీనికోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి. వైసీపీ నేత, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఏ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డాడు, అయన ఆరోపించిన కీలక అధికారిణి ఎవరు? ఆమె పాత్ర ఎంత? తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి. జరిగిన ఆర్థిక నష్టాన్ని వారి నుంచే రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలి' అని రాంగోపాల్ రెడ్డి ఆ లేఖలో సీఎంని కోరారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం: పట్టాభి

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం 14 నెలల కాలంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చే దిశగా పనిచేస్తోంది.' అని పట్టాభి వివరించారు.

ప్రభుత్వ పథకాలపై వైసీపీ తప్పుడు ప్రచారం: సునీత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళా సంక్షేమానికి, సాధికారతకు పెద్దపీట వేసేవిధంగా పథకాలు అమలుచేస్తోందని తెలుగు నాడు అంగన్వాడీ డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వ పథకాలపై ప్రజలను తప్పుదారి పట్టించేలా దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

- భారీగా ఆయుధాలు స్వాధీనం



ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల ఆయుధాలు, పేలుడు సామగ్రి

చింతూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు, జవాన్లకు నడుమ శుక్రవారం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇరువైపులా ఎటువంటి ప్రాణ నష్టం లేదు. సంఘటనా స్థలంలో మావోయిస్టులు వదిలివెళ్లిన ఆయుధాలు, పేలుడు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ఘటన వివరాలను మీడియాకు తెలిపారు. 'నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అటవీ ప్రాంతం కసోడ్, ఖోడ్పల్, మడోరా తదితర ప్రాంతాలలో జవాన్లు 'మాడ్ బచావో' ఆపరేషన్ మొదలు పెట్టారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ జవాన్లు, మావోయిస్టు సంచారం ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరుపక్షాల నడుమ ఎదురు కాల్పులు జరిగా యి. జవాన్ల ధాటికి నిలువలేని మాడ్ డివిజన్ మావోయిస్టులు సం ఘటనా స్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు సామగ్రిని వదిలి తప్పించుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టిన డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, ఐటీబీపీ జవాన్లు పలు ఆధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు' అని ఐజీ పేర్కొన్నారు.




దక్షిణ భారత ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

సహకారం, సమన్వయం కీలకం

- సమస్యల పరిష్కారానికి కార్యాచరణ కీలకం
- దక్షిణ భారత ప్రాంతీయ పోలీసు సమన్వయ కమిటీ సమావేశం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దక్షిణ భారత రాష్ట్రాలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సవాళ్లు, సమస్యలపై అధికారులందరూ ఒక కార్యాచరణతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. తిరుపతి వేదికగా శుక్రవారం దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి డీజీపీలు, ఉన్నతస్థాయి పోలీసు అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొదటగా ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్వాగత ఉపన్యాసం చేశారు. సదస్సులో ఉగ్రవాద కార్యకలాపాలు, గ్యాంగులు, డ్రగ్ మాఫియా, అక్రమ ఆయుధ రవాణా, అంతర్రాష్ట్ర నేరస్థుల డేటా బేస్‌ను తయారు చేయడం, సామూహిక ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, ఉగ్రవాద సమాచార పంపకాల వ్యవస్థ, సైబర్ నేరాలు, టెక్నాలజీ వినియోగం, డిజిటల్ ఫోరెన్సిక్ ల్యాబ్ స్థాపనపై చర్చించారు. 'మహిళల కిడ్నాప్, ట్రాఫికింగ్ కేసులపై సంయుక్త విచారణ, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే రెచ్చగొట్టే అంశాలపై నిఘా, పోలీసు శిక్షణ, సామర్థ్యం పెంపుపై పరస్పర సహకారం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలసదారులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవడం, ప్రధాన రవాణా మార్గాలకు సంబంధించి సమాచారం పంచుకోవడం...' వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీంతోపాటు అంతర్రాష్ట్ర నేరస్థుల డేటాబేస్‌ను తయారు చేసి సమష్టిగా నిఘా ఉంచాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, కేరళ డీజీపీ రావాడ చంద్రశేఖర్, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంత డీజీపీ శాలిని సింగ్, ఎనిమిది మంది అదనపు డీజీలు, 9 మంది ఐజీలు, 12 మంది డీఐజీలు, 16 మంది ఎస్పీలతో పాటు బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, సీబీఐ, ఎన్ఐఏ, ఎన్‌సీబీ తదితర కేంద్ర విభాగ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం జరిగిన గ్రాండ్ రిడ్జ్ హోటల్ పరిసరాల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు.



సీఎం జలహారతి ఇవ్వనున్న హంద్రీ-నీవా ఉపకాలువ

కుప్పంలో నేడు కృష్ణాహారతి

- కృష్ణా జలాలకు స్వాగతం పలకనున్న సీఎం చంద్రబాబు

కుప్పం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. కరువు భూతాన్ని తరిమేసేందుకు మొక్కవోని సంకల్పంతో శ్రీశైలం నుంచి తరలించిన కృష్ణా జలాలకు కుప్పంలోని హంద్రీ-నీవా ఉప కాలువ వద్ద శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతం పలికి జలహారతి ఇవ్వనున్నారు. ఇందుకోసం శుక్రవారం సాయంత్రం ఆయన కుప్పం చేరుకున్నారు. రాత్రికి కడపల్లె సమీపంలోని స్వగృహంలో బస చేశారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 3.45 గంటలదాకా కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పరమసముద్రం చెరువుతోపాటు సమీపంలోని హంద్రీ-నీవా ఉపకాలువ వద్ద జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కృష్ణా జలాలకు హారతి ఇవ్వడానికి ముందు కాలువ ఒడ్డున పైలాన్ ప్రారంభిస్తారు. సమీపంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. చంద్రబాబు పర్యటన కోసం అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేపట్టింది. కుప్పం మండలం పరమసముద్రం చెరువుతోపాటు సమీపంలోని కాలువ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజనీర్లు శుక్రవారం సమీక్షించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మలిదశ విధ్వంసం

గాజా యుద్ధంలో ఇజ్రాయెల్ దుర్మార్గాలను బాహ్యప్రపంచానికి తెలియచేస్తున్న పాత్రికేయులమీద నెతన్యాహూ కక్ష కట్టారన్న విషయం తెలిసిందే. జర్నలిస్టులని తెలియక చంపేశామనో, ఐడీఎఫ్ బలగాలు పొరబడ్డాయనో, వారు జర్నలిస్టు ముసుగులో ఉన్న టెర్రరిస్టులనో వాదిస్తూ ఆయన రెండువందలమంది జర్నలిస్టులను హత్యచేశాడు. ఇప్పుడు గాజానగరాన్ని పూర్తిగా దురాక్రమించి, ఆకలిచావులను కూడా దాటిబతికిన మిగతా పాలస్తీనియన్లను తుడిచిపెట్టేసే సరికొత్త కార్యక్రమానికి ఇజ్రాయెల్ అధినేత సంసిద్ధమవుతున్న తరుణంలో, మొన్న సోమవారం ఐదుగురు జర్నలిస్టుల దారుణ హత్య పాత్రికేయ ప్రపంచానికి మరో బలమైన హెచ్చరిక. అంతర్జాతీయ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ 'డబుల్ టాప్' విధానంలో ఈ హత్య జరిగింది. గాజాలోని నాసర్ ఆస్పత్రి కేంద్రంగా రాయ్‌టర్స్ సహా వివిధ వార్తాసంస్థలు యుద్ధాన్ని ఎంతోకాలంగా కవర్ చేస్తున్నాయని ఇజ్రాయెల్ బలగాలకు తెలుసు. అది రహస్యప్రదేశమేమీ కాదు. ఈ భవనంలోని పై అంతస్తుల్లో ఉంటున్న పాత్రికేయులను ఇజ్రాయెల్ బలగాలు గతంలో సంప్రదించిన సందర్భాలూ ఉన్నాయి. అవసరమైతే కెమెరాలతోనూ, డ్రోన్లతోనూ వీరంతా ఏం చేస్తున్నారో సులువుగా తెలుసుకోవచ్చు. కానీ, తమ వృత్తిధర్మాన్ని నిర్వహిస్తున్న పాత్రికేయులను ఇజ్రాయెల్ వేటాడింది. ఆస్పత్రి భవనంలో వైద్యుల నివాసాలున్న పై అంతస్తును ఐడీఎఫ్ బలగాలు మొదటగా పేల్చివేశాయి. ఆ దాడిలో గాయపడినవారిని కాపాడేందుకు కొందరు కొద్దిక్షణాల తరువాత పరుగులు తీశారు. వారితో పాటు ఈ ఐదుగురు పాత్రికేయులు కూడా మెట్లమీదనుంచి వెడుతూండగా, సరిగ్గా లెక్కలేసుకొని మరీ ఐడీఎఫ్ బలగాలు రెండో దాడిచేశాయి. ఏడునిముషాల తేడాలో ఉద్దేశపూర్వకంగా ఈ రెండుదాడులూ జరిగినట్టు ఒక అరబ్ చానెల్ ప్రత్యక్షప్రసారంలో స్పష్టంగా తేలిపోయింది. తొలిదాడిలో ముగ్గురు మరణిస్తే, మలిదాడిలో జర్నలిస్టులతో సహా 20మంది కన్నుమూశారు, వందమంది గాయపడ్డారు.

ఐడీఎఫ్ బలగాల కదలికలను పసిగట్టడానికి ఈ భవనంపైన ఒక కెమెరా పెట్టారని, అందుకే ఈ దాడిచేశామని ఇజ్రాయెల్ దబాయిస్తోంది. అది ప్రత్యక్షప్రసారాలు ఇవ్వడానికి ఎప్పటినుంచో ఉన్నది తప్ప, నిఘా కెమెరా కాదని మీడియా సంస్థలు అంటున్నాయి. పొరపాటుకు ఏమాత్రం ఆస్కారంలేని ప్రదేశంలో ఈ దాడి జరిగినందున, ఇజ్రాయెల్ ఎన్ని చెప్పినా, ఐదుగురు పాత్రికేయులను అది ఉద్దేశపూర్వకంగానే అంతం చేసిందని మీడియా నమ్ముతోంది. గాజాదురాక్రమణలో భాగంగా ఇజ్రాయెల్ దళాలు యుద్ధట్యాంకులతో మిగిలిన నిర్మాణాలను కూల్చివేస్తున్నాయని, తీవ్రంగా గాయపడిన పాలస్తీనియన్లను తరుముతున్నాయని వార్తలు వస్తున్నాయి. పాలస్తీనియన్లు కూలిన ఇళ్ళను పట్టుకొని వేలాడుతున్నారు, గాయపడుతున్నారు, చస్తున్నారు తప్ప, స్వస్థలాన్ని వదిలిపోవడం లేదు. వీరందరినీ ఆకలితోనూ, ఆయుధంతోనూ హతమార్చి గాజాను హస్తగతం చేసుకోవాలనుకుంటున్న నెతన్యాహూ ఈ మలివిడత దాడిలో మరింత హింసాకాండకు ఒడిగట్టబోతున్నారన్నది వాస్తవం. గాజా దుర్భిక్షంతో అల్లాడుతున్నదని ఇప్పుడు అధికారికంగా కూడా నిర్ధారణ అయింది. ఆకలిచావులవార్తలు ఎంతోకాలంగా ప్రపంచం వింటోంది. ఆహారసరఫరాలు నామమాత్రంగా సాగుతూంటే, ఆ ట్రక్కుల వెంట పరుగులు తీస్తున్నవారినీ, అన్నంకోసం గుమిగూడుతున్నవారినీ ఇజ్రాయెల్ దళాలు కాల్చిపారేస్తున్నాయి. గాజా వెలుపల వేలాది ట్రక్కులు అనుమతికోసం నిరీక్షిస్తుంటే, అర్థంలేని ఆంక్షలతో, నిషేధాలతో ఆహారం, ఔషధాలు గాజాలోకి రాకుండా ఇజ్రాయెల్ అడ్డుకుంటోంది. ఇంతటి తీవ్రమైన పరిస్థితుల్లో, ఇప్పుడు నగరాలకు దిగ్బంధం చేసి, వాటిని యుద్ధక్షేత్రాలుగా ప్రకటించి, ఆ కాస్త ఆహారాన్ని కూడా లోనకుపోనివ్వకుండా తన మలిదశ గాజా విధ్వంసాన్ని ఇజ్రాయెల్ అమలు చేయబోతోంది. పాత్రికేయుల ఊచకోత ఘటన అమెరికా అధ్యక్షుడిని కదిలించిందనీ, ఆయన యుద్ధాన్ని త్వరలోనే ముగించేందుకు కృషిచేస్తున్నారని కొన్ని కథనాలు వెంటనే ప్రచారంలోకి వచ్చాయి. బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్ వంటివారిని వెంటేసుకొని ట్రంప్ ఏదో హడావుడి చేస్తున్నారు. కానీ, గాజాను అద్భుతమైన రిసార్టుగా చూడాలన్న కోరిక నెరవేర్చడానికి శ్రమిస్తున్న నెతన్యాహూను ఇప్పట్లో ట్రంప్ వారించే అవకాశాలు లేవు. గాజా తో పోల్చితే విధ్వంసంలోనూ, మానవహననంలోనూ ఆవగింజంతలేని ఉక్రెయిన్ యుద్ధం మాత్రం ఆయనకు అతి తీవ్రంగా, దుర్మార్గమైనదిగా కనిపిస్తోంది, దానిని వెంటనే ఆపి, నోబెల్‌శాంతి కొట్టేయాలనీ అనిపిస్తోంది.

అమరావతిపై అక్కసు వైసీపీకి కొత్త కాదు!

అమరావతి అనగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తుకు వస్తారు. అమరావతి నిర్మాణం పూర్తయితే చరిత్రలో చంద్రబాబు శాశ్వతంగా నిలిచిపోతారనే దుగ్ధ వైసీపీలో కనిపిస్తోంది. నిన్న మొన్నటి వరకు సూపర్ సిక్స్‌ను అడ్డుపెట్టుకొని బతికారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం సూపర్ సక్సెస్ కావడంతో డీలా పడిపోయిన స్థితిలో అధిక వర్షాలు వైసీపీకి ఆయుధంగా మారాయి. రాజధాని అమరావతి–వరదలు అంటూ నేడు కొత్త రాగం అందుకున్నారు. ప్రజారాజధాని అమరావతిపై విషం చిమ్మడం వైసీపీకి కొత్తమీ కాదు.



అమరావతికి సంబంధం లేని ఫోటోలు చూపిస్తూ సోషల్ మీడియా వేదికగా రాజధాని మునిగిపోయిందంటూ దుష్ప్రచారం చేశారు. అయితే రాజధానిని సందర్శించిన అనేక మంది పరిశీలకులు, పాత్రికేయులు వెల్లడించిన విషయాలతో రాజధాని మునక వాస్తవం కాదని తెలుసుకొంటున్న ప్రజలు 'ఎప్పుడూ కుళ్లు రాజకీయం ప్రదర్శించడమేనా?' అంటూ వైసీపీని చీదరించుకుంటున్నారు. రాజధానిగా అమరావతి పేరును అసెంబ్లీలో ప్రతిపాదించినప్పుడు వర్షాలకు రాజధాని ప్రాంతం మునిగిపోతుందని కనీసం ఒక్కరు కూడా ప్రస్తావించలేదు. పైగా నాడు ప్రతిపక్షనాయకునిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి ఆ తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించడమే కాకుండా రాజధాని నిమిత్తం సేకరించిన 30వేల ఎకరాలు సరిపోవని, మరో 20వేల ఎకరాలు కూడా సమీకరించాలని కోరారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇస్తామని కూడా ప్రకటించారు.

కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చివేయడంతో అమరావతి విధ్వంసానికి శ్రీకారం చుట్టింది. రాజధానికి భూములు ఇచ్చిన రైతులపై దాష్టీకం ప్రదర్శించడమే కాకుండా, అక్రమంగా కేసులు పెట్టారు. ఒక దశలో మూడు రాజధానులు లేవు.. ఉన్నది ఒకటే రాజధాని, అదే విశాఖపట్నం అంటూ కూడా బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. వైసీపీ నేతల మాటలకు, చేతలకు విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తరిమికొట్టారు. విశాఖపట్నం ప్రాంత ప్రజలు కూడా ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించారు. అయినా బుద్ధి తెచ్చుకోకుండా మళ్లీ అమరావతిపై అక్కసు ప్రదర్శించడం ప్రారంభించారు.

రాజధాని పరిధిలో ప్రస్తుతం సచివాలయ భవనాలున్న ప్రాంతాలలో చుక్క నీరు నిల్వలేదు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో పనిచేస్తున్న హైకోర్టు, విట్, ఎస్ఆర్ఎం వంటి విశ్వవిద్యాలయాలు యథావిధిగానే పనిచేశాయి. రాజధాని అమరావతి నగరం ఇంకా పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదు. 80 శాతం భూములు వ్యవసాయ భూములుగానే ఉన్నాయి. ఈ భూములలో ఏ కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిల్వడం సహజం. ఇలా నిలిచిన నీటిని చూపించి సోషల్ మీడియాలో లేనిపోని ప్రచారాలు చేస్తున్నారు. ఏ రాష్ట్రంలో అయినా రాజధాని నగరాలలో రహదారులన్నీ సిమెంట్‌తో నింపివేస్తారు. దీంతో భారీ వర్షాలకు వచ్చిన నీరు ఎటూ పోయే అవకాశం లేక రోడ్లపైకి చేరుతుంది. పదేళ్ల క్రితం భారీ వర్షం నుంచి కోలుకోవడానికి ముంబాయి నగరానికి 10 రోజుల సమయం పట్టింది. రెండేళ్ల క్రితం చెన్నై నగరంలో అధిక వర్షంతో జన జీవనం మూడు రోజులపాటు స్తంభించి పోయింది. ఇక హైదరాబాద్ పరిస్థితి ప్రత్యక్షంగా మనందరికీ తెలిసిందే. ఉత్తరాదిలోని ఢిల్లీ, గురుగ్రామ్ వంటి నగరాలు భారీ వర్షం కురిసినప్పుడు అతలాకుతలం అవుతున్నాయి. ఈ విధంగా చెప్పుకొంటూపోతే ఏ నగరానికీ మినహాయింపు లభించదు.

మద్యం కుంభకోణంతో వైసీపీ పీకల్లోతు అవినీతిలో మునిగిపోయింది. వైసీపీ ఓటమికి ప్రధాన కారణాలలో ఆ పార్టీ నేతల నోటి దురద కూడా ఒకటి. 11 స్థానాలతో కనీసం అసెంబ్లీకి కూడా వెళ్లలేని స్థితిలో ఉన్నప్పటికీ నిస్సిగ్గుగా అసత్య ఆరోపణలు చేయడం మాత్రం ఆ పార్టీ నేతలు మానలేదు. రాజధానిపై లేనిపోని విషప్రచారం చేస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించడం అవసరం. లేదంటే రాజధాని అభివృద్ధికి ఇటువంటి సోషల్ మీడియా ప్రచారాలు, విద్రోహుల చర్యలు అడ్డంకిగా మారతాయి.

○ అన్నవరపు బ్రహ్మయ్య
పాత్రికేయులు

130 : రాజ్యాంగ సూత్రాలకు సమాధి

రాజ్యాంగానికి సవరణ చేసేందుకు పార్లమెంటుకు గల అధికారాలు, అందుకు అనుసరించవలసిన విధానాన్ని అధికరణ 368 విశదీకరించింది. ఆ అధికరణ లోని నిబంధన 2, ఇతర విషయాలతో పాటు ఇలా ఉన్నది: 'రాజ్యాంగంలో ఏమి పేర్కొన్నప్పటికీ ఈ రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే, లేక మార్పు చేసే, లేక తొలగించే రాజ్యాంగబద్ధమైన అధికారం పార్లమెంటుకు ఉంటుంది. రాజ్యాంగ సవరణ విధానం ఈ క్రింద ఉదహరింపబడిన విధంగా ఉంటుంది.

"రాజ్యాంగ సవరణకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభలో గాని, లేక రాజ్యసభలో గాని మాత్రమే ప్రవేశపెట్ట వలెను. ఆ బిల్లును సభకు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆమోదించవలెను. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో సగం కన్న ఎక్కువగా ఉండవలెను. లోక్‌సభలోను, రాజ్యసభలోను ఇదే విధంగా ఆమోదింపవలెను. ఆ విధంగా రెండు సభలు ఆమోదించిన తరువాత ఆ బిల్లును రాష్ట్రపతికి పంపవలెను. రాష్ట్రపతి ఆ బిల్లును తప్పనిసరిగా ఆమోదించవలెను. అప్పుడు బిల్లులో ఉదహరింపబడిన విధంగా రాజ్యాంగం సవరింపబడుతుంది".



■ పి. చిదంబరం

'పళని' పలుకు

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందగల సంఖ్యా బలం ఎన్డీఏ ప్రభుత్వానికి పార్లమెంటు ఉభయ సభలలోనూ లేదు. లోక్‌సభలో ఎన్డీఏ సభ్యులు 293 (మొత్తం సభ్యుల సంఖ్య 543) మంది మాత్రమే కాగా రాజ్యసభలోనూ పాలక కూటమికి కేవలం 133 మంది సభ్యులే (మొత్తం సభ్యుల సంఖ్య 245) ఉన్నారు. ఏ సభలో నైనా ఒక బిల్లు ఆమోదం పొందాలంటే, సభ్యులు అందరూ సభకు హాజరై బిల్లుపై ఓటింగ్‌లో పాల్గొంటే మూడింట రెండు వంతుల మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటువేసినప్పుడు మాత్రమే అది చట్ట ప్రతిపత్తి పొందడానికి అర్హమవుతుంది (ఓటింగ్‌కు హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ సవరణ బిల్లును ఆమోదించాలి. ఆ విధంగా ఆమోదించిన వారి సంఖ్య మొత్తం సభలోని స్థానాలలో సగం కన్నా ఎక్కువగా ఉండాలి. ఉదాహరణకు ఒక సభలో మొత్తం సభ్యుల సంఖ్య 300 అనుకుందాం. సభకు 150 మంది హాజరయినారు. వారిలో 100 మంది ఆ సవరణను ఆమోదించారు. అయినా ఆమోదించినట్లు కాదు. ఎందుకంటే ఆ సవరణ మొత్తం సభ్యులలో మెజారిటీ ఆమోదం పొందలేదు కనుక. సభకు కనీసం 200 మంది హాజరై వారిలో 151 మంది ఆ సవరణను ఆమోదిస్తే సభ ఆమోదం పొందినట్లుగా పరిగణితమవుతుంది. ఉభయ సభలలోను ఇదే విధంగా ఆమోదం పొందాలి. ఇలా ఏ సభలోను ఆమోదం పొందలేక పోతే రాజ్యాంగ సవరణ వీగిపోయి నట్లే). అయితే ప్రస్తుత రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు అవసరమైన మెజారిటీ పాలక ఎన్డీఏకు ఏ సభలోనూ లేదు.

ప్రతిపక్షాలు అన్నిటికీ కలిపి లోక్‌సభలో 250 మంది సభ్యులు, రాజ్యసభలో 120 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. కనుక ఆ రాజ్యాంగ సవరణ బిల్లు ఏ సభలోను ఆమోదం పొందలేదు. లోక్‌సభలో 182 మంది సభ్యులు, రాజ్యసభలో 82 మంది సభ్యులు ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే అది ఆమోదం పొందదు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ప్రతిపక్షాలు అన్నీ ఎన్డీఏకు వ్యతిరేకంగా లేవు. వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్, భారత రాష్ట్ర సమితి, బహుజన్ సమాజ్ పార్టీ, ఇంకా కొన్ని చిన్న పార్టీలు ఎన్డీఏ ప్రభుత్వానికే మద్దతునిస్తున్నాయి. ఏఐటీసీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్డీఏను వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఇండియా కూటమికి వాటి మద్దతు అంశాల ప్రాతిపదికన ఉంటుంది.

ఈ పరిస్థితులలో ఎన్డీఏ ప్రభుత్వం 'రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025'ని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. వెన్వెంటనే ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు నివేదించారు. చాలా సరళంగా కన్పిస్తున్న ఈ బిల్లు లక్ష్యమేమిటి? ఐదు సంవత్సరాలు, అంతకు మించి జైలుశిక్షకు అర్హమయ్యే నేరాభియోగాలతో అరెస్టయిన మంత్రులు (ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సైతం) జైలులో 30రోజులు ఉంటే పదవీచ్యుతులు అవుతారు. ఆ ముప్పై రోజులలో దర్యాప్తు పూర్తికావడం అసాధ్యం. చార్జిషీటును దాఖలు చేయడమూ జరిగే పని కాదు. ఆరోపణలు ఉండవు, విచారణ జరగదు, శిక్ష నిర్ధారణ కాదు. అయినప్పటికీ 31వ రోజున 'నేరస్తుడు' అనే కళంకంతో పదవిని కోల్పోతాడు!

ఈ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ, రాజకీయ నైతికతకు పరాకాష్ఠ అని భారతీయ జనతా పార్టీ ఘోషిస్తోంది. ఏమిటి ఆ పార్టీ వాదన? 'అవినీతిపరుడు' అయిన ఒక మంత్రిని పదవి నుంచి తొలగించడం కంటే ఉన్నతాదర్శం మరేముంటుంది? ఒక మంత్రి (లేదా ముఖ్యమంత్రి) జైలు నుంచి పరిపాలన చేయవచ్చా? చెప్పవచ్చిన దేమిటంటే బీజేపీ దృష్టిలో ఈ బిల్లును సమర్థించే వారు నిజమైన దేశభక్తులు, జాతీయవాదులు; వ్యతిరేకించే వారు జాతి వ్యతిరేకులు, అర్బన్ నక్సల్స్, పాకిస్థానీ ఏజెంట్లు.

ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో నేర విచారణ చట్టం అమలవుతున్న తీరు తెన్నులు తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నాయి. న్యాయం సమకూరడమనేది సందేహాస్పదమవుతోంది. ఎందుకో చూద్దాం: జీఎస్టీ చట్టాలతో సహా అన్ని చట్టాలను రాజకీయ ప్రత్యర్థులపై ఆయుధాలుగా ప్రయోగిస్తున్నారు; (కానిస్టేబుల్‌తో సహా) ఏ పోలీసు అధికారి అయినా వారంట్‌తోనో లేక వారంట్ లేకుండానో ఏ వ్యక్తినైనా అరెస్ట్ చేయవచ్చు... కేసు పెట్టదగిన నేరానికి పాల్పడినట్టు ఎవరిపైన అయినా సహేతుకమైన అనుమానం ఉంటే సదరు వ్యక్తిని అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు ఉన్నది; 'బెయిల్ అనేది నియమం, జైలు అనేది మినహాయింపు' అని జస్టిస్ కృష్ణయ్యర్ ధర్మ ప్రవచనం చేసినప్పటికీ ట్రయల్ కోర్టులు బెయిల్ మంజూరు చేసేందుకు ఇష్టపడడం లేదు; ప్రథమ విచారణలో హైకోర్టులు బెయిల్ మంజూరు చేయవు. ఏదో ఒక సాకుతో బెయిల్ ఇవ్వకుండా విచారణ కొనసాగించి, 60–90 రోజుల అనంతరం బెయిల్ మంజూరు చేయడం పరిపాటిగా ఉన్నది; ఈ శోచనీయ వ్యవహారాల ఫలితంగా దేశ సర్వోన్నత న్యాయస్థానంలో రోజూ డజన్ల కొద్దీ బెయిల్ పిటిషన్లు దాఖలవుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే సుప్రీంకోర్టు సైతం ట్రయల్ కోర్టు విధులు నిర్వర్తించవలసి వస్తోంది; 130వ రాజ్యాంగ సవరణ బిల్లులో ప్రధానమంత్రిని కూడా చేర్చడం హాస్యాస్పదం. ఏ పోలీసు అధికారీ ప్రధానమంత్రిని అరెస్ట్ చేసేందుకు సాహసించడు.



రాజకీయ పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తే రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025 పార్లమెంటు ఆమోదం పొందడంలో విఫలమవుతుంది. ఆమోదం పొందితే, ప్రతిపక్ష నాయకులను పదే పదే అరెస్ట్ చేసి జైలుపాలు చేసే బెలారస్, బంగ్లాదేశ్, కంబోడియా, కెమెరూన్, కాంగో (డిఆర్‌సి), మయన్మార్, నికరాగువా, పాకిస్థాన్, రష్యా, రువాండా, ఉగాండా, వెనిజులా, జాంబియా, జింబాబ్వేల సరసన మన దేశమూ చేరుతుంది.

ఈ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయేలా చేసేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని ఇండియా కూటమి, తృణమూల్ కాంగ్రెస్ సులువుగా కూడగట్టుకోగలుగుతాయి. అయినప్పటికీ ఈ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడం ఖాయమనే ఆత్మ విశ్వాసంతో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నది. ఉభయ సభలలోను కొన్ని ప్రతిపక్షాల లేదా ఎంపీల మద్దతు పొందగల ఉపాయమేదో ప్రభుత్వానికి ఉన్నట్టుగా ఉంది. బహుశా, ఓటింగ్ రోజున కొంత మంది విపక్ష ఎంపీలు 'అదృశ్యమయ్యే' చాణక్యానికి ప్రభుత్వం పాల్పడవచ్చు. లేదూ, ఇంకేదైనా వ్యూహం ప్రభుత్వానికి ఉన్నదేమో గానీ అది నా అవగాహనకు మించినది.

ఈ బిల్లు విషయమై ప్రధానమంత్రి, హోంమంత్రి ఇప్పటికే సమర నాదాలు చేశారు. అది తప్పక పార్లమెంటు ఆమోదం పొందుతుందని ఘంటాపథంగా చెబుతున్నారు. సరే, 'విధేయ' మీడియా వారి మాటలు, వాదనలు వల్లె వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు బిహార్ (2025), అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ (2026) ముగిసేంతవరకు ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై జాయింట్ సెలెక్ట్ కమిటీ ఎటువంటి నిర్ణయం తీసుకోదు.

మీడియా వార్తల ప్రకారం 2014 నుంచి ప్రతిపక్షాలకు చెందిన 12 మంది మంత్రులను అరెస్ట్ చేశారు. వారిలో చాలా మందికి నెలల తరబడి బెయిల్ మంజూరు కాలేదు. అలాగే 2014 నుంచి తీవ్ర నేరాభియోగాల నెదుర్కొంటున్న 25 మంది రాజకీయ నాయకులు బీజేపీలో చేరారు. చేరిన వెంటనే వారందరూ నేరారోపణల నుంచి విముక్తుల య్యారు! నాకు గుర్తున్నంతవరకు 2014 నుంచి బీజేపీకి చెందిన ఏ మంత్రి కూడా అరెస్ట్ కాలేదు. రాజ్యాంగ (130వ సవరణ) బిల్లు–2025 పార్లమెంటు ఆమోదం పొందితే, ప్రతిపక్ష నాయకులను పదే పదే అరెస్ట్ చేసి జైలుపాలు చేసే బెలారస్, బంగ్లాదేశ్, కంబోడియా, కెమెరూన్, కాంగో (డిఆర్‌సి), మయన్మార్, నికరాగువా, పాకిస్థాన్, రష్యా, రువాండా, ఉగాండా, వెనిజులా, జాంబియా, జింబాబ్వేల సరసన చేరుతుంది. ఇది ప్రతిష్ఠాకరమేనా? సమాధానం స్పష్టమే. రాజకీయ పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తే ఆ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడంలో విఫలమవుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అయోమయంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వా

మనదేశ ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రధానపాత్ర పోషిస్తోంది. ఈ రంగంపై ఆధారపడి రాష్ట్రంలో ప్రత్యక్షంగా 15 లక్షల మంది ఉపాధి పొందుతుండగా, పరోక్షంగా దాదాపు 20లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. మన దేశ ఆక్వా ఎగుమతులకు ఎంతో కాలంగా అమెరికా ప్రధాన కేంద్రంగా ఉంది. ఇటీవల ట్రంప్ విధించిన దిగుమతి సుంకాల దెబ్బతో ఈ రంగం తీవ్రంగా ప్రభావితమవుతున్నది. ఆక్వా ఎగుమతుల పరంగా అమెరికాపై ఎక్కువగా ఆధారపడటం, ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వాలు ముందస్తుగా దృష్టి సారించకపోవడం, అంతర్గతంగా దేశీయ మార్కెట్లో ఈ ఉత్పత్తుల వినియోగంపై బుద్ధిపూర్వక నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం వంటి అనేకానేక కారణాలు నేడు ఏపీలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న అయోమయ, ఆందోళనకర పరిస్థితులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారణమవుతున్నాయి.

మనదేశం నుంచి అమెరికాకు చేసే ఇతర ఎగుమతులతో పోలిస్తే ఆక్వా ఉత్పత్తులకు సంబంధించి నిర్ణీతమైన కాల పరిమితులున్నాయి. అప్పటికప్పుడు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కుని, ఆక్వా ఉత్పత్తులను విక్రయించే సౌకర్యాలు ఏ మాత్రం అందుబాటులో లేవు. ఈ ఉత్పత్తుల్లో అధిక వాటాను ఆక్రమించే రొయ్యలను ఒడ్డుకు చేర్చిన నిర్ణీత గడువులోగా మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆ ఆహార పదార్థాలు వినియోగానికి పనికిరాకుండా పోయి, ఉత్పత్తిదారులు పూర్తిస్థాయిలో నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.



గత ఆర్థిక సంవత్సరంలో మనదేశం ఎగుమతి చేసిన 62,408 కోట్ల రూపాయల విలువైన మొత్తం ఉత్పత్తుల్లో దాదాపు 44 శాతం రొయ్యల ఎగుమతులున్నాయి. ఈ ఉత్పత్తుల్లో అమెరికాకు 36.4 శాతం, చైనాకు 17.2 శాతం, యూరప్ దేశాలకు 15శాతం ఎగుమతులు నమోదయ్యాయి. గత ఏడాది మన దేశం ఉత్పత్తి చేసిన 17లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ నుంచే దాదాపు 11లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తి నమోదయ్యింది.

మన దేశ చేపల ఉత్పత్తిలోనూ ఒక్క ఏపీ మాత్రమే దాదాపు మూడోవంతు ఉత్పత్తిని సాధిస్తూ, దేశం ఆర్జిస్తున్న విదేశీ మారక ద్రవ్యంలోనూ సుమారు మూడోవంతు భాగస్వామ్యాన్ని రాష్ట్ర ఆక్వా రంగం జోడిస్తున్నది. రాష్ట్రంలోని పలు జిల్లాల వ్యాప్తంగా 5,72,065 ఎకరాల్లో చేపల చెరువులు విస్తరించి ఉన్నాయి. రెండు లక్షల ఎకరాల్లో సంప్రదాయ నీటి వనరుల నుంచి చేపలు, రొయ్యల సాగును కొనసాగిస్తున్న లక్షలాది మంది మత్స్యకారులున్నారు.

ఇంతటి ప్రాధాన్యాన్ని కలిగిన ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వాలు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని, యుద్ధ ప్రాతిపదికన అమలు పరచాల్సిన అవసరం ఉన్నది. ముఖ్యంగా ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు తాత్కాలిక ఉపశమనాలకంటే దీర్ఘకాలిక ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించడమే ఎక్కువగా మేలు చేకూరుస్తుంది. ఏపీ నుంచి అనేక దశాబ్దాలుగా ఎక్కువ మోతాదులో ఉత్పత్తి చేస్తున్న 'వెనామి' రొయ్యల సాగుపై మాత్రమే దృష్టి కేంద్రీకరించకుండా, పలు దేశాల్లో వినియోగానికి ఆస్కారం ఉన్న ఇతర రకాలైన చేపలు, రొయ్యల వంగడాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. అనేక దశాబ్దాలుగా కొనసాగిస్తున్న శీతలీకరణ పద్ధతుల్లో రొయ్యలు ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు వీలున్న ఇతర మార్గాలను అన్వేషించడంతో పాటుగా, ఆ రంగానికి ఉపకరించే ప్రోత్సాహకాలనూ ప్రభుత్వపరంగా అందించాల్సిన అవసరం ఉన్నది. ఇందులో ప్రధానంగా 'వాక్యూమ్ ఫ్రీజ్ డ్రైయింగ్' లాంటి అత్యాధునిక విధానాలను అనుసరించడం ద్వారా ప్రాసెస్ చేసిన రొయ్యలను దాదాపు ఇరవై ఏళ్ల పాటు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది! ఫలితంగా మార్కెటింగ్‌లో ఒత్తిళ్లు పూర్తిస్థాయిలో తగ్గిపోయి అంతిమంగా రైతులకు, సరఫరాదారులకు, ఎగుమతిదారులకు కాలపరిమితులకు సంబంధించిన వెసులుబాటు లభిస్తుంది.

ఎన్నో ఏళ్లుగా కేవలం అమెరికా మార్కెట్ మీద మాత్రమే ఆధారపడిన ఎగుమతుల విధానాన్ని సవరించుకుని మన దేశం నుంచి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతులను చేసుకోగలిగే ప్రత్యామ్నాయ మార్కెట్ వెసులుబాటు ధోరణులను అనుసరించడం మరింత శ్రేయస్కరంగా ఉంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా ఇంత కాలంగా బుద్ధిపూర్వకంగా విస్మరించిన దేశీయ మార్కెట్లలో స్థానిక ఆక్వా ఉత్పత్తులను 'రెడీ టు కుక్, రెడీ టు ఈట్' లాంటి విలువల జోడింపు (వాల్యూ యాడెడ్) విధానాల్లోకి మార్చుకునే ఆధునిక సాంకేతిక 'ఫుడ్ ప్రాసెసింగ్' పద్ధతులను అనుసరించడం ఆక్వా రంగ రైతులకు మరింత సౌకర్యంగా ఉంటుంది. ఏది ఏమైనా ఆక్వా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

• పిట్టల రవీందర్
'తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్' పూర్వ అధ్యక్షుడు

పెట్టుబడిదారీ శాపనార్థాలు చాలించాలి!

'విప్లవం..చాలించాలి' అనే పేరుతో, 'మార్క్సిజం' మీద వి.వి.సుబ్రహ్మణ్యం పెట్టిన శాపనార్థాల వ్యాసం (ఆగస్టు 16) చదివాక, దానిమీద కలగజేసుకోడం తప్పనిసరి అనిపించింది నాకు. నా రాత వల్ల వ్యాసకర్తకి ఏదో తెలియాలని కాదు. అటువంటి భ్రమలు లేవు నాకు. మార్క్సిజం గురించి అంతగా తెలియని పాఠకుల కోసమే ఇది! మార్క్సిజంతో పూర్తి ఏకీభావం ఉన్న వ్యక్తిగా ఇది రాస్తున్నాను. ముందుగా, మార్క్సిజం మీద వ్యాసకర్త శాపనార్థాలు వినండి! (1) మార్క్సిజం, "రోగం కన్నా హానికరమైన మందు!", "విషప్రాయమైన ఔషధం!" –ఇక్కడ 'రోగమూ', 'మందూ' అనే వాటి గురించి చెపుతాను. ఏ యజమాని అయినా, ఏ పరిశ్రమలో అయినా, పనివాళ్ళ శ్రమ విలువల నించి, దొరికినంత శ్రమ విలువని, 'లాభం' పేరుతో, డబ్బు రూపంలో, తన స్వంత శ్రమ అంటూ లేకుండా, సంపాదించే శ్రమ దోపిడీయే 'రోగం!' దాని గురించి తెలుసుకుని, దాన్ని వ్యతిరేకించి, ఆ దోపిడీ నించి పూర్తిగా విముక్తి చెందాలన్నది మార్క్సు బోధన. ఈ బోధననే, వ్యాసకర్త 'హానికరమైన మందు'గా ప్రకటించి, 'శ్రమ దోపిడీ' అనే మాటని మాత్రం తన వ్యాసంలో ఎక్కడా చెప్పలేదు. ఇంకా కొన్ని శాపనార్థాలు వినండి! (2) "మార్క్సిజం ఒక 'వికృత సిద్ధాంతం!" అట! (3) మార్క్సిజం చూపిన దారి, అధోగతికి రహదారి!" అట! (4) "మార్క్సిజం ఒక కుహనా రాజకీయ తార్కిక సిద్ధాంతం!" అట! – పెట్టుబడిదారీ శ్రమ దోపిడీని తీసెయ్యాలని చెప్పే మార్క్సిజం మీద ఇలా సాగింది, వ్యాసకర్త శాపనార్థాల చిట్టా!

మార్క్సు సిద్ధాంతం మీద ఇలా శాపనార్థాలు పెట్టిన సుబ్రహ్మణ్యాలు ఇతర దేశాలలో కూడా కొందరు కనబడ్డారు గతంలో! మచ్చుకి (1) 'రేమండ్ యారన్' అనే ఫ్రాన్స్ దేశపు సుబ్రహ్మణ్యం ఒకరు! ఇతగాడు, మార్క్సిజాన్ని ఉద్దేశించి, అది 'మేధావుల పాలిట మత్తుమందు' ('ది ఓపియం ఆఫ్ ఇంటలెక్చువల్స్') అనే పేరుతో ఏకంగా ఒక పుస్తకమే రాశాడు. (2) ఇటలీ దేశపు సుబ్రహ్మణ్యం ఇంకొకరు! 'గెటానో మాస్కా' అనే ప్రబుద్ధుడు, 'పాలక వర్గం' ('ది రూలింగ్ క్లాస్') అనే తన పుస్తకంలో (పేజీ– 518), మార్క్సు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా రాసిన 'కాపిటల్ పుస్తకంలో ఎంతెంత తప్పులున్నాయో ఇలా చెప్పాడు: 'కాపిటల్ పుస్తకంలో, ప్రతీ పేజీలోనూ వర్గాల మధ్య విధ్వంసకర ద్వేషాన్ని ప్రచారం చేస్తాడు మార్క్సు!' అని ఆరోపించాడు. ఇతర దేశాల సుబ్రహ్మణ్యాల విమర్శల గురించి, నాలుగేళ్ళ కిందట, 'మార్క్సిజం మీద విమర్శలకు జవాబులు' అనే పేరుతో నేను ఒక చిన్న పుస్తకం రాశాను. ఇప్పుడు, మన రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్యం చేసిన విమర్శలకి, క్లుప్తంగా నా జవాబులు ఇవీ:

(1) "మార్క్సు చెప్పిన విధంగా ఏ ఒక్క చోటా విప్లవం రాలేదు" – అని వ్యాసకర్త విమర్శ! మార్క్సు చెప్పిన విధంగా చేశారా? విప్లవం రాలేదంటే, చెప్పినట్టు చేస్తేనే కదా, విప్లవం వచ్చేది? కానీ, గతంలో రష్యా, చైనాల్లో జరిగిన విప్లవాలు, ఆ మార్గంలో పడిన కొన్ని తొలి అడుగులు మాత్రమే! శ్రమ దోపిడీ నించీ విముక్తి గురించి చెప్పే మార్క్సిజాన్ని, ఆ దేశాలలోని కమ్యూనిస్టులే, తామే తగినంతగా గ్రహించకపోవడమూ; దానిని శ్రామిక జనాలలో విస్తారంగా వ్యాప్తి చెయ్యలేకపోవడమూ ప్రధాన కారణం. అంతేగానీ, అది మార్క్సు సిద్ధాంతంలో లోపం కాదు. (2) "చరిత్ర క్రమంలో, ఎవ్వరూ ఆపలేని విధంగా విప్లవం దానంతట అదే వస్తుందని 'మానిఫెస్టో'లో మార్క్సు చెప్పాడని" వ్యాసకర్త నిరాధారమైన వాదన! 'కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టో'లో ('కార్మికులూ, కమ్యూనిస్టులూ' అన్న చాప్టరులో) చెప్పింది ఏమిటో చూడండి! "కార్మికులు ఒక వర్గంగా రూపొందాలి! బూర్జువా ఆధిపత్యాన్ని కూలదోయాలి! కార్మిక వర్గం రాజకీయ అధికారాన్ని గెలుచుకోవాలి!".. "కార్మికవర్గ విప్లవంలో మొదటి మెట్టు, కార్మిక వర్గం పాలక వర్గం కావడం! బూర్జువా వర్గం నించీ సమస్త పెట్టుబడినీ– అంటే, ఉత్పత్తి సాధనాలన్నిటినీ స్వాధీనం చేసుకోవాలి!" –ఇది కదా మార్క్సు వాళ్ళు చెప్పింది? మరి, వ్యాసకర్త వక్రీకరించినట్టు, 'విప్లవం దానంతట అదే వస్తుందని' చెప్పిందెక్కడ? (3) "పెట్టుబడిదార్లను ద్వేషించినంతగా మార్క్సు ఇంకెవరినీ ద్వేషించలేదేమో!" అని తెగ వాపోతున్నాడు మన వ్యాసకర్త! 'శ్రమదోపిడీ' మీద బతికే వర్గాన్ని ద్వేషించాలా, పూజించాలా? (4) "పెట్టుబడుల్ని తీసుకొచ్చి, సంపద సృష్టించి, అభివృద్ధిని సాధించాలనే విధానాన్ని" ఈ వ్యాసకర్త తెగ మెచ్చుకోవడానికి అర్థం ఏమైనా ఉందా? సంపదని సృష్టించేది ఎవరు? కార్మికులు! లాభాల రూపంలో ఆ సంపద ఎవరికి అందుతుంది? పెట్టుబడిదారీ వర్గానికి! (5) చివరిగా, వ్యాసకర్త చేసిన ఒక వివేకవంతమైన ఉపదేశం ఉంది. ఏమిటంటే: "పెట్టుబడిదారులూ, కార్మికులూ సమాజ ప్రగతికి అవసరం గనక, ఒకరి వల్ల ఒకరికి అన్యాయం కలగకుండా చేసుకోవాలేగానీ, ఏదో ఒక వర్గాన్ని నిర్మూలించేయడం అవివేకం" అని! ఒకరి వల్ల ఒకరికి అన్యాయమా? కార్మికుల వల్ల, యజమానులకు లాభమా, అన్యాయమా? యజమాని వల్ల కార్మికులకు అన్యాయం గాక న్యాయమా? పెట్టుబడిదారులూ, కార్మికులూ అనే వాళ్ళు, ఒకే రకం వాళ్ళు కాదు. పెట్టుబడిదారులు 'శ్రమలు' చేయరు. వాళ్ళు కార్మికుల శ్రమలను, 'లాభాల' పేరుతో దోచి బతుకుతారు. ఈ శ్రమ దోపిడీ సమస్యని పరిష్కరించడానికి మార్క్సిజం చెప్పే మార్గం: "సమాజంలో అందరూ, అన్ని రకాల శ్రమలూ శక్తి కొద్దీ చేస్తూ, చేసిన ఉత్పత్తుల్ని అందరూ అవసరం కొద్దీ వాడుకోవాలి" అని! అలా జరిగినప్పుడు, 'పెట్టుబడిదారులు' – 'కార్మికులు' అనే విభజనా ఉండదు; అసలు వర్గాలనేవే ఉండవు. అందరూ, సమిష్టి, సహకార ఉత్పత్తిదారులుగా (అసోసియేటెడ్ ప్రొడ్యూసర్స్) అయిపోతారు.


శ్రమ దోపిడీ సమస్యని పరిష్కరించడానికి మార్క్సిజం చెప్పే మార్గం: "సమాజంలో అందరూ, అన్ని రకాల శ్రమలూ శక్తి కొద్దీ చేస్తూ, చేసిన ఉత్పత్తుల్ని అందరూ అవసరం కొద్దీ వాడుకోవాలి" అని! అలా జరిగినప్పుడు, 'పెటుబడిదారులు' – 'కార్మికులు' అనే విభజనా ఉండదు; అసలు వర్గాలనేవే ఉండవు. అందరూ, సమిష్టి, సహకార ఉత్పత్తి దారులుగా (అసోసియేటెడ్ ప్రొడ్యూసర్స్) అయిపోతారు.



చివరిగా, వ్యాసకర్తకి, ఆయన వాడిన విశేషణాలే ఉపయోగించి, మార్క్సిజం ఇచ్చే వివేకవంతమైన సలహా ఏమిటంటే: 'హానికరమైన', 'విషప్రాయమైన', 'వికృత', 'కుహనా' పెట్టుబడిదారీ విధానం 'చేత కట్టించుకున్న పుస్తెను', వెంటనే తెంచేసుకోమని!

వ్యాసకర్త తేల్చింది, 'విప్లవం చాలించాలి!' అని. కానీ, చాలించవలసింది, విప్లవ ప్రయత్నాల్ని కాదు. పెట్టుబడిదారీ శాపనార్థాల్ని! పెట్టుబడిదారీ పిల్లి శాపనార్థాలతో, మార్క్సిజం ఉట్టి తెగిపడదు!

■ రంగనాయకమ్మ



తెలుగును కాపాడుకుందాం




- నగరంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- కళాక్షేత్రం వద్ద తెలుగుతల్లి విగ్రహానికి నివాళి 6



అద్దాల్లో అందంగా..

వన్‌టౌన్‌లోని బాలగణపతి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రుల్లో వినాయకుడు వినూత్నంగా కొలువు దీరాడు. ప్రత్యేకంగా రూపొందించిన మట్టి వినాయకుడు అద్దాల మందిరంలో ప్రత్యేకంగా దర్శనమిస్తున్నాడు. చుట్టూ అద్దాలు, లైటింగ్‌తో కొలువుదీరిన స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

– వన్‌టౌన్





ఖిల్లాపై అల్లరల్లరి

ఆకతాయిల మందు పార్టీ.. కేకలు.. అరుపులు

30 మోటార్ బైకులు, 10 కార్లలో వచ్చి గోలగోల

- పర్యాటక ప్రాంతంలో టేబుళ్లు వేసుకుని మందు పార్టీ
- అనంతరం వారిలో వారే కొట్టుకుని రచ్చ
- భయపడి వెళ్లిపోయిన పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : వినాయకచవితి రోజున విజయవాడకు చెందిన సుమారు 50 మంది యువకులు, కొందరు యువతులు సుమారు 30 మోటార్ బైకులు, పది కార్లతో కొండపల్లి ఖిల్లాకు వచ్చారు. ప్రకృతి అందాలు చూడటం మానేసి మందు పార్టీ మొదలుపెట్టారు. వీరు చేసిన వికృత చేష్టలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. కార్లలో ఏకంగా రెడీమేడ్ టేబుళ్లు, కుర్చీలు తీసుకొచ్చి సిట్టింగ్ వేసి మరీ పబ్లిక్‌గానే మద్యం సేవించారు. ఆ మత్తులో కార్లపై కూర్చుని హారన్లు మోగిస్తూ, వీడియోలు తీసుకుంటూ ఘాట్‌రోడ్డుపై కోతిమూకను తలపించారు. వీరి చేష్టలకు పర్యాటకులు భయపడిపోయారు. చివరికి వారిలో వారికే గొడవై కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు వెళ్లి వారిని చెదరగొట్టారు. ఈ ఆకతాయిలు చేసిన అల్లరి మొత్తం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అసలు వీరు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే విషయాన్ని పోలీసులు కూపీ లాగుతున్నారు.

పర్యాటకం మాటున పాడు పనులు

ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన కొండపల్లి ఖిల్లాపై పర్యాటకం పేరుతో యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోంది. ఇలాంటి ఘటనలు జరగడం ఇదేం కొత్త కాదు. గతంలోను మిగతా 6లో..


కొండపల్లి ఖిల్లాపై మందు తాగుతున్న యువకులు

కొండపల్లి ఖిల్లాపై ఆకతాయిలు అల్లరి సృష్టించారు. పది కార్లు, 30 మోటార్ బైకులపై ఈలలు, అరుపులు, హారన్లతో రచ్చరచ్చ చేశారు. బార్ అండ్ రెస్టారెంట్ తరహాలో ఖిల్లా ప్రాంగణంలో టేబుళ్లు వేసుకుని మద్యం సేవించారు. వీరిని చూసి పర్యాటకులు భయపడిపోయారు. చాలామంది అక్కడి నుంచి వచ్చేశారు. ఈ గ్యాంగ్‌లో యువకులతో పాటు కొందరు యువతులు కూడా ఉన్నారు.

వన్‌వే బోర్డు ఉన్నా వ్యతిరేక మార్గంలో వాహనాలపై దూసుకెళ్తారు కొందరు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నా పట్టించుకోరు మరికొందరు. పోలీసులను చూసి హెల్మెట్ ధరించేవారు, తమ పనికోసం ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వాహనాలను పార్కింగ్ చేసేవారు ఇంకొందరు. ఇలాంటి వారికి చెక్ పెట్టేందుకు పోలీసులు కొత్తగా ప్రవేశపెట్టిన 'డ్రోన్లతో జరిమానాల విధానం' సత్ఫలితాలను ఇస్తోంది. 20 రోజుల్లో 174 కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

డ్రోనాస్త్రం

నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు చెక్

డ్రోన్లతో ఫొటోలు తీసి జరిమానాల విధింపు



- ముఖ్యంగా ఆ ఆరు రకాల ఉల్లంఘనలకు..
- 20 రోజులు.. 174 కేసులు.. రూ. 1,77,640 జరిమానాలు
- హెల్మెట్ లేని ప్రయాణం, స్నేక్ డ్రైవింగ్‌పై దృష్టి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నగరంలో నిత్యం ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు డ్రోన్లతో షాక్ ఇస్తున్నారు. గగనతలం నుంచి డ్రోన్లతో నిఘాపెట్టి వాహనదారులకు జరిమానాల ఝలక్ ఇస్తున్నారు. గతనెలలో ట్రాఫిక్ విభాగానికి దాతలు సమకూర్చిన ఆరు డ్రోన్లను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పోలీస్ కమిషనరేట్‌కు అందజేశారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రధాన కూడళ్లలో ఉన్న పరిస్థితులను పరిశీలించడానికి ఈ డ్రోన్లను సమకూర్చుతున్నట్టు చెప్పారు. ఈ టాస్కులతో పాటు డ్రోన్లతో ట్రాఫిక్ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్కులు చేయిస్తున్నారు. డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారి ఫొటోలను తీస్తున్నారు. వారి వాహనం నెంబరు స్పష్టంగా కనిపించేలా ఫొటోలు తీసి యజమానులకు పంపుతున్నారు.

20 రోజుల్లో 174 కేసులు

నగరంలో ట్రాఫిక్ పోలీసులకు అందజేసిన డ్రోన్లకు ప్రత్యేకంగా ఆ విభాగంలో సిబ్బందిని పైలెట్లుగా నియమించారు. డ్రోన్లను ఎగరేయడం, వాటిద్వారా ఫొటోలు తీయడం, కమాండ్ కంట్రోల్ మిగతా 6లో..

బైక్ వెంటే..

స్పోర్ట్స్ బైక్‌లపై యువత వేగాన్ని పోలీసులు సైతం నియంత్రించుకోలేక పోతున్నారు. రహదారులపై మెలికలు తిరుగుతూ వాహనాలు నడుపుతూ భయాందోళనలు సృష్టిస్తున్నారు. కూడళ్లలో ఆపడానికి ప్రయత్నిస్తున్నా దూసుకుపోతున్నారు. స్నేక్ డ్రైవింగ్, రేస్ డ్రైవింగ్ చేస్తూ ఇతర వాహనదారులకు గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై వీరి ప్రవర్తన అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. అటువంటి వారికోసం పైలెట్లు డ్రోన్లను వాడుతున్నారు. వాహనదారులకు పంపే ఫొటోలో వాహనంతో పాటు దాని రిజిస్ట్రేషన్ నెంబరు స్పష్టంగా కనిపించాలి. అందుకోసం డ్రోన్‌ను ఆ వాహనం వద్దకు తీసుకెళ్లాలి. స్పోర్ట్స్ బైక్‌లు, హార్స్‌పవర్ ఎక్కువ ఉన్న వాహనాలపై వెళ్తున్న వారిని చిత్రీకరించడానికి డ్రోన్‌ను అదే వేగంతో పరుగులు తీయిస్తుండటం విశేషం.



బ్రెయిన్ స్ట్రోక్ రోగులకు సంజీవని..

టెనెక్ట్‌ప్లాజా

- గోల్డెన్ అవర్‌లో వస్తే నాలుగు గంటల్లోనే సాధారణ స్థితికి..
- రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్ ఉచితంగా వేస్తారు
- అధిక ఒత్తిడి, ఆలోచనల వల్లే బ్రెయిన్ స్ట్రోక్

బ్రెయిన్ స్ట్రోకా.. అయితే ఆందోళన చెందకండి. గోల్డెన్ అవర్‌లో స్పందించి రోగికి వెంటనే టెనెక్ట్‌ప్లాజా ఇంజక్షన్ చేయిస్తే చాలు. ఆ రోగి మూడు నుంచి నాలుగు గంటల్లోనే కోలుకునే అవకాశముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రూ.39 వేల నుంచి రూ.50 వేల విలువైన ఈ ఇంజక్షన్‌ను ఉచితంగానే చేస్తున్నారు. అదెక్కడ..? వివరాలు ఏంటి?

కథనం 6లో..

ప్రమాదస్థాయి దాటి కట్లేరు ప్రవాహం 8

- పలు గ్రామాలకు రాకపోకలు బంద్



నిన్నటికి నిన్న టెండర్లను జామ్ చేశారు.. నేడేమో ఏకంగా రద్దు చేశారు. నగర శివారు ప్రాంతాల రోడ్ల విస్తరణ పనుల విషయంలో సీఆర్‌డీఏ అనుసరిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలానా కారణంతో రద్దు చేశామన్న సమాచారాన్ని ఇవ్వకపోవడంపై చిన్న కాంట్రాక్టర్లు మండిపడుతుండగా, బడాసంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాల్లో భాగంగానే ఇది జరిగిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

చిన్న కాంట్రాక్టర్లకు టెండర్ పెట్టారు..!

నగర శివారు రోడ్ల పనుల టెండర్లు రద్దు

అర్హత కలిగిన కాంట్రాక్టర్లు ఉన్నా అర్థాంతరంగా నిర్ణయం

- ఖర్చు, సమయం వృథా అంటున్న చిన్న కాంట్రాక్టర్లు
- గంపగుత్తగా టెండర్ పిలిచి బడాసంస్థకు అప్పగించాలనే..
- యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన పనుల్లో సీఆర్‌డీఏ నిర్లక్ష్యం
- అధికారుల తీరుపై విమర్శలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఒకపక్క విజయవాడ నగర, శివారు ప్రాంతాల ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే, మరోపక్క సీఆర్‌డీఏ వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ శివారు రోడ్ల టెండర్ల పనులను ఓ బడా సంస్థకు కట్టబెట్టేందుకు టెండర్ల రద్దు డ్రామాకు తెరలేపిందన్న ఆరోపణలు వస్తున్నాయి. చిన్న కాంట్రాక్టర్లను వదిలించుకుని పెద్ద కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాలంటే టెండర్లను రద్దు చేయటం తప్ప మరో మార్గం లేదని భావించే.. టెక్నికల్ బిడ్ టెండర్లను ఖరారు చేయకుండా గడువు పొడిగిస్తున్నారని టెండర్లు వేసిన మిగతా 6లో..



గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డు విషయంలోనూ దోబూచులాట

గుంటూరు నగరంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్-3 విస్తరణ పనుల కోసం రూ.34 కోట్లతో టెండర్లు పిలిచారు. మంచి స్పందన వచ్చింది. ఆరు కాంట్రాక్టు సంస్థలు పాలు పంచుకున్నాయి. టెక్నికల్ బిడ్లు కూడా తెరిచారు. కానీ, ఫైనాన్షియల్ బిడ్లను పిలవకుండా తాత్సారం చేస్తున్నారు. ఈ టెండర్‌ను కూడా రద్దు చేయాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఇప్పటికే టెక్నికల్ బిడ్లు తెరిచి ఉండటంతో ఏం చేయాలో సీఆర్‌డీఏకు పాలుపోవట్లేదు. టెక్నికల్ బిడ్లు తెరిచాక కాంట్రాక్టర్లు కోర్టుకు వెళితే, ఆ తర్వాత న్యాయస్థానం ప్రశ్నిస్తే సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో న్యాయసలహా తీసుకున్నాక టెండర్ల రద్దుపై తుది నిర్ణయం తీసుకోవాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది.

ఓపెన్ డల్.. రిజర్వేషన్ ఫుల్

ఉమ్మడి కృష్ణాలో బార్ల దరఖాస్తుల లెక్క ఇది

- రిజర్వేషన్ కేటగిరీలో బార్ల ఏర్పాటుకు భారీగా..
- ఓపెన్ కేటగిరీకి మాత్రం అంతంతమాత్రమే..
- కలెక్టర్ కార్యాలయాల్లో నేడు లాటరీ



(ఆంధ్రజ్యోతి-విజయవాడ/మచిలీపట్నం) : కొత్త బార్ పాలసీకి దరఖాస్తుదారుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే వచ్చింది. రిజర్వేషన్ కేటగిరీలో బార్లకు భారీగానే దరఖాస్తులు అందగా, ఓపెన్ కేటగిరీకి అనుకున్నంత స్పందన రాలేదు. వ్యాపారులు భారీగా ముందుకొస్తారని ఎక్సైజ్ శాఖ అధికారులు భావించారు. బార్ల దరఖాస్తు స్వీకరణకు గడువు శుక్రవారంతో ముగిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 183 బార్లకు ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా, లెక్కలు ఇలా ఉన్నాయి.

కృష్ణాజిల్లాలో..

కృష్ణాజిల్లాలో ఓపెన్ కేటగిరీలో 39, గీత కార్మికులకు నాలుగు బార్లను కేటాయించారు. ఆ జిల్లాలో మొత్తం 43 బార్లను నోటిఫై చేశాడు. కృష్ణాజిల్లాలో 39 ఓపెన్ కేటగిరీ బారుల్లో 26 బార్లకు 112 మంది ధరావత్తు చెల్లించి దరఖాస్తులను అందజేశారు. నాలుగు రిజర్వేషన్ బార్లకు 39 దరఖాస్తులు అందాయి. రిజర్వేషన్ కేటగిరీ బార్లకు పూర్తిస్థాయిలో పోటాపోటీగా దరఖాస్తులు వచ్చాయి. ఓపెన్ కేటగిరీ బార్లకు మాత్రం ఈస్థాయిలో దరఖాస్తులు రాలేదు. రిజర్వేషన్ కేటగిరీలోని ఒక్కో బార్‌కు పది దరఖాస్తులు అందాయి. ఓపెన్ కేటగిరీలో ఎన్టీఆర్ జిల్లాలో 60, కృష్ణాజిల్లాలో 26 బార్లకే నాలుగేసి దరఖాస్తులు వచ్చాయి.



ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలోని 130 బార్లను ఓపెన్ కేటగిరీకి, పది బార్లను గీత కార్మికులకు కేటాయించారు. మొత్తం 140 బార్లను నోటిఫై చేశారు. 130 ఓపెన్ కేటగిరీలో ఉన్న బార్లకు మొత్తం 524 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. 126 బార్లకు దరఖాస్తుదారులు ముందుకొచ్చారు. మొత్తం 60 బార్లకు 255 మంది రూ.5 లక్షల ధరావత్తు, రూ.10 వేల ఫీజు చెల్లించి దరఖాస్తులను మిగతా 6లో..

పవన్‌కల్యాణ్, చంద్రబాబు, నరేంద్రమోదీ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేస్తున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, తదితరులు



రైతు బాగుంటేనే.. రాజ్యం

- నియోజకవర్గంలో అన్నదాతకు పెట్టుబడి సాయం రూ.20.19కోట్లు
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

6

రాజధానిలో ప్లాట్లు పొందిన రైతులకు సర్టిఫికెట్లు

సీఆర్‌డీఏ జాబ్‌మేళాలో 91 మందికి ఉద్యోగాలు 8

సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని శాసిస్తున్న ఈ రోజుల్లో ప్రజలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. ఈక్రమంలో పని ఒత్తిడితో ఆరోగ్య సమస్యలూ వారిని చుట్టు ముడుతున్నాయి. ఎప్పుడు ఏ విపత్తు సంభవిస్తుందో తెలియని పరిస్థితి. ఆరోగ్యంగా ఉన్నవారిని సైతం మానసిక ఒత్తిడి తీవ్రంగా కుంగ దీస్తోంది. శారీరక శ్రమ లేకపోవడం.. ఆర్థిక పరిస్థితులు, మానసిక ఆందోళనతో హృదయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. చిన్న వయస్సులోనే హృద్రోగాలు, నరాల సంబంధిత కేసులు పెరుగుతున్నాయని ఇలాంటి పరిస్థితిల్లో ఎల్లప్పుడూ జాగరూకతతో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు.



బ్రెయిన్‌స్ట్రోక్ రోగులకు సంజీవని..
టెనెక్ట్‌ప్లాజా

- గోల్డెన్ అవర్‌లో వస్తే ఇంజక్షన్‌తో మూడు నాలుగు గంటల్లోనే సాధారణ స్థితికి
- రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్ జీజీహెచ్‌లో ఉచితం
- అధిక ఒత్తిడి, ఆలోచనలతో బ్రెయిన్‌స్ట్రోక్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

బ్రెయిన్‌స్ట్రోక్ బారినపడిన బాధితులను సమయానికి ఆసుపత్రికి తీసుకెళ్లగలిగితే వెంటనే తేరుకునే అవకాశాలు ఉన్నాయి. బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు టెనెక్ట్‌ప్లాజా ఇంజక్షన్ సంజీవని లాంటిది. బ్రెయిన్‌స్ట్రోక్ బారినపడిన బాధితులకు ఇంజక్షన్‌ను మూడు నుంచి నాలుగు గంటల్లోగా ఇస్తే రోగి త్వరగా కోలుకునే అవకాశముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని ధర మార్కెట్లో రూ.39 వేల నుంచి రూ.50 వేలు వరకు ఉంటుంది. అయితే ఇంత ఖరీదైన ఇంజక్షన్‌ను జీజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నారు. నెలకు సగటున ఆరుగురికి ఉచితంగా ఇంజక్షన్ ఇవ్వడంతో ప్రాణాలు కాపాడుతున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ లక్షణాలతో వచ్చిన బాధితులకు వెంటనే ఈ ఇంజక్షన్ ఇవ్వడం వలన వీళ్లెనంత తొందరగా కోలుకుంటారని జీజీహెచ్‌లో ఉచితంగానే ఇంజక్షన్ ఇస్తారని వైద్యులు చెబుతున్నారు.

గోల్డెన్ అవర్ కీలకం..

బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన బాధితుడిని మూడు నుంచి నాలుగున్నర గంటల్లో ఆసుపత్రికి తీసుకురావాలి. సమయం చాలా కీలకం. గోల్డెన్ అవర్‌లో చేర్చిన రోగులకు మాత్రమే 'టెనెక్ట్‌ప్లాజా' ఇంజక్షన్ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. సీటీ స్కాన్ పరీక్ష చేసి ఇంజక్షన్ అవసరమా.. లేదా అని వైద్యులు నిర్ధారిస్తారు. బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుల్లో ఎక్కువమందికి రక్తం గడ్డకడుతుంది. ఇలాంటి వారికి ఈ ఇంజక్షన్ ఇస్తే గడ్డకట్టిన రక్తాన్ని కరిగించడానికి ఉపయోగపడుతుంది. బ్రెయిన్‌లో బ్లీడింగ్ అయితే ఇంజక్షన్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇంజక్షన్ ఇచ్చిన మూడు గంటల్లోనే రోగి సాధారణస్థితికి చేరుకునే అవకాశం ఉందని, సమయం దాటిపోయిన తరువాత ఇంజక్షన్ ఇచ్చినా ప్రయోజనంలేదని వైద్యులు పేర్కొంటున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు

విపరీతంగా ఆలోచించడం, అధిక ఒత్తిడికి లోనుకావడమే బ్రెయిన్‌స్ట్రోక్‌కు కారణాలని వైద్యులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే బ్రెయిన్‌స్ట్రోక్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగింది. జీజీహెచ్‌కు రోజూ కనీసం ఒకటి నుంచి రెండు బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు వస్తుంటాయి. సమయానికి రావడంతో నెలలో సగటున నాలుగు కేసులు ప్రాణాలతో బయటపడుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుల్లో సమయానికి రాలేకపోయినవారే ఎక్కువ ఉన్నారు. అలాంటివారికి ఇంజక్షన్ ఇచ్చినా ఫలితంలేదని, బ్లీడింగ్ అయినవారికి ఈ ఇంజక్షన్ ఇవ్వకూడదని, రక్తం గడ్డకట్టినవారికి మాత్రమే న్యూరాలజీ విభాగంలో ఈ ఇంజక్షన్‌ను ఇస్తున్నట్టు న్యూరాలజీ వైద్యులు పేర్కొంటున్నారు.

లక్షణాలు

బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుల్లో చేతులు, కాళ్ల తిమ్మిర్లు ఎక్కడం, మూతి వంకరపోవడం, కాళ్లు, చేతులు తీవ్రమైన నీరసంగా ఉండడం, కొన్నిసార్లు ఫిట్స్ వచ్చినట్టు కొట్టుకోవడం, ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఈ స్థితిలో వెంటనే ఆసుపత్రిలో చేర్చాలి. లక్షణాలను బట్టి సీటీస్కాన్ చేసి నిర్ధారించిన తరువాతే ఇంజక్షన్ ఇస్తారు. న్యూరాలజీ విభాగంలో ఇంజక్షన్ ఇస్తారని, తరువాత ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ అందిస్తామని వైద్యులు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచితంగానే టెనెక్ట్‌ప్లాజా ఇంజక్షన్ అందిస్తున్నాం

డాక్టర్ డీవీ మాధవికుమారి, డాక్టర్ జి.బ్లెస్సీ



బ్రెయిన్ స్ట్రోక్ బాధితులకు జీజీహెచ్‌లో 2023 జూలై నుంచి ఉచితంగా ఇంజక్షన్ అందిస్తున్నామని డాక్టర్ డీవీ మాధవికుమారి, డాక్టర్ జి.బ్లెస్సీ తెలిపారు. ఇప్పటి వరకు గోల్డెన్ అవర్‌లో వచ్చిన బాధితులు ఇంజక్షన్ ద్వారా 57మంది కోలుకున్నారని, ప్రాణాపాయస్థితిలో, కనీసం సరిగా చూడలేని పరిస్థితుల్లో వచ్చిన ఎంతోమంది రోగులు మూడు, నాలుగు గంటల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటున్నారన్నారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే ఆసుపత్రికి తీసుకురావడం కీలకమని గుర్తించాలని వారు చెబుతున్నారు.



పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో, అర్చకస్వాములు

ఇంద్రకీలాద్రిపై ముగిసిన వినాయకచవితి

వన్‌టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో వినాయకచవితి త్రయాహ్నిక దీక్షాపూర్వక గణపతి పూజలు శుక్రవారంతో ముగిశాయి. స్థానాచార్యుడు శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వైదిక కమిటీ చివరి రోజు పూజా కార్యక్రమాలను పూర్తిచేసి పూర్ణాహుతి నిర్వహించారు. ఈవో శీనానాయక్ పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు శాస్త్రోక్తంగా కృష్ణానదిలో గణపతిని నిమజ్జనం చేశారు.

వీఐపీలకూ సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్

దేవస్థానంలో నూతనంగా ప్రారంభించిన వీఐపీ సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్‌ను భక్తులు వినియోగించుకుంటున్నట్టు దేవస్థానం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోంగార్డులు, సెక్యూరిటీ, దేవస్థానం సిబ్బంది సూచన మేరకు వీఐపీలు తమ సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను డిపాజిట్ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సిఫారసు లేఖలతో వచ్చే భక్తులు, వీఐపీలు తప్పనిసరిగా తమ సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులతో నేరుగా ఆలయంలోకి ప్రవేశించకుండా కౌంటర్‌లో డిపాజిట్ చేయాలని దేవస్థానం ప్రకటించింది.



దుర్గమ్మ భక్తులు.. సిబ్బందికి డ్రెస్ కోడ్

దుర్గమ్మను దర్శించుకునే భక్తులు, ఆలయ సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలని భక్తులు ఎలాంటి వస్త్రధారణతో ఆలయంలోకి రావాలో ఫోటోల రూపంలో ఆలయ పరిసరాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు.



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న విద్యాసాగర్ తదితరులు

చిరస్మరణీయుడు గిడుగు

- ఏపీఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గ్రాంధిక భాషను సరళంగా, జనం వాడుక భాషగా తీర్చిదిద్దిన వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి తెలుగు వారందరికీ చిరస్మరణీయుడని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గిడుగు జయంతి కార్యక్రమాన్ని గ్రంథాయాధికారిణి కె.రమాదేవి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన విద్యాసాగర్ గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేవాలయాల్లో వున్న శాసనాల లిపిని నేర్చుకొని ఎన్నో చారిత్రక అంశాల్ని వెలికి తీసిన భాషా పండితుడు గిడుగు అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ మాట్లాడుతూ, తెలుగు మాసపత్రికను స్థాపించి శాస్త్రీయ వ్యాసాలతో నడిపి, వీరేశలింగం, చెళ్లపిళ్ల వెంకట శాస్త్రి వంటి ఉద్దండ కవుల్ని వ్యావహారిక భాషా ఉద్యమం వైపు నడిపించిన ప్రతికా భాషోద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త గిడుగు వెంకట రామ్మూర్తి అని అన్నారు. ఈ సందర్భంగా కనుమరుగవుతున్న అనుబంధాలను ఉమ్మడి కుటుంబాల్లో పునరుజ్జీవింపచేసే 19 కథలతో జ్యోతి మువ్వల రచించిన అరవింద కథల సంపుటిని అలపర్తి విద్యాసాగర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు చొప్పా రాఘవేంద్రరావు, ఏపీఎన్జీవో పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు డి.సత్యనారాయణ రెడ్డి గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగును కాపాడుకుందాం

- వక్తల పిలుపు

గాంధీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదంలో పడిన తెలుగు భాషను భావితరాల కోసం కాపాడుకుందామని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. అలాగే ఘంటశాల పాటలను కాపాడుకోవాలన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. జాతీయ తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఊరురా జన విజ్ఞాన, ఆల్ ఇండియా ఘంటశాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జేజేలు పలికారు. పద్మశ్రీ ఘంటశాల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య రాష్ట్రస్థాయి రెండో దశ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, జాతీయ తెలుగు భాష దినోత్సవ ప్రాముఖ్యతను, వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత చరిత్రలోని ముఖ్య అంశాలను వివరించారు. కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఘంటశాల పాటలు తెలుగు భాషకు పట్టాభిషేకమన్నారు. ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలన్నారు. చింతకాయల చిట్టిబాబు, సింగంశెట్టి చంద్రశేఖర్, కళాభారతీ, ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు, రామతీర్థ, రంగరాజు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా!

- రైతు సేవాకేంద్రాల నుంచి తరలిపోతున్న డీఏపీ
- వ్యవసాయాధికారుల కాసుల కక్కుర్తి
- చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

ఎ.కొండూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : బస్తా యూరియా కోసం రైతన్నలు గంటలతరబడి దుకాణాల వద్ద పడిగాపులు పడుతుంటే.. కాసులకు కక్కుర్తిపడి కొందరు అధికారులు దళారుల ద్వారా డీఏపీని దారిమళ్లిస్తున్నారు. పంటలకు యూరియా సకాలంలో అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎ.కొండూరు మండలంలో మార్క్‌ఫెడ్ ద్వారా రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసిన యూరియా, డీఏపీలను ప్రయివేటు వ్యాపారులతో కుమ్మక్కై సొమ్ము చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆగస్టు 8, 10 తేదిల్లో మార్క్‌ఫెడ్ నుంచి ఎ.కొండూరు ఆర్‌ఎస్‌కేకు 15టన్నుల యూరియా, ఐదు టన్నుల డీఏపీ, చీమలపాడుకు 14.9 టన్నుల యూరియా సరఫరా చేసింది. అయితే కొందరు అధికారులు ప్రయివేటు వ్యాపారులతో కుమ్మక్కై యూరియా, డీఏపీని గుట్టుచప్పుడు కాకుండా దొడ్డిదారిన బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. చీమలపాడు పరిధిలో కృష్ణారావుపాలెం, రామచంద్రాపురం గ్రామాలు, పలు గిరిజనతండాలు, ఎ.కొండూరు పరిధిలో ఎ.కొండూరుతండా, చైతన్యనగర్, మాత్రియాతండాలో వందలాది ఎకరాలల్లో పత్తి, వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగవుతున్నాయి. నిబంధనల ప్రకారం యూరియా బస్తా 266 ధర ఉండాగా, బ్లాక్ మార్కెట్‌లో రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు. డీఏపీ రూ. 1350 ఉండగా.. రూ.1450 వరకు విక్రయిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. రైతు సేవాకేంద్రాలకు వచ్చిన యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఏవో బండి సాయిశ్రీని వివరణ కోరగా.. యూరియా తరలింపుపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విచారణ చేపట్టాలి : టీడీపీ నేతలు

ఎ.కొండూరు, చీమలపాడు రైతు సేవాకేంద్రాల ద్వారా సరఫరా చేసిన యూరియాను పక్కదారి పట్టించిన అధికారులపై సమగ్రవిచారణ చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు బరోతు పీక్లా నాయక్, చీమలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు బెజవాడ శంకర్, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి బాణావతు బీమ్లా నాయక్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు చేరాల్సిన యూరియా, డీఏపీని కాసులకు కక్కుర్తిపడి కొందరు అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎ.కొండూరులో 15 టన్నుల యూరియా, ఐదు టన్నుల డీఏపీ, చీమలపాడులో 14.9 టన్నుల యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

యూరియా కొరతపై ఆందోళన వద్దు

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



యూరియా కొరతపై కలెక్టర్‌కు మొర పెట్టుకుంటున్న కనుమూరు గ్రామ రైతులు

పామర్రు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, రైతుల అవసరం మేరకు సమృద్ధిగా అందుబాటులో ఉంచడం జరుగుతుందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కురుమద్దాలిలో ఆక్వా పరిశ్రమను సందర్శించి ఎగుమతులు, దిగుమతులు గురించి సిబ్బందిని అరాతీశారు. అనంతరం కలెక్టర్‌ను ప్రధాన గేటు వద్ద కనుమూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు అడ్డుకుని తమ సొసైటీలో అవసరమైన యూరియా, కాంప్లెక్స్ అందడంలేదని, వచ్చిన నిల్వను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తాయన్నారు. సెప్టెంబరు 2న గుజరాత్ నుంచి అవసరమైన యూరియా, కాంప్లెక్ ఎరువులు దిగుమతి జరుగుతుందన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రస్తుతకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలుతీసుకోవాలని సూచించారు. త్వరితగతిన నూతన భవనాల నిర్మాణానికి తన వంతు కృషిచేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యుడు పి.సుదేష్‌బాబు, తహసీల్దార్ జి.రవికాంత్, సీఐ సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

తాడేపల్లి టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబకలహాల నేపథ్యంలో వివాహిత కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్యయత్నం సంఘటన పట్టణ పరిధిలోని సీతానగరంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ భవానీపురానికి చెందిన దాసరి యామినికి అదే ప్రాంతానికి చెందిన నరేంద్రతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భర్త తాగి వచ్చి గొడవలు పడుతుండటంతో గత ఆర్నెల్లుగా పుట్టింటిలో ఉంటోంది. తిరిగి భర్త వద్దకు వెళ్లగా నిరాకరించడంతో మనస్తాపం చెందినట్టు బాధితురాలు పోలీసులకు తెలిపింది. సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద కృష్ణానదిలో మునిగిపోతున్న యామినిని స్థానిక మత్స్యకారులు కాపాడి పోలీసులకు అప్పగించారు. తాడేపల్లి ట్రైనీ ఉమెన్ ఎస్‌ఐ అపర్ణ బాధితురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి తండ్రి శ్రీనివాసరావుకు అప్పగించారు.

ఫ్యామిలీ కార్డుతో మేలు

- లంకా దినకర్

అమరావతి: 'అర్హత కలిగిన లబ్ధిదారులకు కుటుంబకార్డు వ్యవస్థతో మంచి జరుగుతుంది. ఈ విధానంతో అర్హులైన ప్రతిపేదవానికి ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా ఉపయోగపడతాయి' అని 20 సూత్రాల అమలు చైర్మన్ లంకాదినకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబం మొత్తాన్ని ఒక యూనిట్‌గా పరిగణించకుండా కుటుంబంలోని అర్హత కలిగిన ప్రతి వ్యక్తికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా ఉమ్మడి కుటుంబాలను పోత్సహిస్తున్నారు. ఇది మంచి పరిణామం అని పేర్కొన్నారు.

రైతు బాగుంటేనే.. రాజ్యం

- నియోజకవర్గంలో అన్నదాతకు పెట్టుబడి సాయం రూ.20.19కోట్లు
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

గొల్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రైతు రాజు.. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం వర్తింపునకు కృతజ్ఞతగా శుక్రవారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రైతు సోదరులు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల ఐక్యతకు కూటమి ప్రభుత్వానికి మద్దతుగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో సుమారు 30 వేలమంది అన్నదాతలకు రూ.20.19 కోట్లు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల బ్యాంక్ ఖాతాలలో పెట్టుబడి సాయాన్ని జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ కింద మైలవరం నియోజకవర్గంలో రూ.15.12 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని, సుమారు 30,241 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. రైతు సోదరుల తరఫున ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఆర్డీఏ అధికారులు

రాజధానిలో ప్లాట్లు పొందిన రైతులకు సర్టిఫికెట్లు

విజయవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు ఈ-లాటరీ విధానంలో 75 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. లాటరీ కార్యక్రమం శుక్రవారం నగరంలోని సీఆర్డీఏ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎఫ్ఏసీ) వి.డేవిడ్‌రాజు, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్‌వీఎస్‌బీ వసంతరాయుడు, పెనుమాక డిప్యూటీ కలెక్టర్ ఎ.జి.చిన్నికృష్ణ, ఐటీ ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.శివశంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 75 ప్లాట్లలో 45 నివాసానికి కాగా 30 వాణిజ్య ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. 33 మంది రైతులు, భూయజమానులకు ఆన్‌లైన్ విధానంలో ప్లాట్లను కేటాయించారు. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసిన తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రకియ నిర్వహించారు. ప్లాట్లు పొందిన రైతులకు ఎక్కడ కేటాయించాలో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించినట్టు డేవిడ్‌రాజు తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

ఖిల్లాపై అల్లరల్లరి

(5వ పేజీ తరువాయి)

జరిగాయి. కోటపైకి వెళ్లకుండా పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లడం, పాడుపనులకు పాల్పడుతుండటంతో ఇటీవల ఖిల్లాపైకి వెళ్లే ఎంట్రన్స్‌లో ఒక పోలీస్‌ను పెట్టారు. దీంతో జంటల తాకిడి కాస్త కట్టడి అయ్యింది. కాగా, పర్యాటకులు నిరంతరం రాకపోకలు సాగించే ఖిల్లాపై సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో యువత మరింత రెచ్చిపోతోంది.

సీఎం బందోబస్తులో ఉన్నాం

- ఎ.చంద్రశేఖర్, ఇబ్రహీంపట్నం పీఎస్ సీఐ

వినాయకచవితి రోజు సీఎం చంద్రబాబు దూండీ వినాయకుడి దర్శనం కోసం వస్తుండగా మేమంతా బందోబస్తుకు వెళ్లాం. యువకుల అల్లరి నా దృష్టికి వచ్చింది. విచారణ చేస్తున్నాం. ఎవరనేది తెలుసుకుంటున్నాం. బందోబస్తు పటిష్టం చేస్తాం. ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృత్తం కానివ్వం.

ఓపెన్ డల్.. రిజర్వేషన్ ఫుల్

(5వ పేజీ తరువాయి)

ఆన్‌లైన్‌లో సమర్పించారు. గీత కార్మికులకు కేటాయించిన పది బార్లకు 104 దరఖాస్తులు వచ్చాయి.

నేడు లాటరీ

నాలుగేసి దరఖాస్తులు వచ్చిన బార్లకు ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో శనివారం లాటరీ తీస్తారు. డ్రా ద్వారా ఎంపికైన దరఖాస్తుదారుడికి లైసెన్స్ జారీ చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని బార్ల లాటరీని విజయవాడ ఎంజీ రోడ్డులోని కలెక్టర్ కార్యాలయంలో, కృష్ణా జిల్లాకు సంబంధించిన బార్ల లాటరీని మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో తీస్తారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాయపాటి శైలజ

ప్రతి మహిళ వ్యాపార, పారిశ్రామికవేత్తగా ఎదగాలి

- రాయపాటి శైలజ

కాకినాడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా ఎదిగేలా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. కాకినాడ జిల్లాలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడారు. మహిళల భద్రత, రక్షణ కేవలం ప్రభుత్వం, పోలీసులదే బాధ్యత కాదు. సమాజంలో ప్రతిఒక్కరూ ఈ బాధ్యత స్వీకరించేందుకు ముందుకు రావాలన్నారు.

డ్రోనాస్త్రం

(5వ పేజీ తరువాయి)

సెంటర్‌కు లైవ్‌ను అనుసంధానించడం వంటి అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చారు. నగర వ్యాప్తంగా గగనతలంలో తిరిగిన డ్రోన్లు 20 రోజుల్లో 174 కేసులకు ఆధారాలను అందజేశాయి. వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారుల ఫొటోలను తీసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపాయి. వాటిని విశ్లేషించి కంట్రోల్ రూంలో ఉన్న సిబ్బంది జరిమానాలు విధించారు. ఈ కేసుల్లో మొత్తం రూ.1,77,640 జరిమానాలు విధించారు. వాహనదారులు మొత్తం ఆరు రకాల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం, రేస్ డ్రైవింగ్, వన్‌వేలో వెళ్లడం, సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం వంటివి ప్రధానం కాగా, వాటికే జరిమానాలు విధించారు.

చిన్న కాంట్రాక్టర్లకు టెండర్ పెట్టారు..!

(5వ పేజీ తరువాయి)

చిన్న కాంట్రాక్టర్లు విమర్శిస్తున్నారు. రామవరప్పాడులోని బల్లెంవారి వీధి నుంచి నిడమానూరు రోడ్డు జంక్షన్ వరకు, బల్లెంవారి వీధి నుంచి మహానాడు రోడ్డు వరకు, మహానాడు రోడ్డు నుంచి బందరు రోడ్డు వరకు మూడు వేర్వేరు రోడ్ల పనులకు రూ.75.04 కోట్లతో సీఆర్‌డీఏ కిందటి నెలలో టెండర్లు పిలిచింది. ఈనెల 11 నాటికి టెక్నికల్ బిడ్లు తెరవాల్సి ఉండగా, ఈనెల 19కి, ఆ తర్వాత 29కి వాయిదా వేశారు. కానీ, ఆ రోజు టెక్నికల్ బిడ్లను తెరవకుండా టెండర్లను రద్దు చేస్తున్నట్టు కాంట్రాక్టు సంస్థలకు మెయిల్ చేశారు. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌పై టెండర్లు రద్దుచేసే అధికారం సీఆర్‌డీఏకు ఉంటుంది. కానీ, ఎందుకు రద్దు చేశారన్న కారణాన్ని కచ్చితంగా కాంట్రాక్టు సంస్థలకు చెప్పాలి. ఆ పని మాత్రం చేయలేదు. పథకం ప్రకారం ఓ చీఫ్ ఇంజనీర్ (సీఈ) కథ నడిపించారన్న ఆరోపణలున్నాయి.

అన్నీ అర్హత కలిగినే సంస్థలే..

ఈ టెండర్లలో అన్నీ అర్హత కలిగిన సంస్థలే పాలు పంచుకున్నాయి. ప్రధానంగా హాట్ మిక్సింగ్ ప్లాంట్ కలిగి ఉన్నవారు అర్హులు. టెండర్లలో పాలు పంచుకున్న ప్రతి సంస్థ హాట్ మిక్సింగ్ ప్లాంట్‌ను కలిగి ఉంది. కాబట్టి ముందుగా టెక్నికల్ బిడ్లను, ఆ తర్వాత ఫైనాన్షియల్ బిడ్లను తెరిస్తే సరిపోతుంది. కానీ, సీఆర్‌డీఏ అధికారులు ఆ పని చేయలేదు. విజయవాడ, గుంటూరు శివారు రోడ్ల విస్తరణకు సంబంధించి నాలుగు ప్యాకేజీ పనులను గంపగుత్తగా పెద్ద కాంట్రాక్టర్‌కు కట్టబెట్టే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది.

టెండర్ల రద్దుతో ఇబ్బందులు

టెండర్లను రద్దు నిర్ణయం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. బల్లెంవారి వీధి-నిడమానూరు జంక్షన్, బల్లెంవారి వీధి-మహానాడు రోడ్డు, మహానాడు రోడ్డు-బందరు రోడ్డుకు మూడు వేర్వేరు టెండర్లు పిలిచారు. టెండర్లన్నింటినీ ఒకటిగా కలిపితే సాంకేతిక, పరిపాలనాపరమైన అనుమతులు తీసుకోవాలి.

తప్పించుకునే ధోరణి

సీఆర్‌డీఏ అధికారులపై విమర్శలు వస్తుండటంతో తప్పించుకోవటానికి భూ సేకరణ సమస్యలున్నాయన్న వాదనలను తెరపైకి తీసుకురావాలని భావిస్తున్నారు. భూ సేకరణ సమస్య ఉంటే టెండర్లు పిలవకూడదు. ఈ కారణం చెబితే సమస్య ఉండదని, బల్క్‌గా టెండర్లు పిలవొచ్చన్నది అధికారుల ఆలోచన.

విజయవాడకు కాకాని పేరు పెట్టాలి

పటమట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ప్రతిపాదించిన విజయవాడ లేదా కృష్ణాజిల్లాకు కాకాని వెంకటరత్నం పేరు పెట్టాలని కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు కాకాని తరుణ్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు కలెక్టర్ లక్ష్మీశను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ బెంజిసర్కిల్ పేరును కాకాని వెంకటరత్నం పేరుగా మార్చాలని కోరినట్లు వివరించారు. మీ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. గోగినేని ధనశేఖర్, జాస్తి సతీష్, బసవేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.





పీబీ సిద్ధార్థలో గిడుగు జయంతి, వీపీ సిద్ధార్థలో విద్యార్థినుల క్రీడా విన్యాసాల ప్రదర్శన, లిటిల్‌బ్రెయిన్స్‌లో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

ఆధునిక భాషకు మార్గదర్శి గిడుగు

విజయవాడ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాట్లాడే భాష, రాసే భాషల మధ్య అంతరాలపై ఉద్యమించి ఆధునిక తెలుగు భాషకు మార్గం సుగమం చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి అజరామరుడని వక్తలు కొనియాడారు. పీబీ సిద్ధార్థ కళాశాల తెలుగు శాఖ నేతృత్వంలో శుక్రవారం కళాశాల సెమినార్ హాలులో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి, తెలుగు భాషాదినోత్సవం నిర్వహించారు. తొలుత గిడుగు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల పూలమాల వేసి నమస్సుల ర్పించారు. తెలుగు సహాయ ఆచార్యులు డాక్టర్ నస్రీ, డాక్టర్ వై.పూర్ణచంద్ర రావు, డాక్టర్ పీబీడీవీ ప్రసాద్, డాక్టర్ హేమ బాంధవి తదితరులు పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, పుస్తకాలు అందచేశారు.

మొగల్రాజపురం: స్థానిక వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో వ్యవహారిక తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి, భారత హాకీ క్రీడా సంచలనం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటే పద్యాలు, గేయాలు, పాటలతో తెలుగు వైభవాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. పొడుపు కథల పోటీ నిర్వహించారు. విద్యార్థులు క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెచ్ఎం విజయలక్ష్మి, పాల్గొన్నారు.

● సిద్ధార్థనగర్ లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు భాష గొప్పదనం, విశిష్టతను తెలియచేస్తూ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తెలుగులో రుతువులు, నెలలు, నక్షత్రాలు, తిథులు, అచ్చులు, అమ్మ గొప్పదనం, పేరడీ పద్యాలు వివరించారు. తెలుగు సంప్రదాయ వస్త్రధారణతో పిల్లలు ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్త్తేవి, ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో...



తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు

ప్రసాదంపాడు: విజయవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రార్థన గీతం ఆలపించి, జ్యోతి వెలిగించారు. విద్యార్థినీవిద్యార్థులు కవుల వేషధారణలను ధరించి తెలుగు పద్యాలను ఆలపించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథి డాక్టర్ జీవీ పూర్ణచంద్ మాతృభాష విశిష్టతను వివరించారు. ఏకపాత్రాభినయం, పద్య పఠనంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల డైరెక్టర్లు పరిమి పవన్ చంద్, కడియాల ప్రవీణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్, ప్రిన్సిపాల్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పుల్లేటికట్ట ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల నేపథ్యంలో నగరం ముంపునకు గురి కాకుండా నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. తూర్పు నియోజకవర్గం, 3వ డివిజన్‌లోని కీలకమైన పుల్లేటి కట్ట డ్రెయిన్‌పై దృష్టి సారించారు. డ్రెయిన్ పరిసర లోతట్టు ప్రాంతాలు తీవ్ర ముంపునకు గురై ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ సమస్యపై వీఎంసీ కమిషనర్ స్పందించారు. ఆక్రమణలను తొలగించి, డ్రెయిన్‌లో మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వెంటనే సీసీపీ సంజయ్ రత్నకుమార్ పర్యవేక్షణలో ఏసీపీ మోహన్‌బాబు, టీపీవో వసీంబేగ్‌లు సిబ్బందితో శుక్రవారం పుల్లేటి కట్ట డ్రెయిన్ వెంబడి ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలను, చెత్త వ్యర్థాలను యంత్రాల సహాయంతో తొలగించి డ్రెయిన్‌లో మురుగునీరు పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా, ముంపు నివారణకు శాశ్వత పరిష్కారాలను అమలు చేస్తామని వీఎంసీ అధికారులు తెలిపారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

వన్‌టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని నిరుద్యోగ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దటమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. చరణ్ సాయి యాదవ్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు, విద్యా ఐటీ శాఖల మంత్రి లోకేష్ సహకారంతో మెగా డీఎస్సీ విజయవంతంగా నిర్వహించినందుకు శుక్రవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో టీఎస్ఎస్ఎఫ్, విజయవాడ పార్లమెంట్ తెలుగుయువత ఆధ్వర్యంలో థ్యాంక్యూ ఎన్డీయే ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, విజయవాడ పార్లమెంట్ తెలుగుయువత నాయకుడు వర్ల చాణక్య, టీఎస్ఎస్ఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే గద్దె



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పేదలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందటానికి అవసరమైన సంక్షేమ పథకాలను రూపొం దించి తమ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం 12వ డివిజన్ అయ్యప్పనగర్ ఆర్చి దగ్గర వైద్యఖర్చుల నిమిత్తం 38 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.48లక్షల విలువైన చెక్కులను గద్దె అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సీఎంఆర్ఎఫ్‌ను కూడా జగన్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం ఆర్ఎఫ్ ద్వారా ఒక్క తూర్పు నియోజక వర్గంలోనే రూ.4కోట్లకు పైగా నిధులు పేదలకు చెక్కుల రూపంలో అందజేశా మన్నారు. కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, సాయన బుజ్జి, అబ్దుల్ కరీం, కొండవీటి ప్రసాద్, జక్కుల సుబ్బారావు, అబ్దుల్ ఖాలీద్, పాల్గొన్నారు.



సీఐకి మానిటర్ అందజేస్తున్న గద్దె క్రాంతికుమార్

పోలీస్‌స్టేషన్‌కు ఎల్ఈడీ మానిటర్ బహూకరణ

గుణదల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు గద్దె రమేష్‌కుమార్ కొనుగోలు చేసిన ఎల్ఈడీ మానిటర్‌ను పటమట స్టేషన్‌లో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ సీఐ పవన్‌కిషోర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మా ట్లాడుతూ పోలీస్‌శాఖ పనితీరు మరింత మెరుగుపడేందుకు సాంకేతికవనరులు కీలకమన్నారు. నారాయణరావు, యల మందరావు, సుబ్బారావు, రిటైర్డ్ ఆర్డీవో రాజారావు పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థలో క్రీడా దినోత్సవం

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యానచంద్ర జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా విభాగం శుక్రవారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ డాక్టర్ మేకా రమేష్, ఇంటర్నల్ క్వాలిటీ అండ్ ఎస్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.బాబూ రాజేంద్రప్రసాద్, క్రీడా కమిటీ సభ్యులు డాక్టర్ రోహిణీ కుసుమ, పి. ప్రసాదరావు, క్రీడా విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగార్జున పుట్టినరోజు వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న సర్వేశ్వరరావు తదితరులు

గాంధీనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ టాలీవుడ్ నటుడు 'కింగ్' అక్కినేని నాగార్జున పుట్టినరోజు వేడుకలు ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్దార్ ఎస్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నగర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. తొలుత గాంధీనగర్‌లోని శ్రీకామాక్షి మూవీస్ కార్యాలయం సెంటర్ వద్ద కేక్ కట్ చేసి నాగార్జునకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక నిర్మల్ హృదయ భవన్ అనాథ ఆశ్రయంలోని పేదలు, వృద్ధులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఆయన అభిమానులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ నాగార్జున తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. నాగార్జున 100వ చిత్రం కోసం ఆయన అభిమానులు ఎదురుచూస్తున్నారన్నారు. టి.శేఖర్, బి.క్రిష్ణ, కే.ప్రభాకర్, ఎస్‌కే.భాషా, ఏ.చిన్ని, ఎం.విజయకృష్ణ, లక్ష్మణ్, ప్రదీప్, శేషు, వివేక్, ఈడి.రాజు, హనుమంతరావు, రియాజ్, రాఘవులు, ఆశోక్, మోహన్, నీల్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.



108 వాహనం ఢీకొని ట్రావెల్స్ ఉద్యోగి మృతి

రాణిగారితోట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక జాతీయ రహదారి పై పండిట్‌నెహ్రూ బస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. రాణిగారితోటకు చెందిన జల్ది వెంకటేశ్వరరావు బస్టాండ్ వద్ద ఒక ట్రావెల్స్‌లో పనిచేస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు. ఇతను సీపీఐ కార్యకర్త. గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉండగా 108వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దోనేపూడి శంకర్‌లు ఆసుపత్రికి వెళ్ళి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సీపీఐ నాయకులు జి.కోటేశ్వరరావు, సంగుల పేరయ్య తదితరులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులకు సూచించారు. నగర పర్యటనలో భాగంగా సత్యనారాయణపురం, దుర్గాపురం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్, లబ్బీపేట, డోర్నకల్‌రోడ్డు, విశాలాంధ్ర రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ ఖచ్చితంగా జరగాలని, వ్యర్థాల నుంచి సందపను సృష్టించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అజిత్‌సింగ్ నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ తదితరులు ఉన్నారు.



మోటారు పైపులతో నీటిని తోడుతున్న దృశ్యం

మోటారు పైపులతో నీరు తొలగింపు

రామలింగేశ్వరనగర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో మళ్లీ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి అర్ధరాత్రి సమయంలో ఊట చేరింది. దీంతో అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. కృష్ణా నది తీరాన రిటైనింగ్ వాల్ సమీపాన ఉన్న ఆళ్ల చెల్లారావు వీధి, యర్ర పోతువారి వీధి, సాయిరామ్ వీధుల్లో ఇళ్లలోకి చేరిన ఊటను మోటారు పైపులతో తోడి నదిలోకి పంపుతున్నారు. మొన్న భారీగా కురిసిన వర్షాల నుంచి నేటి వరకు ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం తమకు అండగా నిలిచిందని లోతట్టు ప్రాంత వాసులు కొనియాడుతున్నారు.

చవితి పందిరిలో బొండా ఉమా పూజలు

కృష్ణలంక, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్‌లో శ్రీ గణేష్ మహోత్సవ కమిటీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి పందిరిలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం రాత్రి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి రంగారావు, పోడూరి పవన్, పాటిబండ్ల విజయభాస్కర్, సింహాద్రి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం చెత్త సేకరణ జరగాలి

చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు



మాట్లాడుతున్న సీఎంవో డాక్టర్ అర్జునరావు

కార్పొరేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోపాటు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా శానిటరీ అధికారులు, సిబ్బంది చూసుకోవాలని, కాంపాక్టర్ బిన్నులు నిండిపోయేంత వరకు ఉండకుండా వెంటనే చెత్త తరలించాలని నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని సమావేశ హాలులో పారిశుధ్య నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ జరగాలన్నారు. కంపాక్టర్ బిన్నులు 75శాతం నిండిన వెంటనే చెత్త తరలించాలని ఆదేశించారు. వ్యాపారస్తులు రోడ్లపై చెత్త వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. అక్టోబరు 2 నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, అన్నపూర్ణ, గోపాలకృష్ణనాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, బయాలజిస్ట్, శానిటరీ సూపర్‌వైజరు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

విజయవాడ కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : నటి శ్రీదేవి 62వ జయంతి సందర్భంగా మహానటి సావిత్రి కళాపీఠం, సాంస్కృతిక సంక్షేమ సంఘం, దేశికా ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వెల్లిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను అలరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి, వాసవి ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షులు, విశిష్ట అతిథి వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడారు. కళా, సాంస్కృతిక రంగాలకు సేవలు అందించిన ప్రసూనా రామన్, వీరభద్రరావు, చావా నరసింహారావు, మహేష్‌లను నిర్వాహకులు సత్కరించారు. ఎంతో మంది కథానాయకులతో శ్రీదేవి నటించిన వివిధ చిత్రాలలోని సినీ గీతాలను గాయనీ గాయకులు శ్రావ్యంగా ఆలపించారు. ప్రముఖ గాయకుడు డేవిడ్‌రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహ్లాదంగా సాగింది.



దొడ్డదేవరపాడు వంతెనపై మూడు అడుగుల ఎత్తున ప్రవహిస్తున్న కట్లేరు

ప్రమాద స్థాయి దాటి కట్లేరు ప్రవాహం

వీరులపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కట్లేరు ప్రమాద స్థాయి దాటి ప్రవహిస్తోంది. వీరులపాడు నుంచి కూడలి, చిలుకూరు, దొడ్డదేవరపాడు మార్గాల్లో మూడు రోజుల నుంచి రాకపోకలు నిలిచి పోయాయి. వందలాది ఎకరాల పంటలు నీటమునిగాయి. భారీ వర్షాలతో కట్లేరు ఉగ్రరూపం దాల్చింది. దొడ్డదేవరపాడు వంతెనపై పది అడుగుల ఎత్తున పొంగిన కట్లేరు వరద కొద్దిగా తగ్గింది. శుక్రవారం సాయంత్రానికి మూడు అడుగుల ఎత్తున వరద ప్రవహిస్తున్నది. చిలుకూరు వంతెన మీద వరద నీరు పారుతోంది. ఈ రెండు రూట్లలో వాహనాల రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. కూడలి రూటులో కొద్ది రోజులుగా వాహనాలు నడవటం లేదు. కట్లేరు వరద విరుచుకుపడటంతో జయంతి, దొడ్డదేవరపాడు, వీరులపాడు, పల్లెంపల్లి గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల్లో మాగాణి వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు ముంపునకు గురయ్యాయి. మూడు రోజుల నుంచి పంటలు నీటిలో నానుతున్నాయి. పంటలు నిలువునా దెబ్బతినటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



నీటమునిగిన పొలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

ప్రభుత్వం దృష్టికి పంట నష్టం వివరాలు

గంపలగూడెం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వరి, పత్తి, పెసర, మినుము, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. పెనుగొలనులో దెబ్బతిన్న పత్తిపంట, అమ్మిరెడ్డిగూడెంలో మొగుళ్లవాగు ఆయకట్టులో నీట మునిగిన వరి పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. వర్షాల మూలంగా మొగుళ్లవాగు పరిధిలో పంటభూములు నీటి మునిగి, మూడుసార్లు వరి నాట్లు వెయ్యాల్సి వచ్చిందన్నారు. పంటల పరిస్థితిని ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్లి, పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటల వివరాలు ఇప్పటికే కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు రేగళ్ల వీరారెడ్డి, యనమద్ది పుల్లయ్యచౌదరి, దిరిశాల వెంకటకృష్ణారావు, వేముల బాలయ్య, బురుగు నారాయణ, కానూరు హనుమంతరావు, కోట వెంకట్, బజ్జూరి నరసింహారావు, తోట సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందిస్తున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

సీఆర్‌డీఏ జాబ్‌మేళాలో 91 మందికి ఉద్యోగాలు

కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యం తో తుళ్లూరులోని సీఆర్‌డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో శుక్రవారం జాబ్‌మేళా జరిగింది. ఈ మేళాలో సెన్స్ సెమికండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవే ట్ లిమిటెడ్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటో మో టార్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీతారామ ఆటో మోటివ్స్ క్యైస్ కార్ప్ లిమిటెడ్ సంస్థలు పాల్గొన్నాయి. జాబ్ మేళాకు 301 మంది అభ్యర్థులు హాజరుకాగా, 91 మందికి ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులతో కలిసి సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆఫర్ లెటర్లు అందజేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణకుమారి, సీఆర్‌డీఏ డీసీడీవో బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీఆర్‌డీఏ సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు జాబ్‌మేళాను సమర్థవంతంగా నిర్వహించారు.

టీటీడీలో లడ్డూ ప్రసాదాల తయారీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పోరాటం

- ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక నేత రామారావు



గవర్నర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదాల తయారీ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని ధార్మిక పరివార్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక పేర్కొంది. ఏలూరు రోడ్డులోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక జాతీయ అధ్యక్షుడు వి.వి.రామారావు విలేకరులతో మాట్లాడారు. లడ్డు ప్రసాదాల తయారీ విభాగంలోని తాత్కాలిక ఉద్యోగుల సమస్యలపై చేపట్టను న్న ఆందోళన కార్యక్రమాలను వివరించారు. గత 25 సంవత్సరా లుగా లడ్డూ తయారీ విభాగంలో పని చేసే కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయకపోవడం వల్ల ఇతర ఉద్యోగులతో సమానంగాప్రయోజనాలు అందడం లేదన్నారు. అనారోగ్యం పాలైనా పట్టించుకోలేని దారుణ పరిస్థితుల్లో కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ పేద బ్రాహ్మణుల విషయంలో చొరవ చూపకుండా చిన్నచూపు చూస్తోందన్నారు. వేదిక ఆధ్వర్యంలో టీటీడీలోని పేద బ్రాహ్మణుల సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు చేపడుతు న్నామన్నారు. సెప్టెంబరు 6న 146 నదీ జలాలతో అమెరికా, కెనడా, యుకె, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లోనూ, సెప్టెంబరు 14న విజయవాడలోని సత్యనారాయణపురంలో మహారుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుద్రాభిషేకం అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు డిప్యూ టీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. వేదిక వ్యవస్థాపకుడు బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ శిక్షణకు ఏపీ క్రీడాకారులు



విజయవాడ (స్పోర్ట్స్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : హర్యానాలో జరిగే మొదటి జాతీయ కబడ్డీ శిక్షణ శిబిరానికి రాష్ట్రానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. ఎం.సుమంత్ (ఎన్టీఆర్ జిల్లా), పి.మణికంఠ (పార్వతీపురం మన్యం జిల్లా), జి.హరీష్ (గుంటూరు జిల్లా), శ్రీష్టి కుమారి (విశాఖపట్నం) ఎంపికయ్యారన్నారు. హర్యానాలోని సోనిపాట్‌లో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారన్నారు. హరిద్వార్‌లో జరిగిన ఫస్ట్ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి కోచింగ్ క్యాంప్ కు ఎంపికయినట్లు తెలిపారు. సోనిపాట్ ప్రతిభ కనబరిస్తే ఆక్టోబర్‌లో బహ్రెయిన్‌లో జరిగే మూడో యూత్ ఏషియన్ గేమ్స్ (అండర్-18)లో ఇండి యా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఏపీ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.ప్రభావతి, జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.అర్జునరావు తదితరులు అభినందనలు తెలిపారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి

- గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పడంలో గిడుగు రామ్మూర్తి పంతులు సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జయంతిని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందన్నారు. తెలుగుభాషకు మించిన కమ్మనైన భాష మరొకటి లేదని, అందుకే దేశ భాషలందు తెలుగు లెస్స అని చాటి చెప్పారన్నారు. గిడుగుకు నివాళులర్పించిన వారిలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు కలెక్టరేట్ సిబ్బంది వున్నారు.



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, డీఎంహెచ్‌వో సుహాసిని

పల్లెల ప్రగతితోనే వికసిత్ భారత్

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాల సుస్థిర అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యమని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. పంచాయతీ అభివృద్ధి సూచిక 2.0పై శుక్రవారం పంచాయితీరాజ్ శాఖ సమావేశ మందిరంలో వర్క్‌షాప్ జరిగింది. జెడ్‌పీటీసీ సభ్యులు, ఎంపీడీవో హాజరైన ఈ వర్క్‌షాప్‌కు కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా గ్రామ పంచాయితీల సంస్థాగత సామర్థ్యాలను పెంచేందుకు, ప్రగతిని నిరంతరం పర్యవేక్షించేందుకు కేంద్ర పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ పీఏఐ 1.0ను రూపొందించిందని, ఇప్పుడు దీనిని ఆధునీకరించి పీఏఐ 2.0గా మార్చడం జరిగిందన్నారు. పేదరికం లేని, మెరుగైన జీవనోపాధులు కలిగిన పంచాయతీలను తీర్చిదిద్దేందుకు 147 సూచికలు ఉన్నట్లు వివరించారు. అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమిష్టి భాగస్వామ్యంతో లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. . స్వర్ణాంధ్ర విజన్ - పది సోపానాలు, కీలక ప్రగతి సూచకలు (కేపీఐ)లను పీఏఐ 2.0తో అనుసంధానిస్తూ పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, విజయవాడ డీఎల్‌డీఓ ఎస్.నిర్మల జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరింత సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

- కొత్తగా 129 పోలింగ్ కేంద్రాలు : డీఆర్వో

ఎన్నికల నిర్వహణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో కొత్తగా 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం అన్నారు. కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో శుక్రవారం .లక్ష్మీనరసింహం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 (ఎస్ఐఆర్-2026) ముందస్తు సన్నాహకంలో భాగంగా నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ నిర్వహించామన్నారు. జిల్లాలో 1200 మంది ఓటర్లకు మించి వున్న పోలింగ్ కేంద్రాన్ని హేతుబద్ధీకరించి కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు, సమీప పోలింగ్ కేంద్రంలో విలీనం చేయాలని ఆదేశించారన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1792 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటిలో 295 పోలింగ్ కేంద్రాలలో 1200 మంది ఓటర్లు మించి ఉన్నారన్నారు. అదనంగా వున్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రంలో విలీనం చేసి కొత్తగా మరో 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందచేశామన్నారు. పోలింగ్ కేంద్రం వారీగా బూత్ స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలని డీఆర్‌వో లక్ష్మీ నరసింహం సూచించారు. ఓటర్ల జాబితాలో సెర్చ్ ఆప్షన్ సౌకర్యం కల్పించాలని, మరణించిన ఓటర్లను (డెత్ డేటా) ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఏదుపాటి రామయ్య (టీడీపీ) తరుణ్ కాకాని (బీజేపీ), కె.పరమేశ్వరరావు (ఏపీఎం), వై.ఆంజనేయరెడ్డి (వైసీపీ), జె.శ్రీనివాస్ (జనసేన), కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ డీటీ ఎఎస్ఆర్ గోపాలరెడ్డి సిబ్బంది వున్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఎయిడ్స్ నివారణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల ప్రజలలో పూర్తి అవగాహన కల్పించి వ్యాధిని నివారించడంతో పాటు వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడంలో స్వచ్ఛంద సంస్థల కృషి శ్లాఘనీయమన్నారు. గత 30 సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దశల వారీగా చేపట్టిన వినూత్న కార్యక్రమాల ద్వారా ఎయిడ్స్ మహమ్మారి పట్ల ప్రజలలో భయం పోగొట్టి మనోధైర్యం కల్పించడం ద్వారా వ్యాధిగ్రస్తుల సంఖ్యను తగ్గించడం జరిగిందన్నారు.

జిల్లాలో విజయవాడ, మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేటలలో హెచ్ఐవీ/ఎయిడ్స్ పరీక్షల కేంద్రాలతో పాటు ఐసీటీఆర్ మొబైల్ వాహనం ద్వారా ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో హెచ్ఐవీ బాధితులకు తొమ్మిది స్వచ్ఛంద సంస్థలు సేవలు అందిస్తున్నాయన్నారు. వ్యాధి సోకిన వ్యక్తుల పట్ల వివక్షలేని వాతావరణం కల్పించడంతో పాటు సమాజంలో సమాన హక్కులు ఉంటాయని గుర్తించేలా కృషి చేయాలన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి మరియు వైద్య అవసరాలను కల్పించి వివక్ష లేని వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ అధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలు, బుక్‌లెట్లను కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, అదనపు డీఎంహెచ్‌వో, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ బి.భానునాయక్, జెడ్‌పీ సీఈ వో కె.కన్నమనాయుడు, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సా నా సుల్తానా బేగం, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, వేదికపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, తెలుగుమహిళా నేతలు

మహిళలకు ఆర్థిక తోడ్పాటే లక్ష్యం

- సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతమైన సందర్భంగా శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో మహిళలతో ఆత్మీయ సమావేశం జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మహిళల్లో చైతన్యం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పద్మావతి విశ్వవిద్యాలయం ఏర్పాటు, మహిళలకు రిజర్వేషన్, ఆస్తి హక్కులను కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తున్నామని, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది చదువుకుంటే అంత మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. చిన్న చిన్న పనులు చేసుకునే మహిళలు ఉచిత బస్సు సౌకర్యం ద్వారా రూ.1500 నుంచి రూ. 2 వేల వరకు ఆదా పొందుతున్నారన్నారు. మచిలీపట్నం - విజయవాడకు ఆరు వరుసల జాతీయ రహదారిని నిర్మించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడామని, ఇందుకు రూ. 2600 కోట్లు మంజూరయ్యాయన్నారు. మచిలీపట్నం - రేపల్లె 45 కి.మీ రైల్వేలైను పొడిగింపు కార్యక్రమానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చిందన్నారు. ఈ రైల్వే లైను కోసం పోరాడిన కొక్కిలిగడ్డ కోదండరామయ్య మృతిచెందడం బాధాకరమన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో 10,500 బస్సులు ఉండగా, అందులో 75 శాతం 8500 బస్సులను మహిళల ఉచిత బస్సు పథకానికి కేటాయించామన్నారు. రోజుకు ఆర్టీసీకి రూ. 7.5 కోట్ల నష్టం వస్తోందన్నారు. ఇప్పటి వరకు 2కోట్ల 40 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకున్నారన్నారు. మరో 1380 కొత్త బస్సులను కొనుగోలు చేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఆర్టీసీ ఆర్‌ఎం వెంకటేశ్వర్లు, డీఎం పెద్దిరాజులు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, అనిత, సమతాకీర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కాశీవిశ్వనాథం, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు విద్యాసాగర్, పి.వి.ఫణికుమార్, అక్కుమహంతి రాజా, హైమావతి, జనసేన నాయకుడు గడ్డం రాజు, చిన్నం శివ పాల్గొన్నారు.

స్వయంగా భోజనం వడ్డించి.. పథకాల లబ్ధిపై ఆరా



మచిలీపట్నం టౌన్ : సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు మం త్రి కొల్లు రవీంద్ర స్వయంగా భోజనం వడ్డించారు. మహిళలతో ఉచిత బస్సు పథకంపై మాట్లాడారు. తల్లికి వందనం అందరికీ అందుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఎలా చదువుతున్నారని ఆరా తీశారు. ఎంఎస్ఎంఈ పథకం కింద దరఖాస్తు చేసుకోమని సూచించారు. ఉచిత గ్యాస్ సిలెండర్ పథకం లబ్ధిని అడిగి తెలుసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు

గ్రంథాలయ సంస్థల సెస్ బకాయిల జమకు కృషి

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు కోటేశ్వరరావు

గవర్నర్‌పేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థలకు చెల్లించాల్సిన సెస్ బకాయిల సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సెస్ బకాయిలు నేరుగా సంస్థ జెడ్‌జీఎస్ ఖాతాల్లో జమ పడేలా కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల సంఘం ద్వితీయ మహాసభ శుక్రవారం రాగూర్ గ్రంథాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గు రిందపల్లి రాంబాబు అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ శాఖా గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉం దని, ఆ దిశగా చర్యలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. ఏపీ జెఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతులు, పనివేళల మార్పు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదవీ విరమణ చేసిన తోకల రాంబాబుకు ఆత్మీయ సత్కారం జరిగింది. రాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జీ, కోశాధికారి బి.గణేష్‌బాబు, ఉపాధ్యక్షుడు రంగారావు, సహాయ కార్యదర్శి ఆలీ, జిల్లా అధ్యక్షుడు కె.కృపానందం, కార్యదర్శి చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదం సమయంలో మంటలను ఎలా నిరోధించాలి, గాయపడిన వారిని తక్షణం వైద్య సహాయానికి తరలించడంపై మాక్‌డ్రిల్

ప్రయాణికుల రక్షణలో రైల్వే సన్నద్ధతపై మాక్‌డ్రిల్

రైల్వేస్టేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే స్టేషన్‌లో సివిల్ డిఫెన్స్ యూనిట్, దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్), బనారస్ లోకో వర్క్స్ (బీఎల్‌డబ్ల్యు)ల పౌర రక్షణ బృందం సంయుక్తంగా శుక్రవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించాయి. రైల్వే సిబ్బంది విపత్తు ప్రతిస్పందన బృందాల మధ్య అత్యవసర సంసిద్ధత సమన్వయాన్ని పెంపొందించడం లక్ష్యంగా మాక్ డ్రిల్‌ను నిర్వహించాయి. ప్రధాన రైల్వే హబ్‌లో అగ్నిప్రమాదం జరగడం, బాధితుల తరలింపు, ప్రథమ చికిత్స, సంక్షోభ పరిస్థితులను ఎదుర్కోవడంలో వివిధ విభాగాల సంసిద్ధత, ప్రతిస్పందన సమయం వంటి వాటిని చేసి చూపించారు. అగ్నిమాపక యంత్రాలను ఉపయోగించడం, ప్రమాదాలను తగ్గించడానికి తక్షణం పొగను అదుపు చేయడం వంటి ముఖ్యమైన అగ్ని భద్రతా పద్ధతులను ప్రదర్శించారు. సురక్షితమైన తరలింపు పద్ధతులపై రైల్వే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు దివ్యాంగులను సురక్షితంగా చేర్చడానికి మార్గనిర్దేశం చేశారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్, పాసేజ్‌వేలను క్లియర్ చేయడం, బాధితుల కోసం స్ట్రెచర్ తరలింపు, క్రమబద్ధమైన రక్షణ విధానాలను ప్రదర్శించారు సివిల్ డిఫెన్స్ బృందాలు, రైల్వే భద్రతా సిబ్బంది మధ్య సమన్వయం, సంక్షోభంలో కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. ఇదే సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న ప్రయాణికులకు ప్రాథమిక వైద్యం ఎలా చేయాలో చెప్పారు. ప్రొఫెషనల్ వైద్య బృందాలు రాకముందే ముందస్తు వైద్యం ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. క్లిష్టమైన పరిస్థితులలో తక్షణ చికిత్స ప్రాణాలను ఎలా కాపాడుతుందో విశదీకరించారు. విజయవాడ స్టేషన్ స్టేషన్ డైరెక్టర్ ఎం.శైలజ మాట్లాడుతూ స్టేషన్లలో భద్రత కేవలం ఒక ప్రోటోకాల్ కాదు, ఇది మనం ప్రతిరోజూ పెంపొందించుకునే సంస్కృతి. అన్నారు. మాక్ డ్రిల్ రైల్వే యంత్రాంగం సంసిద్ధతను, అన్ని పరిస్థితులలోనూ ప్రయాణీకులను సిబ్బందిని రక్షించడానికి అచంచలమైన నిబద్ధతను చాటిందని తెలిపారు. క్రమం తప్పకుండా చేసే మాక్‌డ్రిల్‌లు రైల్వే బృందాలు అప్రమత్తంగా, సమన్వయంతో క్షణంలో చర్య తీసుకోవడానికి సిద్ధంగా ఉండడానికి సహకరిస్తాయని తెలిపారు. ప్రయాణికుల భద్రత, సమర్థవంతమైన విపత్తు ప్రతిస్పందన విధానాల పట్ల భారతీయ రైల్వేల అంకితభావాన్ని బలోపేతం చేస్తూ రక్షణ బృందాల వేగవంతమైన క్రమశిక్షణ చర్యలను అధికారులు ప్రశంసించారు.

ఈ కార్యక్రమాన్ని స్టేషన్ మాస్టర్ సాంబశివరావు, దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ (సీనియర్ సీడీఐ) టి. సుధీర్ బాబు, బనారస్ లోకో వర్క్స్ జనరల్ మేనేజర్ ప్రోటోకాల్ ఆఫీసర్ మార్కండేయ మిశ్రా పర్యవేక్షణలో నిర్వహించారు.

కృష్ణా వర్సిటీ బీ-ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వ గుర్తింపు

మచిలీపట్నం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాయూనివర్సిటీ ప్రాంగణంలో నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వం అనుమతు లు ఇస్తూ ఈనెల 28వ తేదీన జీవో ఆర్‌టీనెంబరు 155ను జారీ చేసింది. 2025-26 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలోని 91 ఫార్మసీ కళాశాలలకు అనుమతులను పొడిగిస్తూ ఈనెల 12వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో కృష్ణాయూనివర్సిటీలో నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాల పేరు లేదు. దీంతో గత ఐదు సంవత్సరాలుగా నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఫార్మసీ కళాశాలకు గుర్తింపు ఇవ్వక పోవడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 18వ తేదీన కృష్ణ..కృష్ణా అనే శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. దీంతో యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపి ఎట్టకేలకు బీ-ఫార్మసీ కళాశాలకు అనుమతులు తీసుకువచ్చా రు. 2025-26 విద్యాసంవత్సరంలో కృష్ణాయూనివర్సిటీకి బీ-ఫార్మసీ కళాశాలలో 60 సీట్లకు ప్రభు త్వం అనుమతులు ఇచ్చింది.

క్రీడాకారులకు రూ.1.98 కోట్ల ప్రోత్సాహం

విజయవాడ (స్పోర్ట్స్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో బంపర్ ఆఫర్ అందించిందని శాప్ ఛైర్మన్ రవి నాయుడు తెలిపారు. గురువారం రూ.4.9 కోట్ల క్రీడా ప్రోత్సహకాలు విడుదల చేసిన ప్రభుత్వం శుక్రువారం మరో రూ.1.98 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఏపిలో 177మంది జాతీయ క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడం హర్షణీయం అన్నారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారిని గౌరవించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు క్రీడాకారుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



యాంటీ లార్వా చర్యలపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

ఉద్యమంలా ఫ్రైడే-డ్రైడే

విజయవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఫ్రైడే-డ్రైడేను ఉద్యమంలా అందరూ పాటించాలని, ఏ ఒక్క ఇంటిని విడిచిపెట్టకుండా పరిశీలించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుహాసిని పేర్కొన్నారు. హుడా కాలనీ ఎంఐజీ అపార్ట్‌మెంట్స్ వద్ద శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కలిగించేలా లార్వా నివారణ కార్యక్రమాలు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, డాక్టర్ పద్మావతి, ఏఎంవో సూర్యనాయక్, ఎస్‌యువో రామచంద్రారెడ్డి, హెచ్.వి.అసుంత, ఏఎన్ఎం లు, ఆశాలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్ అజీమ్ సేవలు అభినందనీయం

- కస్టమ్స్ జాయింట్ కమిషనర్ శ్రీధర్ తానాజీ దూమల్

విజయవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : అమూల్యమైన సేవలతో కస్టమ్ డిపార్ట్‌మెంట్‌లో అబ్దుల్ అజీమ్ సుస్థిర స్థానాన్ని పొందారని కస్టమ్స్ జాయింట్ కమిషనర్ శ్రీధర్ తానాజీ దూమల్ అన్నారు. ఆటోనగర్‌లోని కస్టమ్స్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అసిస్టెంట్ కమిషనర్ అబ్దుల్ అజీమ్ ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్నారు. అంకితభావంతో పనిచేసిన అజీమ్ సేవలు ఉద్యోగులందరికీ ఆదర్శమన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.నాగరాజు మాట్లాడుతూ, కృషి, పట్టుదలే సోపానాలుగా అంచంచెలుగా ఎదిగిన ఆదర్శ అధికారి అజీమ్ అన్నారు. అజీమ్ మాట్లాడుతూ సత్ఫలితాలు పొందాలనే ఆకాంక్ష, అందరి సహకారం తనను ఈ స్థాయిలో నిలిపాయన్నారు. అజీమ్‌ను కస్టమ్స్ ఉద్యోగులు సన్మానించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం
30 ఆగస్టు 2025



వంటిల్లు

కందతో రకరకాల కూరలు, పచ్చడి చేస్తూ ఉంటాం. అన్నీ వేటికవే విభిన్నంగా రుచికరంగా ఉంటాయి. ఇవికాక అందరూ ఇష్టపడే సరికొత్త కంద రుచులు మీకోసం...



కందతో కమ్మగా రుచులు

కంద వేపుడు

కావాల్సిన పదార్థాలు

● కంద గడ్డ- పావు కేజీ, జీలకర్ర- ముప్పావు చెంచా, పచ్చి శనగపప్పు- ముప్పావు చెంచా, మినపప్పు- పావు చెంచా, ధనియాలు- అర చెంచా, ఆవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, ఎండు మిర్చి- అయిదు, పసుపు- పావు చెంచా, ఉప్పు- ముప్పావు చెంచా, కారం- అర చెంచా, ఎండు కొబ్బరి తురుం- రెండు చెంచాలు, ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- నాలుగు, కొత్తిమీర- కొద్దిగా, నూనె- నాలుగు చెంచాలు, కరివేపాకు- నాలుగు రెమ్మలు

తయారీ విధానం

● స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చుక్కల నూనె వేసి వేడిచేయాలి. అందులో నాలుగు ఎండుమిర్చి, అరచెంచా జీలకర్ర, అరచెంచా ధనియాలు, అరచెంచా పచ్చి శనగపప్పు, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు వేసి దోరగా వేపాలి. ఇందులోనే కారం కూడా వేసి బాగా కలిపి పళ్లెంలోకి తీయాలి. ఇవన్నీ చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి. కందను తీసుకుని తొక్క తీసి నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత గ్రేటర్ సహాయంతో తురిమి పెట్టుకోవాలి. అలాగే ఉల్లిపాయను కూడా తురుముకోవాలి.

● స్టవ్ మీద మంద పాటి గిన్నె పెట్టి నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో పావుచెంచా జీలకర్ర, ఆవాలు, పావుచెంచా పచ్చిశనగపప్పు, మినప్పప్పు, ఒక ఎండు మిర్చి, పసుపు వేయాలి. ఇవి వేగాక కంద తురుం, ఉల్లిపాయ తురుం, పచ్చిమిర్చి ముక్కలు, ఎండు కొబ్బరి తురుం వేసి జాగ్రత్తగా కలపాలి. ఎనిమిది నిమిషాలపాటు పెద్ద మంట మీద దోరగా వేపాలి. తరవాత ముందుగా గ్రైండ్ చేసిపెట్టుకున్న కారం పొడి మిశ్రమం, ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు చిన్నమంట మీద వేగనిచ్చి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారుచేసుకున్న కంద వేపుడు కరకరలాడుతూ చాలా రుచిగా ఉంటుంది.

చిట్కా

● కంద తురుమును పసుపు నీళ్లలో వేసి రెండు నిమిషాల తరవాత నీళ్లను వడగట్టాలి. తరవాత తురుమును చేత్తో గట్టిగా పిండి పలుచని గుడ్డ మీద పరచి కొద్దిసేపు ఆరనిస్తే దానిలోని జిగురు పోతుంది. వేపుడు కూడా అంటుకోకుండా విడివిడిగా తయారవుతుంది.



కందలో పీచుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కందతో తయారుచేసిన వంటకాలు తిన్న తరవాత చాలాసేపటి వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. మహిళలు తరచూ కందను ఆహారంలో చేర్చుకోవడం వల్ల వారిలో ఈస్ట్రోజన్ హార్మోన్ సమతౌల్యంలో ఉంటుంది.

కంద కబాబ్

కావాల్సిన పదార్థాలు

● కంద- పావు కేజీ, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, అల్లం- మూడు చిన్న ముక్కలు, పచ్చి మిర్చి- అయిదు, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత, జీలకర్ర పొడి- అర చెంచా, ధనియాల పొడి- అర చెంచా, కారం- పావు చెంచా, ఓట్స్ పొడి- రెండు చెంచాలు

తయారీ విధానం

● మిక్సీలో వెల్లుల్లి రెబ్బలు, అల్లం ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, కొత్తిమీర, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.

● కందకు తొక్క తీసి చిన్న ముక్కలుగా కోసి పసుపు నీళ్లతో కడగాలి. ఈ ముక్కలను కుక్కర్‌లో వేసి కొన్ని నీళ్లు పోసి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. తరవాత కంద ముక్కలను వెడల్పాటి గిన్నెలోకి తీసుకుని గరిటె సహాయంతో మెత్తగా మెదపాలి. ఇందులో జీలకర్ర పొడి, ధనియాల పొడి, అల్లం-వెల్లుల్లి-పచ్చిమిర్చి పేస్టు, కారం, ఓట్స్ పొడి వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. తరవాత ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా చేత్తో తీసుకుని గుండ్రని టిక్కీల మాదిరి చేయాలి.

● స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. తరవాత టిక్కీలను పరచాలి. చిన్న మంట మీద రెండు వైపులా ఎర్రగా వేపాలి. ఇలా తయారుచేసుకున్న కంద కబాబ్‌లను గ్రీన్ చట్నీ లేదా చిల్లీ సాస్ లేదా టమాటా కెచప్‌తో సర్వ్ చేసుకోవాలి.

కందను తరచూ తినడం వల్ల రక్తం పరిశుభ్రమవుతుంది. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. ఆలుగడ్డతో పోలిస్తే కందకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి మధుమేహం ఉన్నవారు కందను తినవచ్చు.

చిట్కాలు

● ఓట్స్ పొడికి బదులు బ్రెడ్ పౌడర్ లేదా శనగపిండి వాడుకోవచ్చు.

● టిక్కీలు చేసేటప్పుడు చేతిని కొద్దిగా తడి చేసుకుంటే మిశ్రమం అంటుకోకుండా ఉంటుంది.

భోజన కుతూహలం

వాము ఆకుల్లో ఘాటైన ఔషధ గుణాలు

వాము, తులసీ, పుదీనా- ఈ మూడు ఒకే కుటుంబానికి చెందిన మొక్కలు. అందుకే వీటి ఘాటైన వాసన, ఔషధగుణాలు కొంతవరకు పోలికలు కలిగివుంటాయి. వాము ఆకులను చేత్తో నలిపితే వచ్చే బలమైన వాసనకు కారణం థైమాల్ అనే నూనె. ఇది సూక్ష్మక్రిములను సంహరించే గుణం కలిగి ఉండడం వలన ఆకులు సహజ యాంటీసెప్టిక్‌గా పని చేస్తాయి. తులసీ, పుదీనాకి కూడా ఈ తరహా ఔషధ గుణాలే ఉన్నాయి. వాము ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలను మన పూర్వీకులు గుర్తించి గ్రంధస్తం చేశారు. ఆ వివరాలలోకి వెళ్తే..

● వాము ఆకులు ఉష్ణ స్వభావం కలిగినవి. వాతం, కఫాలను తగ్గిస్తాయి. కడుపు నొప్పిని తగ్గించడంలో, జీర్ణాగ్ని వెలిగించడంలో ప్రత్యేకమైన గుణం కలిగినవి! వాము ఆకులు ఘాటైన వగరుతో కూడిన కారపు రుచి కలిగి, మిరప కారానికి సమానంగా వేడిని కలిగిస్తాయి.

● వాము ఆకులకు అజీర్ణాన్ని తగ్గించే శక్తి ఉంది. అందుకే అజీర్తితో బాధపడే వారు క్రమం తప్పకుండా వాము ఆకులను తింటే ఈ సమస్య తొలగిపోతుంది.

● వామాకులు శ్వాసకోస సమస్యలకు ఉపశమనం కలిగిస్తాయి. దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలకు వామాకులు మంచి పరిష్కారం అని చెప్పవచ్చు.

● వాము ఆకులు కడుపులో ఉండే గడ్డలను కరిగిస్తాయి. నులిపురుగులను చంపుతాయి. విషదోషాలు ఏవైనా ఉంటే వాటిని కూడా హరిస్తాయి.

● వాము ఆకులు శరీరానికి వేడిని కలిగిస్తాయి. అందువల్ల వేడితత్వం ఉన్న వారు పరిమితంగా తీసుకోవాలి. ముఖ్యంగా పురుషులు వీటిని తక్కువ తినాలి. లేకపోతే శుక్రకణాలు తగ్గే ప్రమాదం ఏర్పడవచ్చు.

చాలా మంది వాము ఆకులతో బజ్జీలు వేసుకుంటారు. వీటితో పచ్చడి కూడా చేస్తారు. మజ్జిగ పులుసు వంటి వాటిలో వాము ఆకులను దోరగా వేయించి కలిపితే మంచి రుచి వస్తుంది.



● గంగరాజు అరుణాదేవి

ట్రెండీ హ్యాండ్ బ్యాగ్‌లు ఇవే..

మహిళలు సందర్భానికి తగ్గట్టు రకరకాల హ్యాండ్ బ్యాగ్‌లు ఉపయోగిస్తూ ఉంటారు. వేడుకలు, దూర ప్రయాణాలు, కార్యాలయాలకు వెళ్లేటప్పుడు అనువుగా ఉండే వేర్వేరు హ్యాండ్ బ్యాగ్‌లను తీసుకెళుతూ ఉంటారు. ప్రస్తుతం యువతులను ఆకర్షిస్తూ ట్రెండింగ్‌లో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లు ఇవే...

డఫెల్ బ్యాగ్

ఇది స్థూపాకారంలో అడ్డంగా ఉంటుంది. వారాంతపు టూర్, పిక్నిక్, దూర ప్రయాణాలకు అనువుగా ఉంటుంది. ఈ బ్యాగ్ లోపల విశాలంగా ఉండడం వల్ల చాలా వస్తువులను పొందికగా సర్దుకోవచ్చు. ఈ డఫెల్ బ్యాగ్‌లు పలు రంగుల్లో ఆకర్షణీయమైన డిజైన్లలో లభ్యమవుతున్నాయి.





టోట్ బ్యాగ్

ఇది రోజువారీ అవసరాలకు చక్కగా సరిపోతుంది. ఇలాంటి బ్యాగ్‌లను ఎక్కువగా కాలేజీలు, కార్యాలయాలకు వెళ్లే యువతులు, మహిళలు ఉపయోగిస్తున్నారు. క్యాష్, కార్డులు, లంచ్ బాక్స్, చిన్న టవల్, అదనంగా ఒక సంచి లాంటివాటిని ఈ బ్యాగుల్లో చక్కగా సర్దుకోవచ్చు. పొట్టి, పొడుగు బకిల్స్‌తో సులువుగా భుజానికి వేసుకోవడానికి వీలుగా ఉంటాయి.

క్లచ్

పార్టీలకు, చిన్న ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు చేతిలో పట్టుకోవడానికి వీలుగా ఉంటాయి. అందమైన ఎంబ్రాయిడరీ, లేస్, కుందన్, మెరిసే రాళ్ల వర్కులతో రిచ్‌గా కనిపిస్తుంటాయి. బంగారు, వెండి రంగుల్లో ఉండే క్లచ్‌లను యువతులు ఇష్టంగా కొనుక్కుంటున్నారు. శాటిన్ క్లాత్‌తో రూపొందించిన క్లచ్‌లకు కూడా డిమాండ్ అధికంగానే ఉంది. క్లచ్‌లో కొద్దిగా క్యాష్, మొబైల్, చిన్న లిప్‌స్టిక్, మాయిశ్చరైజర్ మాత్రమే పడతాయి.





బ్యాక్ ప్యాక్

ఇవి చూడడానికి స్టయిల్‌గా కనిపిస్తుంటాయి. కాలేజీలకు, చిన్నపాటి విహారయాత్రలకు వెళ్లేటప్పుడు తీసుకెళ్లడానికి అనువుగా ఉంటాయి. ఫ్యాన్సీ ప్రింట్లతో ట్రెండీగా ఉంటూ ఇవి యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి.

చిన్నప్పుడు రెజ్లింగ్ నేర్పిద్దామనుకొంటే... 'ఆడపిల్లకు అవసరమా' అన్నారు. మెరుగైన శిక్షణ కోసం వేరే ఊరు పంపిద్దామంటే... 'ఒంటరిగా అలా ఎలా' అని ప్రశ్నించారు. కానీ కట్టుబాట్లను అవహేళనలను పక్కనపెట్టి... కూతుర్ని చాంపియన్‌గా చూడాలనుకున్నాడు ఓ తండ్రి. అందర్నీ ఎదిరించి తన కోసం నిలబడ్డ నాన్న కల... తాతయ్య వారసత్వం... రెండిటినీ నెరవేర్చింది... 19 ఏళ్ల తపస్య గెహ్లోవత్. బల్గేరియాలో జరిగిన అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన ఈ రెజ్లర్... అమ్మాయిలు ఎవరికీ తీసిపోరని నిరూపించింది.



విజేత

కుస్తీ... ఆమెకు ఒక తపస్సు

'ప్రపంచ చాంపియన్‌గా తిరిగిరా'... తపస్య తాత చివరి మాటలవి. పోటీలకు సరిగ్గా వారం ముందు గుండె పోటుతో ఆయన మరణించారు. ఆ సమయంలో తపస్య ఢిల్లీ సన్నాహక శిబిరంలో సాధన చేస్తోంది. వార్త విన్న వెంటనే ఇంటికి వచ్చేద్దామనుకొంటే... ఆమె తండ్రి పర్వేష్ ఒప్పుకోలేదు. 'తాతయ్య చివరి కోరిక నిన్ను వరల్డ్ చాంపియన్‌గా చూడాలని. అదే విషయం నీతో చెప్పమన్నారు' అంటూ కూతుర్ని సముదాయించారు. బాధను దిగమింగుకొని తాత ఆకాంక్ష నెరవేర్చేందుకు కఠోర సాధన చేసింది తపస్య. ఆగస్టు 20న బల్గేరియాలో జరిగిన 'అండర్ 20 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్' మహిళల 57 కేజీల విభాగంలో అద్భుత ప్రదర్శనతో అబ్బురపరిచింది. సెమీఫైనల్‌లో జపాన్ రెజ్లర్, డిఫెండింగ్ చాంపియన్ సొవాకా ఉచిడాను మట్టి కరిపించి, సంచలనం సృష్టించింది. నలభై అంతర్జాతీయ బౌట్స్‌లో వరుస విజయాల తరువాత సొవాకాకు ఇదే తొలి ఓటమి కావడం విశేషం. అంచనాలు తలకిందులు చేస్తూ ఫైనల్స్‌కు చేరిన తపస్య... నార్వే క్రీడాకారిణి ఫెలిసిటాస్ డోమాజెవాను ఓడించింది. ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. విజయానంతరం భుజాలపై మువ్వన్నెల జెండా కప్పుకొని... స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. 'నాన్న కల, తాతయ్య చివరి కోరికను నెరవేర్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది' అంటూ భావోద్వేగానికి లోనైంది.

'ఆడపిల్లకు అవసరమా అన్నారు'...

తపస్య కుటుంబంలో కుస్తీ కొత్తేమీ కాదు. ఆమె ముత్తాత చౌదరి హజారీలాల్ స్థానిక దంగల్‌లో పేరుమోసిన మల్లయోధుడు. ఆయన ఘనతలను తండ్రి పర్వేష్ కథలు కథలుగా తన కూతురుకు చెప్పేవారు. తపస్యను కూడా ఆయనంతటి రెజ్లర్‌ను చేయాలని కలలు కనేవారు. "మా తాత హజారీలాల్ చుట్టుపక్కల గ్రామాల్లో జరిగే బౌట్స్‌లో అదరగొట్టేవారు. రెజ్లింగ్‌లో మాకు మెలకువలు ఎన్నో చెబుతుండేవారు. నేను కూడా మల్లయోధుడినే. స్కూల్ గేమ్స్ జాతీయ చాంపియన్‌ని. కానీ గాయం కారణంగా ఈ క్రీడను వదిలిపెట్టాల్సి వచ్చింది. అందుకే తపస్య పుట్టినప్పుడే అనుకున్నా... తనను మంచి రెజ్లర్‌ను చేయాలని. అయితే తనకు పదేళ్ల వయసులో శిక్షణలో చేర్పించాలని అనుకున్నప్పుడు కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. 'ఆడపిల్ల మల్లయుద్ధం చేస్తుందా' అంటూ ఎగతాళి చేశారు. శిక్షణకు పంపించవద్దని నా మీద ఒత్తిడి తెచ్చారు. కానీ నేను వేటికీ తలొగ్గలేదు. అప్పుడు ఒక్కటే సంకల్పించాను... 'నా కూతుర్ని చాంపియన్‌గా చూడాలి. తను భారత్‌కు ప్రాతినిధ్యం వహించి పతకాలు తేవాలి' అని. నా ప్రార్థనలు, ప్రయత్నాలు ఫలించాయి. నేడు తపస్య ప్రపంచ చాంపియన్. ఇది నాడు అవహేళన చేసినవారికి, ఆడపిల్లలను తక్కువ చేసి మాట్లాడినవారికి తగిన సమాధానం" అంటారు పర్వేష్.

అప్పుడూ అడ్డుపడ్డారు...

ఇద్దరు సంతానంలో పెద్దమ్మాయి తపస్య. 2016లో రెజ్లింగ్ మొదలుపెట్టింది. ఆరంభంలో స్థానికంగానే శిక్షణ తీసుకుంది. ప్రొఫెషనల్‌గా ఎదగాలంటే అక్కడున్న సౌకర్యాలు సరిపోవు. దాంతో సోనీపత్ సమీపంలోని 'యుద్‌వీర్ అఖడా'లో కుల్‌బీర్ రాణా నేతృత్వంలో శిక్షణ ఇప్పించాలని పర్వేష్ అనుకున్నారు. వాళ్ల ఊరుకు వంద కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంది ఆ అఖడా. "నేను చిన్నకారు రైతును. ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. కుటుంబమంతటికీ అదే ఆధారం. నా భార్య నవీన్ కుమారి టీచర్. బయట ఊరికి పంపించి కూతురికి కోచింగ్ ఇప్పించాలంటే మా సంపాదన సరిపోదు. దానికితోడు చుట్టుపక్కల వారు, సంఘం పెద్దల నుంచి ఒత్తిడి... 'కట్టుబాట్లను కాదని ఆడపిల్లను బయటి ప్రాంతానికి పంపవద్ద'ని అప్పుడూ అడ్డుపడ్డారు. అయినా వెనక్కి తగ్గలేదు" అంటూ తపస్య తండ్రి నాటి రోజులు గుర్తు చేసుకున్నారు.

దేశం కోసం...

చిన్నప్పటి నుంచీ తపస్య పెద్దవాళ్ల అడుగుజాడల్లోనే నడిచింది. వయసు పెరిగే కొద్దీ ఆమెలో ఎంతో పరిణతి. పదమూడేళ్లప్పుడు ఇంటికి దూరంగా శిక్షణ కోసం వెళ్లినప్పుడు ఆమెకు ఒకటే లక్ష్యం... అమ్మానాన్న తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని. అంతేకాదు... భారత్‌కు ప్రాతినిధ్యం వహించి... దేశం కోసం పతకాలు తేవాలని. కోచ్ తపస్యను తన సొంత బిడ్డలా చూసుకున్నారు. బౌట్‌లో మేటిగా నిలబెట్టారు. స్థానిక పోటీలకు పంపించారు. క్రమంగా బౌట్‌లో పుంజుకొంటున్న తపస్య... రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగంలో పలు టైటిళ్లు నెగ్గింది. గత ఏడాది థాయ్‌లాండ్‌లో జరిగిన అండర్ 20 'ఆసియా చాంపియన్‌షిప్' 57 కేజీల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది. ఇది ఆమెలో ఆత్మవిశ్వాసం నింపడమే కాదు... కెరీర్‌ను మరో స్థాయికి తీసుకువెళ్లింది. అదే ఏడాది జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకం గెలిచిన తపస్య... జాతీయ క్రీడల్లో చాంపియన్‌గా ఆవిర్భవించింది. ఈ ఏడాది చివర్లో జరిగే సీనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. కోచింగ్ కోసం ఆమె తండ్రి ఐదు లక్షల రూపాయల అప్పు చేశారు. 'ఇంకా ఆ అప్పు అలాగే ఉంది' అంటారాయన. ప్రస్తుతం తపస్య తమ్ముడు దక్ష్ కూడా రెజ్లింగ్‌లో శిక్షణ తీసుకొంటున్నాడు. ఏదిఏమైనా ఒలింపిక్స్‌లో పతకం సాధించాలన్నదే తన లక్ష్యమంటున్న తపస్య... దాన్ని అందుకొనేందుకు ఒక తపస్సులా శ్రమిస్తోంది.

మేకప్

జోడుతో జోరుగా...

ఫ్యాషన్ కోసం పెట్టినా, మందగించిన కంటిచూపు కోసం వాడుకున్నా కళ్లజోడుకూ మేకప్‌కూ పొంతన కుదరదు. కానీ కొన్ని తెలివైన చిట్కాలు పాటిస్తే, కళ్లజోడుతో కూడా మేకప్‌ను మ్యాచ్ చేయవచ్చు. అదెలాగంటే...

ఐబ్రో: జోడు ఫ్రేమ్ కనుబొమలను కప్పేస్తున్నాయి కదా అని కనుబొమలను నిర్లక్ష్యం చేయకూడదు. వాటిని చక్కని ఆకృతిలో కత్తిరించుకుని, బ్రో పెన్సిల్‌తో దిద్దుకోవాలి. ఇలా చేస్తేనే జోడులో నుంచి కనుబొమలు స్పష్టంగా కనిపిస్తాయి

బ్రష్: జోడుతో మేకప్ వేసుకోవడంలో ఇబ్బంది ఉండనే ఉంటుంది కాబట్టి పొడవాటి హ్యాండిల్ కలిగిన మేకప్ బ్రష్‌లకు బదులుగా కురచ బ్రష్‌లు ఎంచుకోవాలి.

ఐలైనర్: కనురెప్పల పైనా, దిగువనా ఐలైనర్ తప్పనిసరిగా అప్లై చేసుకోవాలి. ఇందుకోసం పై కనురెప్పకు జెల్ ఐలైనర్ అప్లై చేసి, దిగువన పౌడర్ ఐలైనర్ ఉపయోగించాలి

ప్రైమర్: ముక్కుకు ఇరువైపులా ప్రైమర్ అప్లై చేసి రూపమివ్వాలి. కళ్లద్దాలు ముక్కు మీదకు జారిపోతూ ఉంటాయి. కాబట్టి ఇలా తరచూ జరగకుండా ఉండడం కోసం, ముక్కు మీద కళ్లజోడు తగిలే ప్రదేశంలో ఐషాడో ప్రైమర్‌ను అద్దుకోవాలి

మస్కారా: కాలం చెల్లిన మస్కారా వేసుకుంటే, అది పొడిపొడిగా జోడు మీద రాలిపడుతూ ఉంటుంది. కాబట్టి తాజా మస్కారా ఎంచుకోవాలి. ఒకసారి మూత తెరిచిన తర్వాత మస్కారాను మూడు నెలలకు మించి వాడుకోకూడదు. అలాగే క్రీమీగా ఉండే వాటర్‌ప్రూఫ్ మస్కారానే ఉపయోగించాలి. ఈ మస్కారాతో కనురెప్పలు జోడుకు అంటుకుపోకుండా ఉంటాయి

భూతద్దం: షార్ట్ సైట్ ఉన్నవాళ్లు జోడు ధరించకుండా మేకప్ వేసుకోలేరు. కాబట్టి జోడు లేకుండా మేకప్ వేసుకోవాలనుకుంటే, భూతద్దం కొనుక్కోవాలి. ఈ అద్దం దగ్గరుంటే, జోడుతో పని లేకుండా మేకప్ వేసుకోవచ్చు

స్ప్రే: కళ్లజోడు ధరించినప్పుడు కళ్ల చుట్టూ ఉండే ప్రదేశంలో తేలికగా చమట పడుతూ ఉంటుంది. కాబట్టి మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ స్ప్రే ఉపయోగించాలి.



జీడీపీ హుషారు.. రూపాయి బేజారు



జూన్ త్రైమాసిక వృద్ధి 7.8% ● అంచనాలను మించి పరుగు

జీవితకాల కనిష్ఠానికి రూపాయి ● ఒక్క రోజులో 51 పైసలు డౌన్

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో (క్యూ1) అంచనాలను మించి 7.8% వృద్ధి రేటును నమోదు చేసింది. తొలి త్రైమాసికానికి ఇటీవల ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 6.5% కన్నా ఇది చాలా అధికం. ఇది ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి. ఆ రకంగా ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని భారత్ నిలబెట్టుకుంది. గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన వృద్ధి రేటు 8.4% తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. కాగా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో చైనా ఆర్థిక వృద్ధి రేటు 5.2 శాతానికే పరిమితం అయింది. అయితే ఇది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు అమలులోకి రాక ముందు పరిస్థితి. ఇప్పుడు భారత ఉత్పత్తులపై 50% సుంకాలు అమలులోకి రావడంతో టెక్స్‌టైల్స్ సహా కీలక ఎగుమతి రంగాలు డీలా పడి వృద్ధి అంచనాలను తలకిందులు చేయవచ్చని పరిశీలకులంటున్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం వ్యవసాయ రంగం క్యూ1లో బలమైన వృద్ధి రేటు నమోదు కావడానికి ఊతం ఇచ్చింది. అలాగే వాణిజ్యం, హోటళ్లు, ఆర్థిక, రియల్ ఎస్టేట్ రంగాలు సహా సేవల రంగం కూడా ఈ వృద్ధికి బాసటగా నిలిచింది. ఎన్ఎస్ఓ గణాంకాల్లోని ప్రధానాంశాలు...

- వ్యవసాయ రంగం క్యూ1లో 3.7% వృద్ధి రేటు నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ రంగం వృద్ధి రేటు 1.5 శాతంగా ఉంది. తయారీ రంగం వృద్ధి మాత్రం మందకొడిగా ఉంది. ఈ రంగం వృద్ధి రేటు 7.6% నుంచి 7.7 శాతానికి పెరిగింది.
- స్థిర ధరల్లో ఆర్థిక వ్యవస్థ విలువ గత ఏడాది క్యూ1తో పోల్చితే రూ.44.41 లక్షల కోట్ల నుంచి రూ.47.89 లక్షల కోట్లకు పెరిగింది. అంటే వృద్ధి రేటు 7.8 శాతంతో సమానం.
- ప్రస్తుత ధరల ప్రకారం ఆర్థిక వ్యవస్థ విలువ రూ.రూ.86.05 లక్షల కోట్లుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.79.08 లక్షల కోట్లతో పోల్చితే వృద్ధి రేటు 8.8 శాతంగా ఉంది.
- ప్రభుత్వ తుది వినియోగ వ్యయం బలమైన పునరుజ్జీవంతో 4% నుంచి 9.7 శాతానికి పెరిగింది. రిటైల్ ప్రైవేట్ తుది వినియోగ వ్యయం మాత్రం 8.3% నుంచి 7 శాతానికి దిగజారింది. స్థిర ధరల ప్రకారం స్థూల స్థిర పెట్టుబడులు 6.7% నుంచి 7.8 శాతానికి పెరిగాయి.
- విభిన్న విధానాల ద్వారా జీడీపీ మదింపులో ఏర్పడిన వ్యత్యాసం రూ.33,384 కోట్ల నుంచి రూ.1.11 లక్షల కోట్లకు పెరిగింది.

అమెరికా సుంకాల ప్రభావం వల్ల వృద్ధి రేటు క్షీణించే ముప్పు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 6.3%-6.8% మధ్యన ఉండవచ్చు. దేశీయ డిమాండు బలంగా ఉండడం ఇందుకు కారణం. జీడీపీపై సుంకాల ప్రభావం తాత్కాలికంగానే ఉంటుంది. జీఎస్‌టీ రేట్ల సరవణకు కసరత్తు జరుగుతూ ఉండడం, పండగల డిమాండు వృద్ధికి ఊతం ఇచ్చే అంశాలు.
- అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

పాతాళానికి రూపాయి

ట్రంప్ సుంకాల ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌పై తీవ్రంగా పడింది. శుక్రవారం అమెరికా డాలర్ మారకంలో రూపాయి తొలిసారిగా 88 కన్నా దిగజారింది. శుక్రవారం ఉదయం 87.73 వద్ద ప్రారంభమైన రూపాయి త్వరితగతిన దిగజారుతూ ఒక దశలో 88.33 వరకు కూడా పడిపోయింది. చివరికి నష్టాన్ని 51 పైసలకు పరిమితం చేసుకుని 88.09 వద్ద ముగిసింది. ఈ రెండూ జీవితకాల కనిష్ఠ స్థాయిలే. కాగా గురువారం నాడు రూపాయి 11 పైసలు నష్టపోయి 87.58 వద్ద ముగిసింది.

విదేశీ నిధుల తరలింపే కారణం: ట్రంప్ సుంకాల అమలు అనంతరం భారత మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారీ ఎత్తున నిధులు తరలించుకుపోతున్నారు. ఎఫ్‌పీఐలు శుక్రవారం ఒక్క రోజులోనే రూ.8,312.66 కోట్లు తరలించుకుపోయారు. గురువారం రూ.3,856.51 కోట్ల విలువ గల ఈక్విటీలు విక్రయించారు. ఒకపక్క విదేశీ నిధులు భారీగా తరలిపోవడంతో పాటు మరోపక్క భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఏర్పడిన ఉద్రిక్తతలతో దేశీయ కరెన్సీ తీవ్ర ఒత్తిడికి లోనవుతోందని ఫారెక్స్ ట్రేడర్లంటున్నారు.

ఫారెక్స్ నిల్వలు డౌన్: రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ నెల 22వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 438.6 కోట్ల డాలర్లు దిగజారి 69,072 కోట్ల డాలర్లకు తగ్గాయి.

ఐఎంఎఫ్ ఈడీగా ఉర్జిత్ పటేల్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న కేవీ సుబ్రమణియన్‌ను ప్రభుత్వం ఆరు నెలల ముందుగానే తొలగించింది. ఈయన స్థానంలో పటేల్‌ను తాజాగా ప్రభుత్వం నియమించింది. కాగా పటేల్ గత ఏడాది జనవరి వరకు ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టాను అందుకున్న పటేల్ 2016 నుంచి 2018 డిసెంబరు వరకు ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేశారు.

ఫిలిప్పీన్స్‌లో నెఫ్రోప్లస్ విస్తరణ

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్.. ఫిలిప్పీన్స్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. ఇందులో భాగంగా మరో ఐదు డయాలసిస్ క్లినిక్స్‌ను కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. నెఫ్రోప్లస్ పేరుతో కంపెనీ డయాలసిస్ సేవలందిస్తోంది. ఈ కొనుగోలుతో ఫిలిప్పీన్స్‌లో మొత్తం క్లినిక్ సంఖ్య 39కి చేరుకుంది. 2020లో కంపెనీ ఫిలిప్పీన్స్ మార్కెట్లోకి అడుగుపెట్టినప్పటి నుంచి ఏటా కార్యకలాపాలు విస్తరిస్తూ వస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30 తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	560
వరంగల్	517	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	112
వరంగల్	92	గుంటూరు	107
కరీంనగర్	92	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	92	చిత్తూరు	97
కర్నూలు	92	నెల్లూరు	102
విశాఖపట్నం	116	అనంతపురం	102
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,03,310 ▲	94,700 ▲	1,29,000 ▼
విజయవాడ	1,05,000 ▲	98,000 ▲	1,20,300 ▲
విశాఖపట్నం	1,05,540 ▲	94,050 ▲	1,29,900 ▼
రాజమండ్రి	1,03,310 ▲	94,700 ▲	1,20,500 ▲
ప్రొద్దుటూరు	1,03,800 ▲	94,990 ▲	1,19,600 ▲
ముంబై	1,02,388 ▲	93,787 ▲	1,17,572 ▲

80,000 దిగువకు సెన్సెక్స్

ముంబై: అమెరికా సృష్టించిన సుంకాల కల్లోలంతో వరుసగా మూడో రోజు కూడా మార్కెట్ పతనమైంది. ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు రెండూ పతనాల బాటలో పయనించగా బులియన్ మార్కెట్ మాత్రం దూసుకుపోయింది. దీంతో శుక్రవారం సెన్సెక్స్ 270.92 పాయింట్లు నష్టపోయి 79,809.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 338.81 పాయింట్ల నష్టంతో డే కనిష్ఠ స్థాయి 79,741.76ని తాకింది. కాగా నిఫ్టీ 74.05 పాయింట్ల నష్టంతో 24,426.85 వద్ద క్లోజైంది. వరుసగా 3 రోజుల పతనంతో ఇన్వెస్టర్ల సంపద రూ.11,21,459.36 కోట్లు ఆవిరైపోయింది.

బంగారం దూకుడు: ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లకు భిన్నంగా బులియన్ మార్కెట్లో కొనుగోళ్లు జోరుగా సాగాయి. స్టాకిస్టులు భారీ ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడంతో ఒక్క రోజులోనే 10గ్రాముల మేలిమి బంగారం (99.9% స్వచ్ఛత) ధర రూ.2,100 దూసుకుపోయి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,03,670ని తాకిందని అఖిల భారత సరాఫా అసోసియేషన్ తెలిపింది. ఆభరణాల బంగారం (99.5 స్వచ్ఛత) కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,03,100 పలికింది. బంగారం ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. వారం మొత్తంలో బంగారం ధర రూ.3,300 (3.29%) పెరిగింది.



ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.7,324.34 కోట్ల డివిడెండ్‌ను అందించింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి ఎం నాగరాజు, ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్లు దినేశ్ పంత్, రత్నాకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఏఐ సరికొత్త కామధేనువు

ప్రతి ఒక్కరికీ కృత్రిమ మేధ సేవలందిస్తాం

గూగుల్, మెటా భాగస్వామ్యంలో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు

వచ్చే ఏడాది జియో పబ్లిక్ ఇష్యూ.. ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడి



న్యూఢిల్లీ: రిలయన్స్ జియోతో దేశ టెలికాం రంగంలో సంచలనం సృష్టించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మరో సంచలనానికి సిద్ధమవుతోంది. దేశంలో ప్రతి చోట, ప్రతి ఒక్కరికీ కృత్రిమ మేధ (ఏఐ) సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం రిలయన్స్ ఇంటలిజెన్స్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. శుక్రవారం కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఆర్ఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ముకేశ్ అంబానీ ఈ విషయం వెల్లడించారు. 'జియో ద్వారా దేశంలో ప్రతి చోట, ప్రతి ఒక్కరికీ డిజిటల్ సేవలను చేరువ చేశాం. ఇప్పుడు అదే తరహాలో రిలయన్స్ ఇంటలిజెన్స్ ద్వారా దేశంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి చోటా ఏఐ సేవలు అందిస్తాం' అన్నారు. ఏఐ కామధేనువులా తమ వ్యాపార విస్తరణకు తదుపరి చోదక శక్తి కాబోతోందని ముకేశ్ అంబానీ ప్రకటించడం విశేషం.

మెటా, గూగుల్‌తో జట్టు: అంతర్జాతీయ టెక్ దిగ్గజాలతోనూ రిలయన్స్ చేతులు కలుపుతోంది. ఏఐ సేవల కోసం ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా'తో కలిసి ఒక జాయింట్ వెంచర్ (జేవీ) కంపెనీని ఏర్పాటు చేసింది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ జేవీలో తొలుత ఇరు సంస్థలు రూ.10 కోట్ల డాలర్ల (రూ.855 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ జేవీ ద్వారా కంపెనీలు, ప్రభుత్వానికి అవసరమైన ప్రత్యేక ఏఐ సేవలను అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం మెటాకు చెందిన ఓపెన్‌సోర్స్ ఎల్ఎల్ఏఎంఏ మోడల్స్‌ను ఉపయోగిస్తామని జుకర్‌బర్గ్ తెలిపారు. మరోవైపు గూగుల్‌తో కలిసి గుజరాత్, జామ్‌నగర్ ప్రాంతంలోని తన వ్యాపార అవసరాల కోసం ప్రత్యేక క్లౌడ్ రీజియన్ ఏర్పాటు చేయబోతున్నట్టు అంబానీ ప్రకటించారు.

జియో నుంచి స్మార్ట్ గ్లాసెస్: జియో ఫ్రేమ్స్ పేరుతో జియో స్మార్ట్ గ్లాసెస్‌లోకి ప్రవేశించింది. ఆర్ఐఎల్ ఏజీఎంలో రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ ఈ స్మార్ట్ గ్లాసెస్‌ను ఆవిష్కరించారు. ఈ గ్లాసెస్ ద్వారా చేయి పెట్టకుండానే ఏఐ వాయిస్ అసిస్టెంట్ 'రియా' సాయంతో అన్ని భారతీయ భాషల్లో ఫోన్ కాల్స్, మ్యూజిక్, వీడియో రికార్డింగ్స్ వంటి పనులు చేసుకోవచ్చు.

జోరుగా రిటైల్ వ్యాపారం: రిలయన్స్ రిటైల్ వ్యాపారం కూడా జోరందుకున్నట్లు ఆర్ఐఎల్ డైరెక్టర్ ఈషా అంబానీ ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈ విభాగం రూ.3.3 లక్షల కోట్లకుపైగా వ్యాపారం నమోదు చేసిందని వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో రిటైల్ వ్యాపారం ఏటా సగటున 20 శాతం చొప్పున పెరగనుందన్నారు. తమ వ్యాపార ఆదాయంలో 70 శాతం స్టోర్ల ద్వారానే వస్తున్నందున ఏటా 2,000 నుంచి 3,000 కొత్త స్టోర్ల ఏర్పాటు కొనసాగుతుందని ఈషా అంబానీ తెలిపారు.

2026 జూన్ నాటికి జియో మెగా ఐపీఓ

రిలయన్స్ జియో మెగా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మీద కూడా ముకేశ్ అంబానీ స్పష్టత ఇచ్చారు. వచ్చే ఏడాది (2026) జూన్ లోపే ఈ ఐపీఓ మార్కెట్‌కు వస్తుందని ప్రకటించారు. భారత క్యాపిటల్ మార్కెట్ చరిత్రలో ఇదే అతి పెద్ద ఐపీఓ అవుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జియో ఖాతాదారుల సంఖ్య 50 కోట్లు మించిపోయిందని జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ ప్రకటించారు. దీంతో ప్రపంచంలోని అతిపెద్ద టెలికాం కంపెనీల్లో ఒకటిగా జియో ఆవిర్భవించినట్టు తెలిపారు.

ఏజీఎం ఇతర ప్రధాన అంశాలు

- 2030 నాటికి రెండింతలు పెరగనున్న వ్యాపారం
- వచ్చే మూడు, నాలుగేళ్లలో జియో, రిటైల్ ఆదాయాలు రెట్టింపు
- కేజీ బేసిన్‌లో చమురు, సహజ వాయువుల కోసం మరిన్ని బావుల తవ్వకం
- కేజీ బేసిన్‌లో 21,000 బ్యారళ్లకు చేరిన రోజువారీ ముడి చమురు ఉత్పత్తి
- గత ఆర్థిక సంవత్సరం 11 శాతం వృద్ధితో రూ.6,26,921 కోట్ల ఆదాయం
- మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా చమురు శుద్ధి సామర్థ్యం పెంపు
- న్యూ ఎనర్జీలో కొత్త వ్యాపార ప్రాజెక్టులపై రూ.75,000 కోట్ల పెట్టుబడులు
- తొలి మూడు నెలల్లోనే 60 కోట్లకు చేరిన జియోహాట్‌స్టార్ వినియోగదారులు
- త్వరలో రిలయన్స్ నుంచి ఏఐ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోలు
- 2035 నాటికి పూర్తి కాలుష్య రహిత కంపెనీగా ఆర్ఐఎల్

స్పోర్ట్స్

తలైవాస్ శుభారంభం

● తెలుగు టైటాన్స్ ఓటమి ● ప్రొ కబడ్డీ లీగ్



ఆరంభ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ధన్‌రాజ్ పిళ్లే, గోపీచంద్, రవికాంత్ రెడ్డి, వైభవ్ సూర్యవంశీ, జ్యోతి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): సొంతగడ్డపై జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)ను విజయంతో ప్రారంభించాలనుకున్న తెలుగు టైటాన్స్‌కు నిరాశే ఎదురైంది. ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం మొదలైన లీగ్‌లో టైటాన్స్ జట్టుకు తమిళ్ తలైవాస్ ఝలకిచ్చింది. హోరాహోరీగా సాగిన తొలి మ్యాచ్‌లో తలైవాస్ 38-35 స్కోరుతో తెలుగు టైటాన్స్‌పై విజయం సాధించింది. స్టార్ రైడర్ అర్జున్ దేశ్వాల్ సూపర్ 10, కెప్టెన్ పవన్ సెహ్రావత్ 9 పాయింట్లు స్కోరు చేసి తలైవాస్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక, ఆతిథ్య టైటాన్స్ జట్టు తరఫున భరత్ హుడా తొమ్మిది పాయింట్లతో రాణించాడు. అనంతరం పుణెరి పల్టన్, బెంగళూరు బుల్స్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో తొలుత 32-32తో స్కోర్లు సమమయ్యాయి. దీంతో ఫలితం కోసం నిర్వహించిన టైబ్రేకర్‌లో పుణెరి జట్టు 6-4తో విజయం సాధించింది. అంతకుముందు.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక అతిథిగా హాజరై లీగ్‌ను ప్రారంభించారు. ఆరంభ వేడుకల్లో హాకీ మాజీ కెప్టెన్ ధన్‌రాజ్ పిళ్లే, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, అంతర్జాతీయ అథ్లెట్ యర్రాజీ జ్యోతి, కబడ్డీ దిగ్గజం పర్దీప్ నర్వాల్, పారాలింపిక్స్ పతక విజేత యోగేశ్ కథూనియా పాల్గొన్నారు.

సింధుకు నిరాశ

క్వార్టర్‌ఫైనల్లో ఓటమి ● కపిల జోడీ సైతం..
ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



పారిస్: ప్రీక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ వాంగ్ జియాని వరుస గేముల్లో చిత్తు చేయడంతో..భారత స్టార్ పీవీ సింధు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆరో పతకం సాధిస్తుందని భావించారు. కానీ సింధుకు నిరాశ తప్పలేదు. శుక్రవారంనాటి హోరాహోరీ క్వార్టర్‌ఫైనల్లో భారత షట్లర్ ఓటమి పాలైంది. పుత్రి కుసుమ వర్దని (ఇండోనేసియా)తో జరిగిన రౌండ్-8 పోరులో సింధు 14-21, 21-13, 16-21తో పరాజయం చవిచూసింది. అంతకుముందు జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో కపిల/క్రాస్టో ద్వయం 15-21, 13-21తో వరుస గేముల్లో వరల్డ్ నెం.4 మలేసియా జోడీ చెన్ టాంగ్/తో ఈ వీ చేతిలో ఓడిపోయింది. 23 ఏళ్ల వర్దనితో మ్యాచ్‌లో కీలకమైన తరుణాల్లో సింధు తడబాటుకు లోనైంది. తొలి గేమ్‌లో విరామానికి 11-7తో నిలిచిన కుసుమ 18-9 తిరుగులేని ఆధిక్యంలో నిలిచి, అదే జోరులో గేమును చేజిక్కించుకుంది. కానీ రెండో గేములో నెట్ ఆటతోపాటు తనదైన శైలి స్మాష్‌లతో పీవీ ముందంజ వేసింది. ఆపై 16-6తో ఆధిక్యం ప్రదర్శించిన సింధు 21-13తో గేమును సొంతం చేసుకుని పోటీలోకి వచ్చింది. ఇక నిర్ణాయక మూడో గేములో ఇద్దరూ తగ్గేదెలే అనేలా ఆడడంతో 7-7, 8-8, 9-9తో స్కోరు సమమై ఉత్కంఠ పెరిగిపోయింది. ఈ తరుణంలో సింధు తప్పిదాలను సద్వినియోగం చేసుకున్న వర్దని 15-11తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే సింధు పోరాడి 16-17కి ఆధిక్యాన్ని తగ్గించింది. కానీ పొరపాట్లను పునరావృతం చేసిన భారత షట్లర్ గేమును, మ్యాచ్‌ను కోల్పోయింది.



వరల్డ్ కప్ సన్నాహకాల్లో భాగంగా విశాఖపట్నంలో ప్రాక్టీస్ చేస్తున్న భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో సెల్ఫీ దిగిన లోకేష్.. మెగా టోర్నీలో జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ముకేష్‌కు రెండు పతకాలు

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్



షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ షూటర్ నేలవల్లి ముకేష్ రెండు పతకాలు కొల్లగొట్టాడు. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో పసిడి పతకం అందుకున్న ముకేష్, వ్యక్తిగత కేటగిరీలో కాంస్యం సాధించాడు. శుక్రవారం జరిగిన 25మీ. పిస్టల్ టీమ్ విభాగంలో ముకేష్, సూరజ్, అభినవ్ త్రయం (1746 పాయింట్లు) స్వర్ణం దక్కించుకుంది. జూనియర్ 25 మీ. పిస్టల్ వ్యక్తిగత కేటగిరీలో ముకేష్ (576) కాంస్యం నెగ్గాడు. పురుషుల 25 మీ. ఫైర్‌పిస్టల్ వ్యక్తిగత విభాగంలో రాజ్‌కన్వర్ సింగ్ స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఆపై..రాజ్‌కన్వర్, గురుప్రీత్, అంకుర్ త్రయం 25మీ. ఫైర్ పిస్టల్ టీమ్ విభాగంలో పసిడి దక్కించుకుంది. పురుషుల డబుల్ ట్రాప్ వ్యక్తిగత కేటగిరీలో అంకుర్‌కు స్వర్ణం, టీమ్ విభాగంలో కాంస్యం లభించాయి. ఇక మహిళల డబుల్ ట్రాప్ వ్యక్తిగత విభాగంలో మనోళ్లు క్లీన్ స్వీప్ చేశారు. సీనియర్ విభాగంలో భారత్ మొత్తం 31 పతకాలు (14-8-9) సాధించింది. తద్వారా చైనా (15-12-3=30) తర్వాత రెండో స్థానంలో నిలిచింది. అయితే ఓవరాల్‌గా సీనియర్, జూనియర్, యూత్ విభాగాలలో కలిపి మనోళ్లు మొత్తం 103 పతకాలు (52-26-25) కైవసం చేసుకున్నారు.

గాఫ్ గర్జన



మూడో రౌండ్‌కు అమెరికా స్టార్ ● సినర్, జ్వెరెవ్ కూడా
ప్రీక్వార్టర్స్‌కు రిబకినా ● యూఎస్ ఓపెన్

న్యూయార్క్: ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న అమెరికా యువ తార కొకొ గాఫ్.. సొంతగడ్డపై మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. యూఎస్ ఓపెన్‌లో మూడో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్ మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. క్రొయేషియాకు చెందిన వెకిక్‌తో జరిగిన రెండో రౌండ్ పోరులో గాఫ్ 7-6 (5), 6-2తో విజయం సాధించింది. వెకిక్‌తో మ్యాచ్ మధ్యలో, మ్యాచ్ ముగిశాక గాఫ్ తీవ్ర భావోద్వేగానికిగురై కంటతడి పెట్టుకుంది. తొలి సెట్ ముగింపు దశలో వరుసగా రెండుసార్లు డబుల్ ఫాల్ట్ చేసి సర్వీస్ చేజార్చుకున్న క్రమంలో టవల్ అడ్డం పెట్టుకొని ఏడ్చిన గాఫ్.. మ్యాచ్ ముగిశాక స్టాండ్స్‌లో అమెరికా జిమ్నాస్టిక్స్ స్టార్ సిమోన్ బైల్స్ గురించి మాట్లాడుతూ కన్నీటి పర్యంతమైంది. 'ఎంతో ఒత్తిడిలోనూ ఆరు అంగుళాల బీమ్‌పై సిమోన్ అద్భుతమైన విన్యాసాలు చేస్తూ అందరినీ అబ్బురపరుస్తుంది. ఆమెలాగే జీవితంలో నేను కూడా మంచి, చెడు చూశా. అందుకే కోర్టులో రాకెట్ పట్టుకున్నప్పుడల్లా సిమోన్ స్ఫూర్తితో ముందుకెళుతుంటా' అని గాఫ్ వ్యాఖ్యానించింది. 8వ సీడ్ అనిసిమోవా 7-6 (2), 6-2తో మయాపై, 15వ సీడ్ కసత్కినా 6-2, 4-6, 7-5తో రఖిమోవాపై, రెండుసార్లు విజేత ఒసాక 6-3, 6-1తో హీలీపై గెలిచి మూడోరౌండ్‌కు చేరారు.

టామీ పాల్ పోరు.. నాలుగున్నర గంటలు: పురుషుల సింగిల్స్‌లో 14వ సీడ్ టామీ పాల్ తన ప్రత్యర్థిని ఓడించేందుకు నాలుగున్నర గంటల పాటు పోరాడాడు. ఐదు సెట్లపాటు సాగిన ఈ పోరులో పాల్ 7-6(6), 6-3, 5-7, 5-7, 7-5తో నూనో బోర్గెస్‌ను ఓడించి మూడో రౌండ్ చేరాడు. మరో రెండోరౌండ్ పోరులో యానిక్ సినర్ 6-3, 6-2, 6-2తో అలెక్సీ పాప్‌రిన్‌ను ఓడించాడు. మూడో సీడ్ జ్వెరెవ్ 6-4, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై నెగ్గగా.. సిట్సిపాస్ రెండో రౌండ్లోనే ఇంటిబాట పట్టాడు.

వీనస్ 11 ఏళ్ల తర్వాత..

వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ సింగిల్స్ తొలిరౌండ్లోనే నిష్క్రమించినా.. డబుల్స్‌లో మాత్రం శుభారంభం చేసింది. వీనస్/లైలా ఫెర్నాండెజ్ జోడీ 7-6(4), 6-3తో ఆరో సీడ్ లుడ్మెలా/ఎలెన్ పెరోజ్‌ను ఓడించింది. 45 ఏళ్ల వీనస్ యూఎస్ ఓపెన్‌లో డబుల్స్ మ్యాచ్ గెలవడం 2014 తర్వాత ఇదే మొదటిసారి.

రదుకాను ఇంటికి..

బ్రిటన్ బ్యూటీ ఎమ్మా రదుకానుకు యూఎస్ ఓపెన్‌లో చుక్కెదురైంది. 2021లో ఇక్కడ టైటిల్ నెగ్గి అందరినీ ఆకర్షించిన రదుకాను పోరాటం ఈసారి మూడో రౌండ్‌కే పరిమితమైంది. వింబుల్డన్ మాజీ చాంపియన్, 9వ సీడ్ ఎలెనా రిబకినా 6-1, 6-2తో రదుకానును చిత్తుచేసి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

హర్మన్ హ్యాట్రిక్

చైనాపై భారత్ గెలుపు
ఆసియా కప్ హాకీ



రాజ్‌గిర్ (బిహార్): కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ హ్యాట్రిక్‌తో మెరిసిన వేళ ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత్ బోణీ చేసింది. శుక్రవారం జరిగిన పూల్ 'ఏ' మ్యాచ్‌లో మనోళ్లు 4-3తో చైనాపై విజయం సాధించారు. ర్యాంకుల్లో మనకంటే ఎంతో తక్కువ స్థానంలో ఉన్న చైనాపై గెలిచేందుకు భారత్ చెమటోడ్చాల్సి రావడం గమనార్హం. హర్మన్ (20, 33, 47 ని.) మూడు గోల్స్ చేయగా..మరో గోల్‌ను జుగ్‌రాజ్ సింగ్ (18) కొట్టాడు. షిహావో (12), బెన్‌హల్ చెన్ (35), జీషెంగ్ (41) చైనాకు గోల్స్ అందించారు. పూల్ 'ఏ' ప్రారంభ మ్యాచ్‌లో జపాన్ 7-0తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది. భారత్-చైనా మ్యాచ్‌కు హాజరైన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. ఇక..ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో జపాన్‌ను భారత్ ఢీకొంటుంది.

4 బంతుల్లో 4 వికెట్లు

పేసర్ అకీబ్ నబీ సంచలనం
దులీప్ ట్రోఫీ

బెంగళూరు: నార్త్ జోన్ పేసర్ అకీబ్ నబీ దార్ చరిత్ర సృష్టించాడు. దులీప్ ట్రోఫీలో తొలిసారిగా నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతడు హ్యాట్రిక్ కూడా నమోదు చేయడంతో.. కపిల్ దేవ్, సాయిరాజ్ బహుతులే తర్వాత ఈ ఫీట్ సాధించిన మూడో బౌలర్ అయ్యాడు. ఈస్ట్ జోన్‌తో జరుగుతున్న తొలి క్వార్టర్స్‌లో శుక్రవారం రెండో రోజు అకీబ్ 53వ ఓవర్‌లో చివరి మూడు బంతులకు హ్యాట్రిక్ పూర్తి చేసి 55వ ఓవర్ తొలి బంతికే నాలుగో వికెట్ తీశాడు. మొత్తంగా అతడి ధాటికి (3.1-0-5-5) 8 పరుగుల తేడాతో చివరి 5 వికెట్లు కోల్పోయిన ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 230 రన్స్‌కు ఆలౌటైంది. నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 405 పరుగులు చేయగా.. స్పిన్నర్ మనిశికి ఆరు వికెట్లు దక్కాయి. మరోవైపు రెండో క్వార్టర్స్‌లో దానిష్ మలేవర్ (203 రిటైర్డ్ అవుట్) డబుల్ సెంచరీతో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 532/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి నార్త్ ఈస్ట్‌జోన్ 168/7 స్కోరుతో కష్టాల్లో పడింది.



బుక్కరాయసముద్రం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకున్న టీడీపీ కార్యకర్త పవన్‌ను అడ్డుకుంటున్న నాయకులు

శింగనమలలో టీడీపీ శ్రేణుల ధర్నా

» అక్రమార్కుడిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా తీసుకోవడంపై ఆగ్రహం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడి సస్పెండైన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తిరిగి నియమించడంతో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశాయి. శుక్రవారం బుక్కరాయసముద్రం ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించాయి. బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలో ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉండేవారు. నకిలీ జాబ్ కార్డుల తయారీ, శ్రామికుల నుంచి డబ్బులు వసూలు వంటి అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో అధికారులు వారిని సస్పెండ్ చేశారు. ఈ ఐదుగురిలో ఒకరైన సురేశ్‌ను అధికారులు ఇటీవల తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. దీనిపై టీడీపీ కార్యకర్తలు మండిపడ్డారు. సురేశ్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ.. 'సేవ్ టీడీపీ' పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తమ బంధువులకు పదవులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఎంపీడీవో కార్యాలయం వద్దకు వెళ్లి బైఠాయించారు. అధికారులు స్పందించకపోవడంతో పవన్ అనే టీడీపీ కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. డ్వామా విజిలెన్స్ జిల్లా అధికారి శ్రీనివాసులు వచ్చి సురేశ్‌ను రెండ్రోజుల్లో తొలగిస్తామని హామీ ఇవ్వడంతో కార్యకర్తలు శాంతించారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో వాటి కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు... సెప్టెంబరు 1 నుంచి నవంబరు 30 వరకూ లేదా నూతన అక్రిడిటేషన్ కార్డుల జారీ చేసే ప్రక్రియ... ఏది ముందు జరిగితే అప్పటివరకూ ఈ పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని హిమాన్షు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కడప స్టీల్ ప్లాంట్ పనులకు 25 కోట్లు విడుదల

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కడప స్టీల్ ప్లాంట్ పనులకు ప్రభుత్వం రూ.25 కోట్లు విడుదల చేసింది. వైఎస్‌ఆర్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ (మంగళగిరి) చీఫ్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) నుంచి అందిన ప్రతిపాదనల మేరకు కడప స్టీల్ ప్లాంట్ పనులకు రుణాల చెల్లింపు, ఖర్చుల కోసం పరిశ్రమలు, వాణిజ్య శాఖ బడ్జెట్ (2025-26) నుంచి ఈ నిధుల విడుదలకు అనుమతినిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది.

దళిత పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలివ్వండి

» ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దళిత పారిశ్రామికవేత్తలకు చెల్లించాల్సిన పెండింగ్ ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. 'గతేడాదిగా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఈ బకాయిలను వెంటనే విడుదల చేసి పారిశ్రామికవేత్తలను ఆదుకోవాలి' అని లేఖలో రామకృష్ణ కోరారు.

'ఉమెన్ జస్టిస్'లో ఏపీ @ 9

హైకోర్టులో 30 మంది జడ్జీలలో ఐదుగురు మహిళలు

జాబితాలో తెలంగాణ టాప్.. 30 మందిలో 10 మంది వారే

8 హైకోర్టుల్లో ఒక్కొక్కరే.. 3 హైకోర్టుల్లో సున్నా

సుప్రీంలో మహిళా న్యాయమూర్తులు 6.06% మాత్రమే

సుప్రీం చరిత్రలో 51 మంది సీజేఐలు.. ఒక్క మహిళా లేరు

2027లో తొలిసారి మహిళా సీజేఐగా జస్టిస్ బీవీ నాగరత్న

సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రిసెర్చ్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అత్యధిక శాతం మహిళా న్యాయమూర్తులు ఉన్న హైకోర్టుల్లో ఆంధ్రప్రదేశ్ (16.67 శాతం) 9వ స్థానంలో ఉంది. ఏపీ హైకోర్టులో ప్రస్తుతం మొత్తం 30 మంది న్యాయమూర్తులు ఉండగా, వారిలో ఐదుగురు మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. మరో తెలుగు రాష్ట్రం తెలంగాణ (33.3 శాతం) అగ్రస్థానంలో ఉంది. తెలంగాణ హైకోర్టులో మొత్తం 30 మంది న్యాయమూర్తులు ఉండగా, వారిలో 10 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. సెంటర్ ఫర్ లా అండ్ పాలసీ రిసెర్చ్ అనే సంస్థ 'ఈక్వల్ జస్టిస్' పేరుతో దేశవ్యాప్తంగా మహిళా న్యాయమూర్తుల సంఖ్య, ప్రాతినిధ్యం, వారి శాతం తదితర అంశాలతో కూడిన సమగ్ర నివేదికను రూపొందించింది. ఆ నివేదిక ప్రకారం... సుప్రీంకోర్టులో మొత్తం 33 మంది న్యాయమూర్తులు ఉండగా.. వారిలో మహిళా న్యాయమూర్తులు కేవలం ఇద్దరే (6.06శాతం). సుప్రీంకోర్టు ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకూ 279 మంది న్యాయమూర్తులుగా పనిచేయగా.. వారిలో మహిళా న్యాయమూర్తుల సంఖ్య 11 (3.94 శాతం) మాత్రమే. 51 మంది భారత ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేయగా.. వారిలో ఒక్కరు కూడా మహిళలు లేరు.

జస్టిస్ రమణ హయాంలో ముగ్గురు

సుప్రీంకోర్టు చరిత్రలో మొత్తం మహిళా న్యాయమూర్తుల సంఖ్య 11 కాగా.. అందులో ముగ్గురు మహిళా న్యాయమూర్తులు తెలుగు వ్యక్తి జస్టిస్ ఎన్వీ రమణ హయాంలోనే నియమితులయ్యారు. 2021 ఆగస్టు 31న సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ బేలా ఎం త్రివేది నియమితులయ్యారు. ఈ ముగ్గురితో ఒకేరోజు అప్పటి చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ప్రమాణ స్వీకారం చేయించారు. 1989లో జస్టిస్ ఫాతిమా బీవీ తొలిసారిగా సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1937లో జస్టిస్ అన్నా చాందీ దేశంలో మొట్టమొదటి మహిళా న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. 1991లో జస్టిస్ లీలా సేథ్ హైకోర్టుకు మొదటి మహిళా చీఫ్ జస్టిస్ అయ్యారు.

2027లో సీజేఐగా జస్టిస్ నాగరత్న

దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరూ సుప్రీం కోర్టులో మహిళా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయలేదు. ఈ అరుదైన గౌరవం జస్టిస్ బీవీ నాగరత్నకు దక్కనుంది. 2027లో సుప్రీంకోర్టు సీజేఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె పదవీకాలం 36 రోజులే అయినప్పటికీ.. మొదటి మహిళా సీజేఐగా చరిత్రలో నిలవనున్నారు.

హైకోర్టుల్లో 14.42% మాత్రమే

దేశంలో ఎనిమిది హైకోర్టుల్లో ఒక్కొక్కరు మాత్రమే మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. సిక్కిం, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా మధ్యప్రదేశ్, బిహార్ హైకోర్టుల్లో ఒక్కరు చొప్పున బాధ్యతల్లో ఉన్నారు. దేశవ్యాప్తంగా 763 మంది హైకోర్టు న్యాయమూర్తులు ఉండగా.. వారిలో 110 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. అంటే.. హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తుల శాతం 14.42 మాత్రమే.

హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తుల వివరాలు

హైకోర్టు	మొత్తం జడ్జీలు	మహిళలు	మహిళల శాతం
తెలంగాణ	30	10	33.3
సిక్కిం	3	1	33.3
మణిపూర్	4	1	25
గుజరాత్	32	8	25
పంజాబ్, హర్యానా	53	13	24.53
ఢిల్లీ	41	10	24.39
మద్రాస్	65	14	21.54
గౌహతి	25	5	20
ఆంధ్రప్రదేశ్	30	5	16.67
బాంబే	66	11	16.67
కర్ణాటక	50	8	16
కలకత్తా	44	7	15.91
జమ్ము, కశ్మీర్	15	2	13.33
రాజస్థాన్	34	3	8.82
హిమాచల్‌ప్రదేశ్	12	1	8.33
కేరళ	44	3	6.82
జార్ఖండ్	16	1	6.25
ఛత్తీస్‌గఢ్	16	1	6.25
ఒడిస్సా	17	1	5.56
అలహాబాద్	79	3	3.80
మధ్యప్రదేశ్	31	1	2.94
బిహార్	34	1	2.94
ఉత్తరాఖండ్	9	0	0
త్రిపుర	5	0	0
మేఘాలయ	4	0	0

98.4 శాతం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

» 15,308 మందికి కాల్ లెటర్లు: డీఎస్సీ కన్వీనర్

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ తొలి విడత సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. కాల్ లెటర్లు అందిన అభ్యర్థులకు గురు, శుక్రవారాల్లో సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. మొత్తం 15,308 మందికి కాల్ లెటర్లు పంపగా.. వారిలో 15,068 (98.4 శాతం) మందికి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల ధ్రువీకరణ అనంతరం అభ్యర్థులు ఇచ్చిన పోస్టు ప్రాధాన్యతలను పరిగణలోకి తీసుకుని ఎంపిక జాబితాలు ప్రకటిస్తామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలనలో తలెత్తే సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అర్హత సాధించి ఉంటే, వారి ప్రాధాన్యత ఆధారంగా కాల్ లెటర్లు జారీ అయ్యాయన్నారు. డీఎస్సీలో జీవో 77 ప్రకారం హారిజంటల్ రిజర్వేషన్ అమలుచేశామన్నారు. మొదటి దశలో ఓపెన్ కోటా, రెండో దశలో వెర్టికల్ రిజర్వేషన్లు, మూడో దశలో హారిజంటల్ రిజర్వేషన్, ఆ తర్వాత క్రీడా కోటా 3 శాతం పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఎస్సీలను మూడు వర్గాలుగా గుర్తించి రిజర్వేషన్ అమలు చేశామన్నారు. కాగా.. ఇంకా కాల్ లెటర్లు అందని అర్హులకు సోమవారం వాటిని విడుదల చేయాలని నిర్ణయించారు.



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి వరద ఉధృతి

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

» పోలవరం నుంచి 8,06,738 క్యూసెక్కులు విడుదల

పోలవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. అల్పపీడన ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉప నదులు కడెం, మంజీర, హరిద్ర, ఇందావతి, మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి, సీలేరు నదుల జలాలతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 8,06,738 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.90 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.750 మీటర్లు, దిగువన 23.000 మీటర్లు నమోదైనట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

మరింత పెరగనున్న వర్షాలు

» 3న అల్పపీడనం, 5న వాయుగుండం

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉపరితలద్రోణి దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి విదర్భ, కర్ణాటక మీదుగా కేరళ వరకూ విస్తరించింది. దీనికితోడు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో శుక్రవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 31న కోస్తా పరిసరాల్లో ఉపరితలద్రోణి బలపడే అవకాశం ఉన్నందున వర్షాలు పెరుగుతాయని పేర్కొంది. వచ్చేనెల 2న బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించిన తరువాత 3న అల్పపీడనం ఏర్పడి, 5వ తేదీకి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాల్లో శనివారం అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి!

ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహాలు ఉన్నందున వినాయక నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. కాలువలు, వాగులు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది. కృష్ణానది వరద ప్రవాహం ప్రకాశం బ్యారేజి వద్ద 3.08లక్షల క్యూసెక్కులు ఉందని పేర్కొంది.

చిత్రజ్యోతి

SINCE 1965



ప్రేక్షకులను మెప్పిస్తోంది

నారా రోహిత్

"సుందరకాండ' సినిమాకి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబ ప్రేక్షకులు మా చిత్రాన్ని అమితంగా ఆదరిస్తున్నారు' అని అన్నారు హీరో నారా రోహిత్. ఆయన కథానాయకుడిగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'సుందరకాండ' చిత్రం ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ 'సినిమాలో సత్య పాత్రను ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తున్నారు. వెంకీ రాసిన డైలాగ్స్ గురించి చాలా మంది ప్రత్యేకంగా చెప్పారు' అని అన్నారు. వెంకటేశ్ నిమ్మలపూడి మాట్లాడుతూ 'సినిమాను ప్రేక్షకులు ఎంజాయ్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. ఇలాంటి నిర్మాతలు దొరకడం నా అదృష్టం. నారా రోహిత్ నన్ను నమ్మి ఉండకపోతే ఈ రోజు మీ ముందు ఇలా ఉండేవాడిని కాదు' అని అన్నారు.



తన అభిమాన నటుడు చిరంజీవిని కలిసేందుకు ఆంధ్రప్రదేశలోని ఆదోని పట్టణానికి చెందిన రాజేశ్వరి అక్కడ నుంచి సైకిల్‌పై హైదరాబాద్ వచ్చారు. శుక్రవారం చిరంజీవిని కలసి, ఆయన చేతికి రాఖీ కట్టారు. ఆమెను ఆశీర్వదించిన చిరంజీవి ఓ చీరను బహుమతిగా ఇవ్వడంతో పాటు రాజేశ్వరి పిల్లల చదువుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తానని తెలిపారు.



పౌరాణిక 'మయూఖం'

కుశలవ్, తన్మయి హీరో, హీరోయిన్లుగా వెంకట్ బులెమోని దర్శకత్వంలో తెరకెక్కనున్న మైథలాజికల్ థ్రిల్లర్ సినిమా 'మయూఖం'. పూజా కార్యక్రమాలతో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని సినెటేరియా మీడియా వర్క్స్ బేనర్‌పై శ్రీలత వెంకట్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి టీ సిరీస్ సంస్థ ప్రతినిధి ప్రియాంక మన్యాల్ క్లాప్ కొట్టగా, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.



దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా, ఆయన సోదరుడు, నిర్మాత ప్రణయ్‌రెడ్డి వంగా శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రకాళి ప్రొడక్షన్స్ తరపున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని అందించారు.

మన జీవితాల నుంచి పుట్టిన కథ



మౌళి తనుజ్, శివానీ నాగరం ప్రధాన పాత్రధారులుగా దర్శకుడు సాయిమార్తాండ్ రూపొందించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్, సాయి కృష్ణ నిర్మించారు. సెప్టెంబరు 5న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో నిర్మాత ఆదిత్య హాసన్ మాట్లాడుతూ 'అందరికీ రిలేట్ అయ్యే కథ ఇది. అందరి ఇళ్లల్లో ఉండే కథే. ప్రేక్షకులు సినిమా చూస్తున్నంత సేపూ మన జీవితంలో కూడా ఇలానే జరిగిందనే అనుభూతికి లోనవుతారు. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. చదువు రాని అబ్బాయి, అమ్మాయి మధ్య జరిగే ఫన్నీ లవ్ స్టోరీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు.

విశాల్, ధన్సిక నిశ్చితార్థం



కోలీవుడ్ హీరో, నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్, హీరోయిన్ ధన్సికల వివాహ నిశ్చితార్థం శుక్రవారం చెన్నైలో జరిగింది. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ వేడుకలో ఇరు కుటుంబాల సభ్యులు మాత్రమే పాల్గొన్నట్టు వెల్లడించిన విశాల్.. అందరి ఆశీస్సులు కావాలని కోరుతూ తమ నిశ్చితార్థ ఫోటోలను ఎక్స్ వేదికగా షేర్ చేశారు. 'ఈ రోజున మా కుటుంబ సభ్యుల సమక్షంలో ధన్సికకు, నాకు నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని ఎంతో సంతోషంగా మీడియా ద్వారా అందరికీ తెలియజేస్తున్నాను. వివాహ తేదీని త్వరలోనే వెల్లడిస్తాం. ధన్సికతో నిశ్చితార్థం జరిగిన నేపథ్యంలో త్వరలోనే నా బ్యాచిలర్ జీవితానికి ముగింపు రానుంది. ఇకపై నా సినిమాల్లో ముద్దు సన్నివేశాలు ఉండవు' అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



ఉరకలేస్తున్న డుడుమ

ముంచంగిపుట్టు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని డుడుమ జలపాతం వరద నీటితో ఉరకలేస్తోంది. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు డుడుమ జలాశయంలోకి ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. దీంతో జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో దిగువ ఉన్న జలపాతం వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.

రాజ్ కాళహస్తికి అరుదైన గౌరవం



అమెరికాలో ఆర్బీ అవార్డు అందుకుంటున్న రాజ్ కాళహస్తి (ఎడమ నుంచి రెండోవ్యక్తి)

- అమెరికాలో నేషనల్ ఆర్బీ అవార్డుకు ఎంపిక
- గుంటూరు జిల్లా వాసికి ప్రతిష్ఠాత్మక అవార్డు
- త్వరలో అమరావతిలో టెక్ సేవలు: రాజ్

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బల్డ్‌విన్ గ్రూప్ చీఫ్ డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, గుంటూరు జిల్లాకు చెందిన రాజశేఖర్ కాళహస్తికి అమెరికాలో అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో ప్రతిష్ఠాత్మక నేషనల్ ఆర్బీ అవార్డు ఈ తెలుగుతేజాన్ని వరించింది. అమెరికాలో ఎంతో ప్రతిభ కనబర్చిన సీఈవోలు, టెక్ లీడర్లను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. ఈ క్రమంలో రాజశేఖర్ (రాజ్) 2025 ఏడాదికి గానూ లార్జ్ కార్పొరేట్ విభాగంలో ఆర్బీ అవార్డును అందుకున్నారు. గుంటూరు జిల్లాలో రిటైర్డ్ ఏఎస్పీ, విశ్రాంత పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ కుమారుడైన రాజశేఖర్.. అమెరికాలోని బల్డ్‌విన్ గ్రూప్ చీఫ్ డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బల్డ్‌విన్ గ్రూపు 1.4 బిలియన్ డాలర్ల సంస్థగా ఎదగడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. దాదాపు 35 ఇతర సంస్థలను కొనుగోలు చేయడమే కాకుండా, కంపెనీలో డిజిటల్ టెక్నాలజీని విస్తరంచడంలోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. గతంలో సిటీ గ్రూపు, హెచ్‌ఎస్‌బీసీ, జీఈ తదితర సంస్థల్లో ఆయన ఉన్నత హోదాల్లో పని చేశారు. గుంటూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజశేఖర్ తనకు అవార్డు వచ్చిన విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను విస్తృతంగా వినియోగించాల్సి వస్తుందన్నారు. యువత కూడా సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో రాజధాని అమరావతిలో కూడా టెక్నాలజీ సేవల కోసం ఇతర కంపెనీలతో ఒప్పందం చేసుకొనే ఆలోచన చేస్తున్నామని, యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఉన్నామని చెప్పుకొచ్చారు.

బార్ పాలసీ తుస్!

గడువు పొడిగించినా స్పందన శూన్యం.. దరఖాస్తులు రాని బార్లు 471

- 369 బార్లకే నేడు లాటరీ నిర్వహణ
- దెబ్బతీసిన ఏఆర్ఈటీ, 4 దరఖాస్తుల రూలు
- గీత కులాల బార్లకు 75 అప్లికేషన్లు
- దరఖాస్తుల ద్వారా 20 కోట్ల ఆదాయం
- మిగతా బార్లకు త్వరలో రీనోటిఫికేషన్
- అన్ని బార్లకు లైసెన్సీలు వచ్చేదాకా నోటిఫికేషన్లు ఇస్తూనే ఉంటారు!



అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ కొత్తగా తీసుకొచ్చిన బార్ పాలసీ విఫలమైనట్లు తేలిపోయింది. లైసెన్స్‌ల కోసం దరఖాస్తులు రాక.. గడువు మూడ్రోజులు పొడిగించినా పెద్దగా ఫలితం కనిపించలేదు. 840 బార్లకు నోటిఫికేషన్ జారీచేయగా శుక్రవారం రాత్రి 10 గంటల వరకు 369 బార్లకే 4 లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. వాటికి మాత్రమే శనివారం ఉదయం లాటరీ నిర్వహించి లైసెన్సీలను ఎంపిక చేస్తారు. మొత్తంగా చూస్తే 471 బార్లు మిగిలిపోయాయి. నిబంధనల ప్రకారం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీయాలి. చాలా బార్లకు ఒకట్రెండు మాత్రమే వచ్చాయి. ఆ రుసుములను దరఖాస్తుదారులకు తిరిగి చెల్లిస్తారు. తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో బార్ పాలసీకి ఏ మాత్రం స్పందన కనిపించలేదు. రెండు జిల్లాల్లో కలిపి ఒక్క బార్‌కే నాలుగు దరఖాస్తులు అందాయి. అనూహ్యంగా తిరుపతిలో భారీగా దరఖాస్తులు అందాయి. చాలా జిల్లాల్లో నాలుగు దరఖాస్తులు రావడమే కష్టంగా మారితే.. తిరుపతిలో ఓ బార్‌కు 10 దరఖాస్తులు అందాయి. ఈ జిల్లాలో చాలా బార్లకు 7, 8 వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లాలోనూ చాలా బార్లకు దరఖాస్తులు అందాయి. మరీ ఎక్కువగా రాకున్నా పలుబార్లకు నాలుగేసిదరఖాస్తులు వచ్చాయి.

అధికారులు డీలా..

బార్ పాలసీ విఫలం కావడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు డీలా పడిపోయారు. ఎన్ని నిబంధనలు పెట్టినా ఒక్క బార్ కూడా మిగలదని మొదట్లో అంచనా వేసుకున్నారు. చివరకు కనీసం 50శాతం బార్లకు కూడా లాటరీ తీసే పరిస్థితి రాకపోవడంతో షాకయ్యారు. మరోవైపు.. కల్లుగీత కులాలకు కేటాయించిన 84 బార్లకు 75 దరఖాస్తులు అందాయి. ఈ బార్లకు లైసెన్స్ ఫీజు 50 శాతం మాత్రమే. అందుకే స్పందన వచ్చింది. వాటికి కూడా శనివారమే లాటరీ తీయనున్నారు. కాగా.. ఇప్పటివరకూ వచ్చిన దరఖాస్తుల ద్వారా దాదాపు రూ.20 కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖకు సమకూరింది. ఒక్కో దరఖాస్తు రుసుము రూ.5 లక్షలు. లాటరీ నిర్వహించని బార్లకు రుసుములు వెనక్కి ఇవ్వాలనే నిబంధనతో ఆదాయం తగ్గిపోయింది.

ఆ రెండు నిబంధనలతోనే దెబ్బ

బార్ పాలసీ ఘోరంగా విఫలం కావడానికి రెండు నిబంధనలు ప్రధాన కారణం. బార్లకు ఇచ్చే మద్యంపై ప్రభుత్వం అదనంగా 15 శాతం అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం విధిస్తోంది. దీనివల్ల బార్ లైసెన్సీలు ఏడాదికి సుమారు రూ.240 కోట్లు అదనంగా చెల్లిస్తున్నారు. ఒక్కో లైసెన్సీ సగటున రూ.30 లక్షలు అదనంగా కడుతున్నారు. ఈ నిబంధన తొలగించాలని వ్యాపారులు ప్రభుత్వాన్ని అనేకసార్లు కోరారు. ఆర్థిక శాఖ అంగీకరించకపోవడంతో దానిని తొలగించలేదు. ఇంకోవైపు.. కొత్తగా ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు రావాలని.. అప్పుడే లాటరీ తీస్తామన్న నిబంధన తెచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశంతో ఈ నిబంధన పెట్టినట్లు తెలిసింది. నాలుగు దరఖాస్తులంటే రూ.20 లక్షలు వెచ్చించాలి. ఈ రెండు నిబంధనలతో తమపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని భావించిన వ్యాపారులు ఈసారి దరఖాస్తు చేయకుండా దూరంగా ఉండిపోయారు. కొత్తవారు వ్యాపారంలోకి వస్తారనుకుంటే అదీ జరగలేదు. చివరకు రాష్ట్రంలో ఎప్పుడూలేని విధంగా భారీ సంఖ్యలో బార్లు మిగిలిపోయాయి. మిగిలిన బార్లకు త్వరలోనే రీనోటిఫికేషన్ జారీచేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాలు తెలిపాయి. అన్ని బార్లకు లైసెన్సీలు వచ్చేవరకూ ఇలా నోటిఫికేషన్లు ఇస్తూనే ఉంటారు. అయితే తొలి విడతలో బార్లు మిగిలిపోవడం వల్ల ఆదాయంలో నష్టం ఏర్పడుతుంది. ఖాళీగా ఉన్న కాలానికి లైసెన్స్ ఫీజు ఉండదు.

ఆ జీవో 'ఫేక్'!

- పీఎస్‌యూలలో 65 ఏళ్లకు రిటైర్మెంట్‌పై మంత్రుల కమిటీ అంటూ మాయ
- ఒరిజినల్ జీవోలో మార్పులు చేసి ఫేక్ సృష్టి

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్ల నుంచి 65 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదనపై మంత్రుల కమిటీని నియమించినట్లుగా ఫేక్ జీవో తెరపైకి వచ్చింది. సోషల్ మీడియాలో ఇది తెగ తిరుగుతోంది. నిజానికి.. ఆయా సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 సంవత్సరాలు మాత్రమే. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమనూ 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగించాలని కార్పొరేషన్లు, సొసైటీలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగులు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమిస్తూ వారం కిందటే ఉత్తర్వులు జారీ చేసింది. అయితే... ఆ ఉత్తర్వులో '60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు' అనే అంకెలను '62 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు' అని మార్చుతూ ఫేక్ జీవో ఒకటి సృష్టించారు. శుక్రవారం 'జీవో నంబరు 1575' జారీ అయినట్లుగా పక్కాగా రూపొందించారు. అయితే.. జీవో నంబరు 1575 ఇతర అంశానికి సంబంధించింది. కేవలం ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టేందుకే ఈ ఫేక్ జీవో సృష్టించారని... ఇది సంబంధిత వ్యవహారాలు బాగా తెలిసినవారి పనే అని ప్రభుత్వ వర్గాలు అనుమానిస్తున్నాయి.

53 మంది ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా పదోన్నతి

- మరో 158 మంది ఎంపీడీవోలుగా.. డీపీసీ ఆమోదం

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో పంచాయతీ కార్యదర్శి నుంచి డీఎల్‌డీవోల దాకా పదోన్నతులు వేగవంతమయ్యాయి. తాజాగా 53 మంది ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా (డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) పదోన్నతి లభించింది. వీరితో పాటుగా 98 మంది డిప్యూటీ ఎంపీడీవోలు, 56 జడ్పీ ఏవోలు, డీఎల్‌పీవో కార్యాలయంలోని నలుగురు ఏవోలు మొత్తం 158 మందికి ఎంపీడీవోలుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు పదోన్నతుల కమిటీ(డీపీసీ) సమావేశమై శుక్రవారం ఆమోదించింది. పదోన్నతులు కల్పించినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శికి ఏపీ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు వరప్రసాద్, వెంకట్రావు, కేఎస్‌వీ ప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రక్రియను చేపట్టేందుకు కృషి చేసిన ఉపముఖ్యమంత్రి ఓఎస్డీ వెంకట కృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సోషల్ ఆడిట్ డైరెక్టర్‌కు అరుదైన పురస్కారం

- 31న లండన్ వరల్డ్ లీడర్స్ సమ్మిట్‌లో ప్రదానం



అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రజాధనాన్ని సద్వినియోగం చేయడంతో పాటు ప్రజాపాలనలో పారదర్శకత పెంచడానికి కృషి చేసిన ఏపీ సోషల్ ఆడిట్ డైరెక్టర్ గొన్నాబత్తుల శ్రీకాంత్ అరుదైన గౌరవం లభించింది. వరల్డ్ లీడర్స్ సమ్మిట్ ప్రకటించిన పురస్కారాల్లో 'పబ్లిక్ ట్రాన్స్‌పరెన్సీ, గవర్నెన్స్ లీడర్‌షిప్' అవార్డు వరించింది. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆదివారం అవార్డు ప్రదానం జరగనుంది. శ్రీకాంత్ ప్రస్తుతం ఏపీసొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఏపీ శాట్) ఎండీగా ఉన్నారు. ఈ సంస్థ ద్వారా ముఖ్యంగా ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచంలో వ్యవస్థలను నడిపే నాయకుల్లో సమర్థత, నాయకత్వ ప్రతిభ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వరల్డ్ లీడర్ సమ్మిట్ ఈ అవార్డులు ప్రకటిస్తుంది. ఉపాధి హామీ పథకంలో ఏపీ సోషల్ ఆడిట్ విభాగాన్ని శ్రీకాంత్ జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిపారు. ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్‌ను రోల్‌మోడల్‌గా మార్చారు. సోషల్ ఆడిట్ విభాగంలో గత కొన్నేళ్లుగా శ్రీకాంత్ చేసిన కృషికి జాతీయస్థాయిలో పలు అవార్డులు కూడా లభించాయి.

పీఆర్ ఎస్ఈలకు పోస్టింగ్‌లు

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో 15 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు ఎస్ఈలుగా పదోన్నతి కల్పించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వారికి పోస్టింగ్‌లు కేటాయిస్తూ ఆదేశాలిచ్చింది. శ్రీకాకుళం ఎస్ఈగా కె.వీరంనాయుడు, చిత్తూరు ఎస్ఈగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు ఎస్ఈగా వై.కోటేశ్వరరావు, కడప ఎస్ఈగా జి.శ్రీనివాసులు, కర్నూలు ఎస్ఈగా ఐ.వేణుగోపాల్, ఏలూరు ఎస్ఈగా రమేష్, అనంతపురం ఎస్ఈగా వై.చిన్న సుబ్బరాయుడును నియమించారు.

మార్కెటింగ్ శాఖ ఎస్ఈగా రవిప్రసాద్

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ మార్కెట్ ఫండ్ సర్వీస్‌కు చెందిన విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. రవిప్రసాద్‌కు సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ)గా తాత్కాలిక పదోన్నతి కల్పించారు. ఆయనకు మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్ ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. కాగా, ప్రభుత్వం వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా రాష్ట్ర విత్తన ఉప కమిటీని ఏర్పాటు చేసింది.

సీఆర్‌డీఏలో సిబ్బంది నమూనా సవరణ

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్‌డీఏలో టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ పోస్టును క్రియేట్ చేసేందుకు సిబ్బంది నమూనాను సవరణ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. డెవలప్‌మెంట్ కంట్రోల్(డీసీ) డివిజన్ స్థానంలో డెవలప్‌మెంట్ ప్రమోషన్(డీపీ) డివిజన్ చేర్చాలని, 778 పోస్టులకు బదులుగా 754 పోస్టులుగా పేర్కొనాలంటూ జీఓఎంఎస్ నం.81ను సవరిస్తూ ఆదేశాలిచ్చారు.



విశాఖ అక్కయ్యపాలెం హైవేపై దగ్ధమవుతున్న ఆర్టీసీ బస్సు

విశాఖలో హైవేపై ఆర్టీసీ బస్సు దగ్ధం

- షార్ట్‌సర్క్యూట్ కారణమన్న రవాణా మంత్రి

విశాఖపట్నం/సీతంపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఓ ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. కూర్మన్నపాలెం నుంచి విజయనగరం వెళుతున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు శాంతిపురం జంక్షన్‌లో రెడ్‌సిగ్నల్ పడడంతో ఆగింది. ఆ సమయంలో ఇంజన్ నుంచి మంటలు వస్తున్నట్టు గమనించిన ఆటోడ్రైవర్ ఒకరు.. బస్సు డ్రైవర్ రమేశ్‌ను అప్రమత్తం చేశారు. ఆయన వెంటనే బస్సు ఆపి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. క్షణాల్లో బస్సు పూర్తిగా దగ్ధమైపోయింది. ఆర్టీసీ బస్సు పైనే హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండడం, సమీపంలోనే పెట్రోల్‌బంకు ఉండడంతో ఆమార్గంలో ప్రయాణించేవారంతా తీవ్ర ఆందోళన చెందారు. సమాచారం తెలియగానే నగరంలోనే ఉన్న రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. బస్సు కండిషన్ బాగుందని, అయితే, బస్సు ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి దగ్ధమైందని చెప్పారు. మంటలను ముందుగా గుర్తించి డ్రైవర్‌ను అప్రమత్తం చేసిన ఆటోడ్రైవర్‌ను గుర్తించి రివార్డు అందజేస్తామని మంత్రి తెలిపారు. బస్సు డ్రైవర్ ఎం.రమేష్, కండక్టర్ జీపీ సాయిబాబాకు ప్రశంసాపత్రం అందజేసినట్టు మంత్రి తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌కు సీఎం ప్రశంస

అగ్ని ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులోనుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడేలా అప్రమత్తంగా వ్యవహరించిన కూర్మన్నపాలెం-విజయనగరం మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు డ్రైవర్ ఎం.రమేష్, కండక్టర్ జీపీ సాయిబాబాను సీఎం చంద్రబాబు అభినందించారు. క్లిష్టసమయాల్లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలనే స్పృహ కలిగి ఉండడం అభినందనీయమని కొనియాడారు.

'స్త్రీశక్తి' భారం కాదు.. బాధ్యత!

- మహిళలకు ఉచిత ప్రయాణ స్మార్ట్ కార్డులు: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'స్త్రీశక్తి' పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు త్వరలో స్మార్ట్ కార్డులను అందజేయనున్నట్టు రవాణా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలన్నింటి కంటే 'స్త్రీశక్తి' పథకం వల్ల ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారన్నారు. పథకం ప్రారంభించిన తర్వాత 14 రోజుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా 8,500 బస్సుల్లో 2.3 కోట్ల మంది ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. దీని వల్ల ప్రభుత్వం రూ.95 కోట్లు భరించిందన్నారు. స్త్రీశక్తి పథకం ప్రభుత్వానికి భారం కాదని, బాధ్యతని అన్నారు. బస్సుల్లో ప్రయాణించినప్పుడు ప్రతిసారీ ఆధార్ కార్డును చూపించడం కాకుండా స్మార్ట్ కార్డ్ చూపిస్తే మరింత సులభతరమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీకి కొత్తగా 750 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని, 6-7 నెలల్లో మరో 1,500 నుంచి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయబోతున్నామని తెలిపారు. పల్లెవెలుగు బస్సుల్లో ఏసీ సదుపాయం కల్పించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు కూడా తమ ప్రభుత్వం మేలు చేస్తోందని, నైట్ అలవెన్స్ కింద గతంలో రూ.80 ఇస్తే దానిని రూ.150కు పెంచామన్నారు. ఉద్యోగులకు ప్రమాద బీమా కింద గతంలో జీతం నుంచి రూ.2 వేలు మినహాయించేవారని, తమ ప్రభుత్వం ఉచిత బీమాతోపాటు ప్రమాదంలో మరణిస్తే ఇచ్చే రూ.20 లక్షల పరిహారాన్ని రూ.కోటికి పెంచామని వివరించారు. 6,500 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పించామని, ఆన్‌కాల్ డ్రైవర్ల వేతనాన్ని రూ.800 నుంచి రూ.వెయ్యికి పెంచామని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను పూర్తి చేశామని చెప్పారు. ఉచిత బస్సు కారణంగా ఉపాధికి దెబ్బ పడిని ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు త్వరలోనే కొత్త పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.

నిర్వేదంలో 'ఉపాధి' సిబ్బంది!

- ఎదుగుదల లేదని గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బంది అసంతృప్తి
- రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు లేవు
- ఆర్థికేతర సమస్యలైనా తీర్చాలని విజ్ఞప్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓవైపు పంచాయతీరాజ్‌శాఖలో అన్ని కేడర్లకూ వేగంగా పదోన్నతుల ప్రక్రియ జరుగుతుంటే.. మరోవైపు గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది అసంతృప్తితో రగిలిపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని విధాలా ఇబ్బందులు పడ్డ తమను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతనైనా ఆదుకుంటారని భావిస్తే.. 14 నెలలైనా ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని వాపోతున్నారు. దీనిపై అధికారులకు మొరపెట్టుకోవడమే కాకుండా, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సిఫారసులు చేయిస్తున్నా ఫలితం కనిపించడంలేదు. అధికారులు కూడా సమస్యలపై సానుకూలంగానే ఉన్నా.. నిధుల్లేక నెలనెలా జీతాలే ఇవ్వలేని స్థితిలో ఉన్నామని చేతులెత్తేస్తున్నారు.

పేరుకుపోయిన సిబ్బంది సమస్యలు

గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా లోకేశ్ ఉపాధి సిబ్బందికి భారీగా వేతనాలు పెంచారు. మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు అప్పటి రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసి, ఉపాధి కాంట్రాక్టు సిబ్బందికి 42 శాతం జీతాలు పెంచారు. ఆ తర్వాత వైసీపీ హయాం ఐదేళ్లలో ఒక్కపైసా కూడా వారికి జీతాలు పెరగలేదు. పైగా ఉపాధి సిబ్బంది పట్ల దారుణంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో కూటమి సర్కార్ రాగానే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కావడంతో సిబ్బంది గంపెడాశలు పెట్టుకున్నారు. పలు దఫాలుగా సమస్యలను పవన్‌కల్యాణ్‌కు వివరించారు. అధికారులు కూడా వారి సమస్యలపై సానుకూలంగానే స్పందించారు. కమిషనరేట్ స్థాయిలో పలు దఫాలు సమావేశాలు జరిగాయి. అయినా 14 నెలల తర్వాత కూడా పరిస్థితి మారలేదు.

బడ్జెట్ భారంతో..

క్షేత్రస్థాయిలో 13 వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. వారికి కనీసం నెలకు రూ.3 వేల చొప్పున జీతాలు పెంచినా ఏడాదికి రూ.46 కోట్లు అవసరమవుతాయి. మిగతా కాంట్రాక్టు సిబ్బందికి సాలీనా 23 శాతం పీఆర్సీ అమలు చేయలంటే రూ.44 కోట్లు కావాలి. ఇవి కాకుండా 2016లో టీఏలకు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఇచ్చినట్లు మిగిలిన సిబ్బందికి అమలు చేసి అంతరాలు తొలగించాలంటే మరో రూ.20 కోట్లు అవసరమవుతాయి. 2023లో ఏపీఓలకు గ్రేడ్ ఫిక్సేషన్ ద్వారా వారి వేతనాలు పెరిగాయి. అదే తరహాలో మిగతా కేడర్‌కు కూడా గ్రేడ్ ఫిక్సేషన్ చేయాలంటే మరో రూ.20 కోట్లు కావాలి. సిబ్బంది అందరికీ గ్రాట్యుటీ అమలు చేయాలంటే గత పదేళ్లుగా సిబ్బంది నుంచి వసూలు చేయాల్సిన గ్రాట్యుటీ నిష్పత్తిని ఇప్పుడు జమచేయాల్సి ఉంది. అంటే ప్రభుత్వం రూ.100 కోట్లు చెల్లించడం ద్వారా ఎల్ఐసీ ద్వారా గ్రాట్యుటీ పొందే అవకాశముంది. అయినా మొత్తంగా ఇప్పటికిప్పుడు సిబ్బంది సమస్యలు పరిష్కరించాలంటే సుమారు రూ.150 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా అడ్మినిస్ట్రేటివ్ వ్యయం ఏటా 5.5 శాతం వరకు ఖర్చు చేసుకునే అవకాశముంది. గత ఏడాది రూ.336 కోట్లు నిర్వహణా వ్యయం క్లయిం చేసినా రాష్ట్రానికి పలు కారణాల రీత్యా కేవలం రూ.260 కోట్లు మాత్రమే వచ్చాయి. దీంతో సిబ్బందికి నెలనెలా జీతాలు ఇవ్వలేని స్థితి ఉంది. సెర్ప్ మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు ఉపాధి హామీ పథకానికి లేవు. ఈ నేపథ్యంలో జీతాలు పెంచడం ఎలా అని గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఆర్థికేతర సమస్యలైనా పరిష్కరించండి

ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందిని ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్(ఎఫ్‌టీఈ)గా మార్చడానికి మూడేళ్ల అనుభవముండాలి. 2016లో ఎస్ఆర్‌డీఎస్ బోర్డు మీటింగ్ ద్వారా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎఫ్‌టీఈలుగా మార్చారు. ఆ తర్వాత ఆ ప్రక్రియను నిలిపేశారు. ఇటీవల టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు తమను ఔట్ సోర్సింగ్ నుంచి ఎఫ్‌టీఈలుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కపైసా కూడా ఖర్చు కాని ఈ సమస్యనైనా ముందుగా పరిష్కరించాలని కమిషనర్ కృష్ణతేజను కోరుతున్నారు.



వివిధ కేడర్లలో ఇవీ సమస్యలు..

ఉపాధి సిబ్బందిలో పలు కేడర్లకు సమస్యలున్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఎప్పటి నుంచో కేవలం రూ.9 వేల నుంచి 12 వేల వరకు మాత్రమే పనిదినాల బట్టి వేతనాలు పొందుతున్నారు. వారికి కూడా 2018 నుంచి జీతాలు పెరగలేదు. 2016లో టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు పెంచినా.. కొన్ని కేడర్ల సిబ్బందికి వేతనాలు పెరగలేదు. 2023లో ఏపీఓలకు గ్రేడ్ ఫిక్సేషన్ చేసి, మిగతా కేడర్లకు చేయలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సెర్ప్ ఉద్యోగులకు కూడా పీఆర్సీ అమలు చేసి 23 శాతం వేతనాలు పెంచారని, తమకు మాత్రం ఒక్క పైసా కూడా పెంచలేదని వాపోతున్నారు. గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సిబ్బంది హెల్త్ పాలసీ దారుణంగా ఉంది. అనారోగ్యం పాలైతే కాంట్రాక్టు సిబ్బంది అవస్థలు వర్ణనాతీతం. ఈ సమస్యలను ఏకరువు పెడుతూ సిబ్బంది వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నారు.

పోలవరంలో విదేశీ నిపుణులు

- డయాఫ్రం, బట్రస్ డ్యాం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న విదేశీ నిపుణులు, కేంద్ర అధికారులు

అమరావతి/పోలవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పోలవరం హెడ్‌వర్క్స్‌లో కీలకమైన డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాం గ్యాప్-1, గ్యాప్-2 నిర్మాణ పనులను పరిశీలించేందుకు అమెరికా, కెనడాకు చెందిన అంతర్జాతీయ నిపుణులు శుక్రవారం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. అమెరికాకు చెందిన జియాస్ ఫ్రాంకో డి సిస్కో, డేవిడ్ బి.పాల్, కెనడాకు చెందిన రిచర్డ్ డొనెల్లీ.. కేంద్ర జలశక్తి శాఖకు చెందిన డిప్యూటీ కమిషనర్ గౌరవ్ సింఘాల్, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ ఎస్ఎస్ బక్షి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సభ్యకార్యదర్శి రఘురాం, జలసంఘం డైరెక్టర్ రాజేశ్ తొటేజా, సెంట్రల్ సాయిల్ -మెటీరియల్ రీసెర్చ్ సెంటర్(సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్త మనీశ్ గుప్తా తదితరులు మొదటి రోజు ఆయా నిర్మాణాలను పరిశీలించారు. ఎగువ కాఫర్ డ్యాం వద్ద సీపేజీ నివారణ కోసం నిర్మించిన బట్రస్ డ్యాం, జరుగుతున్న డయాఫ్రం వాల్ పనులు, ఈసీఆర్ఎఫ్ డ్యాం వద్ద గ్యాప్-1, గ్యాప్-2 ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులు, దిగువ కాఫర్ డ్యాంలో సీపేజీ తీవ్రత, డీవాటరింగ్, ల్యాబ్‌లలో మెటీరియల్ నాణ్యతను పరిశీలించారు. వారి వెంట ఎంబ్యాక్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ గౌరవ్ తివారీ, ఎంబ్యాంక్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు హేమంత్ గౌతమ్, అశ్విన్ కుమార్ వర్మ, సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు రవి అగర్వాల్, సెంట్రల్ వాటర్-పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) వి.ఎస్.రామారావు, పీపీఏ డిప్యూటీ డైరెక్టర్ ఎ.ప్రవీణ్, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ సంజీవ్, జలవనరుల శాఖ అధికారులు ఉన్నారు. పనులన్నీ డిజైన్ల మేరకు, నాణ్యతా ప్రమాణాల ప్రకారమే జరుగుతున్నాయో లేదో సమీక్షించారు. గతంలో నిపుణులు చేసిన సూచనల మేరకే చేపడుతున్న పనుల గురించి జల వనరుల శాఖ ఈఎన్‌సీ నరసింహమూర్తి బృందం వివరించింది.

రక్తహీనత నివారణలో ఏపీ టాప్

- హరియాణా, తెలంగాణలకు తదుపరి స్థానం

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణ చర్యల్లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచింది. 6 నెలల శిశువు నుంచి యువత, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గించేందుకు ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా తీసుకున్న చర్యలతో రాష్ట్రానికి జాతీయ స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రక్తహీనత నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత రాష్ట్రాలు తీసుకున్న చర్యలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సమీక్షించింది. దీనిలో ఏపీ, హరియాణా, తెలంగాణ రాష్ట్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు లభించాయి. ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి సత్యకుమార్ అభినందించారు.

ఎట్టకేలకు ఆంధ్రా కేడర్‌కు శివశంకర్ లోతేటి

- 1న విధుల్లో చేరనున్న సీనియర్ ఐఏఎస్

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి శివ శంకర్ లోతేటి(2013 బ్యాచ్) ని డీవోపీటీ ఎట్టకేలకు ఏపీ కేడర్‌కు కేటాయించింది. ఈ మేరకు డీవోపీటీ అండర్ సెక్రటరీ అశ్వినీ కుమార్ మిశ్రా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి చెందిన కొంత మంది ఐఏఎస్‌లను డీవోపీటీ వద్ద ఉన్న వివరాల ఆధారంగా తెలంగాణకి కేటాయించింది. శివ శంకర్ లోతేటి ఏపీకి చెందిన వ్యక్తి అయినా, కొన్ని సాంకేతిక కారణాలతో విభజన సమయంలో డీవోపీటి ఆయనను తెలంగాణకు కేటాయించింది. 2024లో తెలంగాణలో రిపోర్టు చేసిన ఆయన, తనను ఏపీకి పంపించాలని క్యాట్‌ను, హైకోర్టును ఆశ్రయించగా ఇప్పుడు ఆయనకు సానుకూలంగా తీర్పులు వెలువడ్డాయి. ఆయన సోమవారం ఏపీలో చేరనున్నారు.


సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్ర: సీఎస్

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి రాష్ట్రాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. అమరావతి సచివాలయంలోని మూడో బ్లాకులో శుక్రవారం ఆయన ఆర్వోప్లాంట్, గ్లాస్ బాటిలింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా ఇప్పటికే సచివాలయంలో ఉద్యోగులందరికీ స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఇంధన సామర్థ్య సూచికలో ఏపీకి ద్వితీయ స్థానం

న్యూఢిల్లీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ విడుదల చేసిన రాష్ట్ర ఇంధన సామర్థ్య సూచిక 2024 ప్రకారం ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల జాబితాలో ఏపీ రెండో స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలవగా, అస్సోం, త్రిపుర ఏపీ తర్వాత స్థానాల్లో నిలిచాయి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) ఈ నివేదికను రూపొందించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఏపీ ఉత్తమ పనితీరును కనబరిచింది.

చంద్రబాబు @ 3



» అత్యంత జనాదరణ కలిగిన సీఎంలలో మూడో స్థానం

» 'ఇండియా టుడే' సర్వేలో వెల్లడి

అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత జనాదరణ కలిగిన ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు మూడో స్థానంలో నిలిచారు. దేశంలోని 28 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల సీఎంల పనితీరుపై 'ఇండియా టుడే' సంస్థ నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ద నేషన్' సర్వేలో ఈ ఫలితం వెలుగుచూసింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 36 శాతం జనామోదంతో మొదటి స్థానంలో నిలువగా.. 12.5 శాతంతో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రెండో స్థానంలో, 7.3 శాతం జనామోదంతో చంద్రబాబు తృతీయ స్థానంలో ఉన్నారు. బిహార్ సీఎం నితీశ్‌కుమార్ 4.3 శాతంతో నాలుగో స్థానంలో.. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ 3.8 శాతంతో ఐదో స్థానంలో నిలిచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఇదే సర్వేలో చంద్రబాబు ఐదో స్థానంలో ఉన్నారు. ఇండియా టుడే 2001 నుంచి మూడ్ ఆఫ్ ద నేషన్ పేరుతో ఏడాదికి రెండు సార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై దేశ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ వస్తోంది.

హలో ఏపీ.. మేమొస్తున్నాం



(మొదట పేజీ తరువాయి)

ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఐబీఎం క్వాంటమ్ అడాప్షన్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ వెల్లడించారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో భారత్ బలమైన శక్తిగా ఎదగనుందని, భవిష్యత్తులో ఈ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నందున ఈ పరిశోధనలవైపు ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. 'ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ 2'ను ఇన్‌స్టాల్ చేయడానికి భారత్‌కు చెందిన అతిపెద్ద ఐటీ సేవల ఎగుమతిదారు టీసీఎస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని... 2026 మార్చి ఆఖరుకు నాటికి దీన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఐబీఎంలో క్వాంటమ్ అడాప్షన్ వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ తెలిపారు. అమెరికాలోని ఐబీఎం రిసెర్చ్ ప్రధాన కార్యాలయమైన థామస్ జే వాట్సన్ సెంటర్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో క్రౌడర్ మాట్లాడుతూ... ఐబీఎం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్లను ప్రకటించిందని.. వాటిలో ప్రస్తుతం అమెరికాలో ఒకటి, జపాన్‌లో రెండు, కెనడా, దక్షిణ కొరియాల్లో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీ టెక్‌పార్క్‌లో ఏర్పాటయ్యే సెంటర్‌తో పాటు.. స్పెయిన్, అమెరికాలోని షికాగోలో కూడా త్వరలోనే తాము ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని క్రౌడర్ వెల్లడించారు. భారత్‌లో క్వాంటమ్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి తమ సంస్థ ఆసక్తిగా ఉందని, ఐటీ సేవల సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ప్రభుత్వ నేషనల్ క్వాంటమ్ మిషన్, ఐఐటీ వంటి విద్యాసంస్థల భాగస్వామ్యంతో ఆ దిశగా పనిచేస్తామని ఆయన తెలిపారు.

ఆసియా టెక్నాలజీ హబ్‌గా విశాఖ

» 'సీ-కేబుల్'తో ప్రపంచం అనుసంధానం

» బీచ్‌రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దేశానికే కాకుండా ఆసియాకే టెక్నాలజీ హబ్‌గా విశాఖ రూపొందుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ-జీవీఎంసీ సంయుక్తంగా బీచ్‌రోడ్డులో నడపనున్న రెండు డబుల్ డెక్కర్(హాప్ ఆన్-హాప్ ఆఫ్) బస్సులను శుక్రవారం ఆయన స్థానిక కాళీమాత ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విశాఖలో త్వరలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతున్నందున సీ-కేబుల్ వేస్తారని తెలిపారు. దీనివల్ల విశాఖతో ప్రపంచం అనుసంధానమవుతుందన్నారు. విశాఖ దేశానికే కాకుండా ఆసియాకే టెక్నాలజీ హబ్ మారనుందని చెప్పారు. విశాఖకు వస్తే తనకు కొత్త ఉత్సాహం వస్తుందని, నగరానికి ఎన్‌డీఏ నేతలమంతా రుణపడి ఉన్నామని అన్నారు. భవిష్యత్తులో విశాఖను నం.1 సిటీగా అభివృద్ధి చేసేందుకు ఎన్‌డీఏ కృషి చేస్తోందని చెప్పారు. విశాఖ నగరానికి బీచ్ కలిసొచ్చే అంశమని, ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారని తెలిపారు. వీరందరూ బీచ్‌రోడ్డులో ఉండే 14 పర్యాటక ప్రాంతాలను ఒకేరోజు సందర్శించేందుకు వీలుగా తొలిదశలో రెండు డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించినట్టు చెప్పారు. ఒక్కో బస్సులో 66 మంది ప్రయాణించే అవకాశం ఉంటుందని, డిమాండ్‌ను బట్టి భవిష్యత్తులో బస్సుల సంఖ్య పెంచుతామన్నారు. భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదేనని, ఈ నేపథ్యంలో డబుల్ డెక్కర్ బస్సులను కూడా ఎలక్ట్రిక్ మోడ్‌లోనే తీసుకున్నామన్నారు. బస్సుకి ఒకసారి చార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్లు ప్రయాణిస్తుందన్నారు.



విశాఖలో డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించి, అభివాదం చేస్తున్న సీఎం

గుంతలు పెట్టిన వారు.. గుంతల్లోకే!

విశాఖను రాజధాని చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించిందని, కానీ.. తమకు ఆ అవసరం లేదని ఇక్కడి ప్రజలు ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని సీఎం వ్యాఖ్యానించారు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయాలని ఇక్కడి వారు కోరుకుంటున్నారని తెలిపారు. రోడ్లపై గుంతలు పెట్టిన ప్రభుత్వం.. గుంతల్లోనే కొట్టుకుపోయిందని విమర్శించారు. విశాఖ బీచ్‌ను కలుషితం చేయకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. మన ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే వస్తువులను ఇక్కడే ప్రాసెసింగ్ చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగానే నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సదస్సులో పాల్గొన్నట్టు చెప్పారు. దేశంలోనే మహిళలకు సురక్షిత నగరంగా విశాఖ ఎంపికైందని, ఈ పరిణామం విశాఖకే కాకుండా రాష్ట్రానికి గర్వకారణమని చంద్రబాబు సంతోషం వ్యక్తంచేశారు. "భవిష్యత్తులో ఇక్కడ ఉద్యోగాలు చేసేందుకు ఎక్కడెక్కడి వారో వస్తారు. మీ మంచితనం, నడవడికతో వారిని మార్చుకోవాలి. అంతేతప్ప, వారిని చూసి మీరు మారిపోవద్దు." చంద్రబాబు సూచించారు.

పర్యాటకుల కోసమే..

డబుల్ డెక్కర్ బస్సులు ప్రారంభించిన అనంతరం చంద్రబాబు ఓ బస్సులో ప్రయాణించారు. టికెట్ ధర రూ.500గా నిర్ణయించగా, దీనిలో రూ.250 ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తున్నట్టు సీఎం తెలిపారు. ఒకసారి టికెట్ కొంటే 24 గంటలపాటు ఆ బస్సుల్లో ప్రయాణించే వెసులుబాటు కల్పించామన్నారు. పర్యాటకుల ఆదరణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. తరచూ ప్రయాణించే వారి కోసం మరింత రాయితీ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. అనంతరం డబుల్ డెక్కర్ బస్సులో నగర ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పార్క్ హోటల్ వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ముచ్చటించారు.



విశాఖలో ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సును ప్రారంభించి, మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి టీజీ భరత్, ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ మోహిత్ సింగ్లా, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి చిరంజీవి చౌదరి

'మెగా' ప్రోత్సాహం!

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 2030 నాటికి భారత్‌లో 700 ట్రిలియన్ డాలర్ల టర్నోవర్ జరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. దీని కోసం మరింత వేగంగా అడుగులు వేయాల్సి అవసరం ఉందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో రాష్ట్ర వాటా ప్రస్తుతం 9శాతంగా ఉందని, జీఎస్‌డీపీలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల వాటా 35 శాతంతో రూ.5.19 లక్షల కోట్లుగా ఉందని వివరించారు. త్వరలో ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా రాష్ట్రం అవతరించబోతుందన్నారు. అలాగే 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా సాగు చేస్తున్న రాష్ట్రం.. దేశానికి ఆక్వా హబ్‌గా మారనుందని తెలిపారు. రాష్ట్రంలో తొమ్మిది సమగ్ర ఆహార పార్కులు, 17 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న కోల్డ్ స్టోరేజీలు, 33 లక్షల టన్నుల సరుకు నిల్వచేసేందుకు గోదాములు ఉన్నాయన్నారు. ఫుడ్, బెవరేజ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా 175నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. చిత్తూరు, గుంటూరు, కోస్తాంధ్ర, విశాఖ జిల్లాల్లో పండ్లు, మసాలా దినుసులు, ఆక్వా, కోకో, కాఫీ క్లస్టర్లు ఉన్నాయన్నారు.

ఇదే సరైన సమయం

గత ఏడాది రాష్ట్రానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఫుడ్‌ప్రాసెసింగ్ రంగంలో అపార అవకాశాలు ఉంటున్నాయని తెలిపారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టే చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)ను కూడా ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయన్నారు. 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' కార్యక్రమాన్ని పెట్టుబడిదారులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఏపీ అతిపెద్ద ఎగుమతి దారు!

ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ.. పండ్లు, ఆక్వా రంగాల్లో ఏపీ అతిపెద్ద ఎగుమతిదారుగా ఉందన్నారు. దేశ ఎగుమతుల్లోనూ రాష్ట్రం కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉద్యాన, ఆక్వా, ఫుడ్‌ప్రాసెసింగ్, బెవరేజెస్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. పెట్టుబడిదారులకు అనుమతులను కూడా వేగంగా ఇస్తామని హామీ ఇచ్చారు. భారత వాణిజ్య ప్రోత్సాహక మండలి చైర్మన్ మోహిత్ సింగ్లా మాట్లాడుతూ.. అమరావతిలో టీపీసీఐ కార్యాలయాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఇండియా ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సదస్సులో ఏపీలో ఆహార ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ చేసిన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు, తదితర అంశాలపై పారిశ్రామికవేత్తలు, నిపుణులు, పరిశోధకుల మధ్య విస్తృత చర్చ జరిగింది. నష్టాల నివారణ, స్మార్ట్ కోల్డ్ చైన్, లాజిస్టిక్స్ సదుపాయాలు, డెయిరీ, పౌల్ట్రీ, మాంసం ప్రాసెసింగ్ వంటి అంశాలపైనా చర్చించారు.


'గ్రిఫిన్ నెట్‌వర్క్' సదస్సుకు సీఎం

ప్రముఖ ఐటీ కంపెనీల సీఈవోలు సభ్యులుగా ఉన్న 'గ్రిఫిన్ నెట్‌వర్క్' సదస్సు శుక్రవారం విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగింది. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, కలెక్టర్ హరేంధిరప్రసాద్ పాల్గొన్నారు. సదస్సుకు సుమారు 25 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ కంపెనీల సీఈవోలతో ఈ సదస్సు నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి సమయం కేటాయించండి

» ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఉండేలా చూడండి

» పదాధికారులు, మోర్చా ప్రతినిధుల వర్క్‌షాప్‌లో మాధవ్



విజయవాడ సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నాయకులకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సూచించారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారు పార్టీ అభ్యున్నతి కోసం సమయాన్ని కేటాయించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పదాధికారులు, మోర్చా ప్రతినిధులతో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడారు. 'ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నాయకులు కదిలిరావాలి. దీని కోసం ప్రతి సోమవారం జిల్లా కేంద్రాల్లో జరిగే పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి. జాతీయ, రాష్ట్ర పార్టీ ఇచ్చే కార్యక్రమాలను నిర్వహించాలి. మన జెండా-మన ఊరు కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలి. ప్రతి గ్రామంలోనూ పార్టీ జెండా ఉండేలా చర్యలు తీసుకోవాలి' అని మాధవ్ పేర్కొన్నారు. అనంతరం గిడుగు రామ్మూర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ పార్టీ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌కి రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో మంత్రి వైసత్యకుమార్, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు సి.ఆదినారాయణరెడ్డి, పార్థసారథి, ఎన్.ఈశ్వరరావు, పార్టీ కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారంలో.. మరో ముగ్గురు కానిస్టేబుళ్లపై వేటు

» ఇప్పటికే ముగ్గురి సస్పెన్షన్

నెల్లూరు (క్రైం), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్, జీవిత ఖైదీ శ్రీకాంత్ వ్యవహారంలో మరో ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు. ఇప్పటికే ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లు సస్పెండైన సంగతి తెలిసిందే. గత ఏడాది డిసెంబరు 15న శ్రీకాంత్‌ను నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి తిరుపతిలోని స్విమ్స్‌కు ఎస్కార్ట్ సిబ్బంది తమ వాహనంలో తరలించారు. నెల్లూరు సిటీ సరిహద్దులు దాటగానే శ్రీకాంత్ ఆ వాహనం దిగి ప్రైవేటు వాహనం ఎక్కారు. ప్రైవేటు వాహనం రోడ్డుప్రమాదానికి గురికావడంతో శ్రీకాంత్ చేతికి గాయమైనట్టు 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో ఎస్కార్ట్ వాహనంలోని ఖలీల్, ఖాజా మొహిద్దీన్, సుబ్బారావు అనే ఏఆర్ కానిస్టేబుళ్లను అప్పట్లో సస్పెండ్ చేశారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు వాహనంలో ఉన్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుళ్లు గంగరాజు, కిశోర్‌లపైనా తాజాగా వేటు వేస్తూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

మీ ప్రాజెక్టు.. మా బాధ్యత

» పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ భరోసా

» ఏపీలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు

» ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు సులభతర విధానం

» 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ: మంత్రి లోకేశ్

» పాఠశాల వ్యవస్థ బలోపేతానికి సైయంట్ అధినేత మోహన్‌రెడ్డి అధ్యక్షతన సలహా మండలి

» విశాఖ జిల్లాలో 50 పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు ప్రారంభం



ఏఐ ల్యాబ్స్‌ను వర్చువల్‌గా ప్రారంభించేందుకు ట్యాబ్‌ను లోకేశ్ దగ్గరకు తీసుకువచ్చిన రోబో

విశాఖపట్నం/మధురవాడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): "ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న తరువాత అది మీ ప్రాజెక్టు కాదు. పూర్తి బాధ్యత మాది" అని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. విడిభాగాల తయారీ నుంచి పోటీతత్వం వరకు భారత దేశ ఏరోస్పేస్ తయారీ, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్ రిపేర్, ఆపరేషన్స్) రంగాలను వేగవంతం చేయడం అనే అంశంపై విమానయాన శాఖ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరర్స్ సంయుక్తంగా విశాఖలోని ఓ హోటల్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం చంద్రబాబు విజనరీ లీడర్‌షిప్ వల్లే మిట్టల్, గూగుల్ వంటి గ్లోబల్ కంపెనీలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చంద్రబాబు ప్రారంభించినప్పుడు 5వేల ఎకరాలు ఎందుకని కొందరు విమర్శించారని, ఇప్పుడు దానివల్ల వచ్చే ఆదాయం తెలంగాణ రాష్ట్ర జీడీపీలో 11శాతం ఉందని వివరించారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో డబుల్ ఇంజన్ సర్కారు పని చేస్తోందని పేర్కొన్నారు. సుందరమైన విశాఖలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టమ్ ఉందని చెప్పారు. విజన్-2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు ఏటా 15శాతం వృద్ధి రేటు సాధించాల్సి ఉంటుందని తెలిపారు. అక్టోబరులో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభం కాబోతున్నాయని, ఆసియాలోనే అతిపెద్దదైన గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రానుందని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టు పనులను రాయలసీమలో రెన్యూ సంస్థ ప్రారంభించిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలకు సులభతరమైన అనుమతుల కోసం విధానపరమైన మార్పులు తెచ్చినట్టు వెల్లడించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టి, కొత్త ఆవిష్కరణలు చేయాలని లోకేశ్ కోరారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగ అభివృద్ధికి డిమాండ్‌తో పాటు అందుకు తగిన సామర్థ్యం కూడా ఉందన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యుత్తమ పాలసీలు ఏపీలో అమలు అవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీఐఐ ఏపీ చైర్మన్ మురళీకృష్ణ, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సలహాదారు సతీశ్‌రెడ్డి, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సీఈవో కరణ్‌బీర్ సింగ్ కల్రా, సీఐఐ డిప్యూటీ డైరెక్టర్ సోనాల్ బెనర్జీ, సైయంట్ ఫౌండర్ చైర్మన్ బీవీఆర్ రెడ్డి పాల్గొన్నారు.

ఒకటే రాజధాని... అభివృద్ధి వికేంద్రీకరణ

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని లోకేశ్ పేర్కొన్నారు. విశాఖ నగరం మధురవాడ 'వి' కన్వెన్షన్‌లో శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అర్థసమృద్ధి-2025 రెండు రోజుల సదస్సును మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఒకవైపు ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు సంపద వృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సీఏల పాత్ర కీలకమని తెలిపారు. ఏఐ ఆధారిత ఆడిట్లతో పాటు సీఏలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేయాలని కోరారు. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. పరిపాలనలో ఏఐ వినియోగానికి టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు.



జాతీయ క్రీడా దినోత్సవం, మాతృభాషా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తిలకు నివాళులర్పిస్తున్న మంత్రి లోకేశ్, కేంద్రమంత్రి రామ్మోహన్ తదితరులు

క్రీడాభివృద్ధికి ప్రపంచ స్థాయి సదుపాయాలు

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన సదుపాయాలను కల్పిస్తామని లోకేశ్ అన్నారు. విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర క్రీడాకారుల రక్తంలోనే నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావం ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచానికి ఏపీని క్రీడల రాజధానిగా చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదన్నారు. తగిన ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు అందించేవారు తయారవుతారని స్పష్టం చేశారు. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యతను క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఎర్రాజి జ్యోతి, సాకేత్ మైనేని, కోనేరు హంపి, రజని, జ్యోతిశ్రీ, షేక్ జెఫ్రిన్, శివారెడ్డి, సత్యగీతతో పాటు గోపీచంద్, ఎంఎస్‌కే ప్రసాద్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు రాంప్రసాదరెడ్డి, వంగలపూడి అనిత, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు, శాప్ చైర్మన్ రవినాయుడు, సీఎండీ గిరీశా, తదితరులు పాల్గొన్నారు.



ఏఐ ల్యాబ్ ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులతో మంత్రి నారా లోకేశ్ సెల్ఫీ

వచ్చేది ఏఐ విప్లవం: లోకేశ్

జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే కష్టపడి, ఇష్టపడి చదవాలని విద్యార్థులకు మంత్రి లోకేశ్ ఉద్బోధించారు. ఏఐ విప్లవం ద్వారా వచ్చే సాంకేతిక ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ ఐటీ సంస్థ 'సైయంట్ ఫౌండేషన్' సహకారంతో రూ.8కోట్ల వ్యయంతో విశాఖ జిల్లాలోని 50 ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఏఐ ల్యాబ్‌లు, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌లను శుక్రవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమానికి చంద్రంపాలెం, వాడపాలెం, ఎండాడ ఉన్నత పాఠశాలల నుంచి దాదాపు 1,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గతంలో పారిశ్రామిక విప్లవం వల్ల అనేక ఉద్యోగాలు వచ్చాయని, ఐటీ విప్లవంతో తెలుగు వారికి లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయని గుర్తుచేశారు. ఇప్పుడు రాబోయేది ఏఐ విప్లవం అన్నారు. విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారమే కారణమని పేర్కొన్నారు. వచ్చే నాలుగేళ్లలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలపై దృష్టిసారిస్తానని చెప్పారు. టీచర్లకు బోధనేతర పనులు తగ్గించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లు త్వరలో విధుల్లో చేరుతాయని లోకేశ్ ప్రకటించారు. విద్యా వ్యవస్థలో అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సమస్యలు వస్తే పరిష్కరించుకుందామని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. పిల్లలంతా బాగా చదువుకుని రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. 1991లో హైదరాబాద్‌లో ఇన్ఫోటెక్ కంపెనీ స్థాపించిన బీవీఆర్ మోహన్‌రెడ్డి తరువాత దానిని సైయంట్ కంపెనీగా పేరు మార్చారని చెప్పారు. ప్రస్తుతం 16వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారని, భారత్‌తో పాటు 22 దేశాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని వివరించారు. రూ.8కోట్ల సీఎస్ఆర్ నిధులతో 50 ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటుచేశారని ప్రశంసించారు. పాఠశాల వ్యవస్థ బలోపేతానికి మోహనరెడ్డి అధ్యక్షతన ఐదుగురితో కూడిన సలహా మండలిని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో లోకేశ్ సెల్ఫీలు దిగారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కోటంరెడ్డిని లేపేస్తే డబ్బేడబ్బు!

- నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి హత్యకు రౌడీషీటర్ల కుట్ర?
- సంభాషణల వీడియో వెలుగులోకి
- వీడియోలో కనిపించిన రౌడీషీటర్ శ్రీకాంత్ అనుచరుడు జగదీశ్



నెల్లూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హత్యకు రౌడీషీటర్లు కుట్ర పన్నారా?. ఆయనను హతమార్చే విషయంపై చర్చించుకున్నారా?. అంటే.. తాజాగా ఎమ్మెల్యేను ఉద్దేశించి రౌడీషీటర్లు మాట్లాడుకున్న వీడియో వెలుగులోకి రావడంతో ఔననే సమాధానమే వినిపిస్తోంది. "రూరల్ ఎమ్మెల్యేను లేపేస్తే డబ్బే డబ్బు." అంటూ ఓ రౌడీషీటర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. గత నెలలో నెల్లూరులోని ఓ హోటల్‌లో రౌడీషీటర్లు మద్యం తాగుతూ మాట్లాడుకుంటున్న వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలో రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ ప్రధాన అనుచరుడైన మరో రౌడీషీటర్ జగదీశ్ ఉండటం మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియో సారాంశం ప్రకారం.. రౌడీషీటర్ జగదీశ్‌తోపాటు పలు కేసుల్లో నిందితులుగా ఉన్న జకీర్, మహేశ్, వినీత్, రాజశేఖర్‌రెడ్డిలు ఓ హోటల్ రూంలో మద్యం తాగుతూ మాట్లాడుకుంటున్నారు. మహేశ్ అనే వ్యక్తి.. "డబ్బు పెద్ద సమస్యా..?" అని మాట్లాడగా, వెంటనే పక్కనే ఉన్న మరో వ్యక్తి.. "రూరల్ ఎమ్మెల్యేను లేపేస్తే డబ్బే డబ్బు." అంటూ వ్యాఖ్యానించాడు. వెంటనే మహేశ్.. 'చంపేస్తార్రా..' అని సమాధానమిచ్చాడు. 30 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియో రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఎమ్మెల్యే కోటంరెడ్డి హత్యకు రౌడీషీటర్లు కుట్ర పన్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియో ముందుగా పోలీసుల దృష్టికి రాగా.. వెంటనే స్పందించిన అధికారులు విచారణ చేపట్టారు. ఎస్పీ కృష్ణకాంత్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. రౌడీషీటర్లు మాట్లాడుకుంటున్న వీడియో రెండు రోజుల క్రితమే తమ దృష్టికి వచ్చిందని, దానిపై లోతుగా విచారిస్తున్నట్లు చెప్పారు. కాగా, వీడియో బయటకు రావడంతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శుక్రవారం సన్నిహితులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. తన ప్రాణానికి సంబంధించిన వ్యవహారం పోలీసుల దృష్టికి వచ్చినా..అధికారులు తనకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిరసనగా గన్‌మెన్లను ఎస్పీకి సరెండర్ చేస్తానన్నట్లు సమాచారం.

కూపీ లాగుతున్న పోలీసులు

కోటంరెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన రౌడీషీటర్ల వ్యవహారాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. వీడియోలో ఉన్న రౌడీషీటర్ జగదీశ్ ఇప్పటికే జైల్లో ఉండగా, మిగిలిన వారిని బాలాజీనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నారు.





రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి హాజరైన జనసైనికులు, వీర మహిళలు, వృత్తి వర్గాలకు చెందిన వారినుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

సినిమా నా బలం

సినిమాలే తన బలమని, రాజకీయాల్లో నిలదొక్కుకొని నాయకుడిగా రాణించడానికి 50 శాతం సినిమా నేపథ్యమే కారణమని పవన్ కల్యాణ్ అన్నారు. "కార్యకర్తలు కింద బలంగా ఉంటే, నాయకుడు శిఖరంపై ఒక్కడే ఉంటాడని పిరమిడ్ సిద్ధాంతం చెబుతుంది. కానీ నేను వృత్తాకార సిద్ధాంతాన్ని విశ్వసిస్తాను. వృత్తం ఎక్కడ మొదలైందో తిరిగి అక్కడికే వస్తుంది. నేను కూడా కార్యకర్తలను ఆ విధంగానే మళ్లీ మళ్లీ కలుస్తుంటాను." అని తెలిపారు. అనేక పరీక్షలు ఎదుర్కొన్నానని, అవమానాలు భరించానని పవన్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా రెండేళ్లు అన్నీ గమనించి నిర్ధారించుకున్నాకే తన వెంట నడిచారని చమత్కరించారు. అలాగే కొణతాల రామకృష్ణ కూడా 'మీ పోరాట స్ఫూర్తి నచ్చింది' అంటూ వచ్చి పార్టీలో చేరారన్నారు. వార్డు స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వంద మందినైనా కదిలించి, వెంట నడిపించుకునే శక్తి కలిగిన వారే నాయకులుగా ఎదుగుతారన్నారు. "డాక్టర్ నలనాగుల మనోజ్ ఉద్ధానం కిడ్నీ సమస్యపై అధ్యయనం చేస్తూ నా వద్దకు వచ్చారు. ముందుకు వెళ్లమంటూ నేనిచ్చిన ప్రోత్సాహంతో ఆ సమస్యకు ఆయన పరిష్కారం కనుగొన్నారు. పుస్తకం కూడా రాశారు. పాలసీ రూపొందించారు. ఇలాంటి వారెందరో జనసేన కోసం పనిచేస్తున్నారు. ఇదే జనసేన బలం." అని తెలిపారు. జనసైనికులు తనకు కష్టాల్లో అండగా నిలిచారని పవన్ కల్యాణ్ తెలిపారు.

ఉక్కుపై విషం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "స్టీల్‌ప్లాంటు ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని , దానికి సొంత గనులు కేటాయించాలని, వీలైతే పైప్‌లైన్ వేయాలని ఢిల్లీలో అమిత్ షాను కోరితే పరిశీలిస్తామని నాడు హామీ ఇచ్చారు. ఆ వెంటనే ప్రైవేటీకరణ ఆగిపోయింది." అని ఆయన వివరించారు. ఇప్పుడు ప్లాంటును ప్రైవేటీకరణ చేస్తున్నారని గొడవలు చేస్తున్న కార్మిక సంఘాలు వైసీపీ హయాంలో ఎందుకు ఆందోళన చేయలేదని ఆయన ప్రశ్నించారు. కార్మిక సంఘాల చిత్తశుద్ధిపై కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. సీఎంగా ఉండగా జగన్ పలు సంఘాల నాయకులతో సమావేశమై, ప్లాంటు ప్రైవేటీకరణకు సహకరిస్తే కొందరికి ప్లాట్లు ఇస్తామని ఆశ పెట్టగా, దానికి వారు తలలు ఊపారనే సమాచారం ఉందన్నారు. అలాంటి నాయకులే ఇప్పుడు కేంద్రం రూ.14 వేల కోట్లు సాయం చేసినా ఇంకా ఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు.

వీఆర్ఎస్ తీసుకునే వారిని ఆపగలమా?

నష్టాల్లో ఉన్న సంస్థలు వీఆర్ఎస్ ఇవ్వడం సహజమని, ఇష్టం లేని ఉద్యోగులు దానిని తీసుకునివెళ్లిపోతారని, దానిని తప్పుబట్టడం తగదని పవన్ కల్యాణ్ అన్నారు. ఉండలేమని అనేవారిని తుపాకీ పెట్టి ఆపలేం కదా?...అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంటు మళ్లీ ప్రైవేటుపరం అవుతుందంటూ చేస్తున్న ప్రచారాన్ని పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించాలని, మౌనంగా ఉండడం తగదని హెచ్చరించారు. దీనిపై పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సూచనలు చేస్తుందన్నారు. గతం(2018)లో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ)ను ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించినప్పుడు బీజేపీతో జనసేనకు పొత్తు లేదని, అయినా ఢిల్లీకి వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడానని ఆయన గుర్తుచేశారు. లాభాలు సాధించే సంస్థను అమ్మడం తగదని తాను విజ్ఞప్తి చేయగా, వెంటనే ప్రైవేటీకరణను ఆపేశారన్నారు. జాతీయ నాయకత్వం చాలా లాజికల్‌గా ఉంటుందని, వారు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పినప్పుడే అర్థం చేసుకుని సహకారం అందిస్తారని, లేదంటే వెళ్లిన పని పూర్తి కాదన్నారు. నాటి సీఎం జగన్ ఢిల్లీకి వెళ్లినప్పుడు ఒక్కసారైనా స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలని అడిగారా? అని ప్రశ్నించారు. వారికి కేసుల భయం ఉంది కాబట్టే కేంద్రాన్ని ప్రశ్నించలేకపోయారని, తనకు ఎటువంటి కేసుల భయమూ లేదని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.



రుషికొండ ప్యాలెస్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్, చిత్రంలో జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రతి నెలలో పది రోజులు పార్టీకే

- అసెంబ్లీ సమావేశాలు కాగానే క్యాడర్‌తో భేటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాఖపట్నం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాలు ముగియగానే క్యాడర్‌తో విడతలవారీగా సమావేశాలు నిర్వహిస్తానని, ప్రతి నెలలో పదిరోజులు పార్టీకే కేటాయిస్తానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఆయన రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాల నుంచి హాజరైన జనసైనికులు, వీర మహిళలు, వివిధ వృత్తి వర్గాలకు చెందిన వారితో శుక్రవారం సమావేశమై పార్టీ సిద్ధాంతాలను వివరించారు. జనసేన కులం, కుటుంబ పార్టీ కాదని, బలమైన ఆశయాలు కలిగిన ప్రాంతీయ పార్టీ అని, ఇక ముందు కూడా అలాగే కొనసాగుతుందన్నారు. అక్రమ మైనింగ్, ప్రకృతి విధ్వంసం వైసీపీ విధానమైతే పది మందికి ఉపయోగపడే పనులు చేయడం జనసేన ఆశయమన్నారు. నాదెండ్ల మనోహర్ పార్టీని ముందుకు తీసుకువెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన సేవలు వెలకట్టలేనివన్నారు. కూటమ ప్రభుత్వం రాగానే పార్టీని వదిలేశానని కొందరు ప్రచారం చేస్తున్నారని, పాలనపై పట్టు కోసం అనేక విషయాలు నేర్చుకోవడానికి 8-10 నెలల సమయం పట్టిందన్నారు. తప్పనిసరి స్థితిలోనే సినిమాలు చేస్తున్నానని, పార్టీ ఆర్థిక అవసరాలకు తప్పడం లేదన్నారు. సమాజం, ప్రజలు అంటే పిచ్చి కాబట్టే పదేళ్లుగా పార్టీని నడుపుతున్నానన్నారు. సోషల్ మీడియాలో ఎక్కడో ఉన్నోడు మనల్ని తిడతాడని, వాడు ఏ ఖండంలో ఉన్నా పట్టి లాక్కు రావాలని, లేదంటే నలిపేస్తారని వ్యాఖ్యానించారు.

శీతాకాలంలోగా వినియోగంలోకి రుషికొండ ప్యాలెస్

- ఎలా ఉపయోగిస్తే మంచిదో సలహాలివ్వండి: పవన్
- జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ప్యాలెస్ సందర్శన

రుషికొండపై గత సీఎం జగన్ అధిక నిధులు వెచ్చించి నిర్మించిన ప్యాలెస్‌ను ఈ శీతాకాలంలోగా అందుబాటులోకి తెస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి శుక్రవారం ఉదయం రుషికొండ ప్యాలెస్‌ను ఆయన పరిశీలించారు. మొత్తం నాలుగు బ్లాకులూ తిలకించారు. కొన్నిచోట్ల భవనం పైకప్పు పెచ్చులూడి పడిపోవడం గమనించి ఆవేదన చెందారు. మరికొన్ని ప్రాంతాల్లో వర్షానికి నీరు కారడం గమనించారు. ఈ సందర్భంగా సహచరులతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవనాన్ని చూడడానికి తాను వస్తే గేటు వరకు కూడా రానీయలేదని, రోడ్డు పైనుంచే పోలీసులు అడ్డుకొని పంపించేశారని గుర్తు చేసుకున్నారు. భవనం పరిశీలన పూర్తయిన తరువాత అక్కడే పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు తదితరులతో సమావేశమయ్యారు. భవనం ఏడాదిన్నరగా ఖాళీగా ఉందని, దీనిని ఎలా ఉపయోగిస్తే బాగుంటుందో సూచనలు చేయాలని కోరారు. పర్యాటక శాఖకు చెందిన ఈ భవనాన్ని త్వరగా వినియోగంలోకి తేవాలని సీఎం చంద్రబాబును కోరగా, ఏం చేస్తే బాగుంటుందో సలహా ఇవ్వాలని సూచించారని, అంతా కలసి కొన్ని సూచనలు చేస్తే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. అయితే ఎక్కువ మందికి భవనాన్ని సందర్శించే అవకాశం కల్పించడం అనేది ప్రధానం కాదని, రూ.453 కోట్ల పెట్టుబడికి తగిన ఆదాయం వచ్చేలా సూచనలు ఉండాలన్నారు. లాభం రాకపోయినా ఫరవాలేదని కనీసం బ్రేక్ ఈవెన్ వచ్చినా చాలన్నారు. దీనిపై నేతలంతా తమ అభిప్రాయాలు తెలిపారు. అనంతరం పవన్ స్పందిస్తూ.. మైస్ (మీటింగ్స్, ఎగ్జిబిషన్స్, తదితరాలు), డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఉపయోగించుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఆ తరువాత ఆయన బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. ప్యాలెస్ నిర్మాణానికి జగన్మోహన్‌రెడ్డి ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఏడాదికి రూ.7 కోట్ల ఆదాయం తెస్తున్న హరిత రిసార్ట్స్‌ను కూల్చేసి, దానిని మరింత అభివృద్ధి చేస్తామని సుప్రీంకోర్టుకు చెప్పి అనుమతులు తెచ్చారన్నారు. ఏడు బ్లాకుల నిర్మాణానికి రూ.164 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించి, అందులో కేవలం నాలుగు బ్లాకులే నిర్మించి, వాటికే రూ.453 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇప్పుడు ఆ భవనంలో అప్పుడప్పుడు నిర్వహణ కోసం విద్యుద్దీపాలు వేస్తేనే ఏడాదికి రూ.1.5 కోట్ల బిల్లు వస్తోందని పేర్కొన్నారు. నిర్వహణ లేక భవనాలు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే భవనానికి సేఫ్టీ ఆడిట్ చేసి, నిర్వహణ పనులు కూడా చేపట్టాల్సి ఉందన్నారు. భవనంలో ఇంటీరియర్ డెకరేషన్ కోసం రూ.39 కోట్లు వెచ్చించారని, ట్రాన్స్‌కో, జీవీఎంసీ, హార్టీకల్చర్, పర్యాటక శాఖ నుంచి దారిమళ్లించిన నిధులతో నిర్మాణం చేశారని పవన్ కల్యాణ్ తెలిపారు.

'రుషికొండ'పై మంత్రివర్గ ఉపసంఘం

అమరావతి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సమేతంగా నివాసం ఉండేందుకు రూ.450 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన విలాసవంతమైన విశాకలోని రుషికొండ ప్యాలెస్ భవనాలను ఏం చేయాలన్న దానిపై ప్రభుత్వం కసరత్తు చేస్తూనే ఉంది. ప్రస్తుతం దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసి ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి ఉన్నారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. ఏపీటీడీసీ ఎండీ కూడా ఉపసంఘం, స్పెషల్ సీఎస్‌తో సమన్వయం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మంత్రివర్గ ఉపసంఘం వెంటనే తన సిఫారసులను ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించింది.

తెలుగులోనే కోర్టు తీర్పులు!

- తెనాలి న్యాయాధికారి భాషాభిమానం



ఏకా పవన్‌కుమార్

తెనాలి క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా తెనాలి న్యాయస్థానంలో ప్రధాన పౌర న్యాయాధికారి(ప్రిన్సిపల్ సివిల్ జడ్జి) ఏకా పవన్‌కుమార్ ఐదు వ్యాజ్యాలపై తెలుగులో తీర్పు వెలువరించి భాషాభిమానాన్ని చాటుకున్నారు. ఇందులో నాలుగు పౌర దావాల వాగ్దాన పత్రాలు (ప్రాంసరీనోట్లు)దాఖలు చేసినవి కాగా, మరొకటి ఒక ముద్దాయి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని నమోదయిన వ్యాజ్యం. సాధారణంగా బ్రిటీష్ కాలం నుంచీ కోర్టుల్లో న్యాయమూర్తులు ఇంగ్లీషు భాషలోనే తీర్పును వెలువరించడం రివాజు. వీటిని న్యాయవాదులు తిరిగి తెలుగులో కక్షిదారులకు వివరిస్తే తప్ప, వారికి అర్థమయ్యేది కాదు. కానీ ఇక్కడి న్యాయాధికారి ఏకా పవన్‌కుమార్ మొదటి నుంచీ గృహహింస, అటవీశాఖ, వ్యక్తిగత చీటీలు, సహకార చట్టాల పరిధిలో జరుగుతున్న మోసాలు, హక్కుల గుర్తింపు, తగాదాలు, దొమ్మీలు తదితర కేసులకు సంబంధించి తెలుగులోనే కక్షిదారులకు అర్థమయ్యేలా తీర్పులు ఇస్తూ గుర్తింపు పొందారు.

వైసీపీ నేతలతో పరిచయాలు నిజమే!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్టు ఆమె అంగీకరించినట్లు సమాచారం. పలు నేరాలకు సంబంధించి రిమాండ్ ఖైదీగా ఉన్న అరుణను మూడు రోజులపాటు విచారణకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో గురువారం ఆమెను ఒంగోలు జైలు నుంచి నెల్లూరు జిల్లా కోవూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అప్పటికే కాలాతీతం కావడంతో గురువారం ఆమె ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన సమాచారంతో విచారణ సరిపెట్టారు. రెండోరోజు శుక్రవారం మాత్రం సుదీర్ఘంగా విచారించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నెల్లూరు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నెల్లూరు డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు, ఒంగోలు పోలీసు అధికారులు కోవూరు స్టేషన్‌లో అరుణను ఆమె న్యాయవాదుల సమక్షంలో విచారించారు. ఈ విచారణకు ముందే అరుణ నేరచరిత్రకు సంబంధించి తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్ల నుంచి సమాచారం సేకరించారు. గత ప్రభుత్వంలో అరుణ పోలీస్‌స్టేషన్లు వేదికగా సెటిల్‌మెంట్లు, లాబీయింగ్‌లు నడిపారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు దగ్గరగా ఉన్న జీడీహెచ్ (సీఐలకు సహాయకులు) ద్వారా అరుణ ఎప్పుడు ఏ స్టేషన్‌కు వెళ్లారు... ఏ ఫిర్యాదుపై వెళ్లారు...ఆ ఫిర్యాదు పూర్వాపరాలు ఏమిటి అనే వివరాలతో ప్రశ్నావళిని సిద్ధం చేసుకొని, దాని ఆధారంగా విచారణ మొదలుపెట్టినట్లు తెలిసింది. అధికారులు, రాజకీయ నాయకుల్లో తనకు ఎవరెవరితో పరిచయాలున్నది ఆమె వెల్లడించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో తనకు మంచి పరిచయాలు ఉన్నట్లు ఆమె అంగీకరించినట్లు పోలీసు వర్గాల సమాచారం. వారి ప్రోద్బలంతోనే నేరాలకు పాల్పడినట్లు తెలిసింది. సాయంత్రం 3.30 గంటల ప్రాంతంలో అరుణకు సంబంధించిన న్యాయవాదులు పోలీస్ స్టేషన్ నుంచి వెలుపలికి వచ్చేశారు. ఆ తర్వాత సుమారు గంటన్నరకుపైగా పోలీసుల అధికారుల ఎదుట పలు వివరాలను అరుణ వెల్లడించినట్లు తెలిసింది. ఆ సమయంలోనే రాజకీయ, ఉన్నతాధికారులతో తనకు ఉన్న పరిచయాలను ఆమె వెల్లడించినట్లు పోలీసు వర్గాల సమాచారం. శుక్రవారం విచారణలో అరుణ నుంచి చాలా విషయాలు సేకరించామనే సంతృప్తిని ఓ పోలీస్ అధికారి వ్యక్తం చేయడం గమనార్హం. కాగా, తమను పోలీసులు విచారణ గదినుంచి వెలుపలికి పంపివేశారని ఆరోపిస్తూ అరుణ తరఫు న్యాయవాది కోవూరు కోర్టులో మెమో వేయడం మరో విశేషం.

భాషావ్యాప్తి జరగాలి

- సృజనాత్మక పద్ధతిలో సమష్టి కృషి అవసరం
- అప్పుడే తెలుగు భాషాభివృద్ధికి బాటలు
- గిడుగు సభలో వెంకయ్యనాయుడు సూచన



నెల్లూరులో తెలుగు భాషోత్సవాలను ప్రారంభిస్తున్న వెంకయ్య

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తెలుగు భాషావ్యాప్తి జరగాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. సృజనాత్మక మార్గంలో సమష్టి కృషి జరిపినప్పుడే భాషాభివృద్ధికి బాటలుపడతాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు పురమందిరంలో సేవ అనే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలుగు భాష ఉత్సవాలు, గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకల'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బడిలో నేర్పించే తెలుగుతోపాటు బతుకును నిలబెట్టే తెలుగును కూడా విద్యార్థులకు నేర్పించాలని వెంకయ్యనాయుడు సూచించారు. భాష ఆధునీకరణ అంటే మూలాలు మరవడం కాదని, మరింత సమగ్రంగా భవిష్యత్‌ను నిర్మించుకోవడమని వివరించారు. విజ్ఞానం అందరికీ అందాలని ఆకాంక్షించి, వ్యావహారిక భాషోద్యమానికి శ్రీకారం చుట్టిన గిడుగు స్ఫూర్తితో తెలుగు భాషను పరిరక్షించుకోవాలని సూచించారు. "మాతృభాషను ప్రేమించడం, సోదరభాషను గౌరవించడం, అవసరాన్ని బట్టి పరభాషను అభ్యసించడం అత్యంత ఆవశ్యకం. ఆటపాటలతో తెలుగును విద్యార్థులకు నేర్పించాలి." అని కోరారు. తెలుగు నాట తెలుగు భాష పరిరక్షణ గురించి మాట్లాడుకునే పరిస్థితి రావడం విచారకరమన్నారు. ఉన్నత విద్యలోనూ మాతృభాషల వాడకం పెరగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల భాష, పరిపాలనా భాష ఒక్కటే కావాలని సూచించారు. న్యాయస్థాన కార్యకలాపాలు, తీర్పులు మాతృభాషలో అందించేందుకు ప్రయత్నాలు జరగాలన్నారు. కంప్యూటర్లలో తెలుగు భాష వినియోగాన్ని పెంచడం ద్వారా నేటి యువతలో ఆసక్తిని పెంచవచ్చునని సూచించారు. అందమైన తెలుగు పద్యాల వినియోగానికి భాషాప్రియులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రసార భారతి విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ రేవూరు అనంత పద్మనాభరావు, సేవా సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, పలువురు భాషాభిమానులు, తెలుగు సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ 'మార్క్' న్యాయం!

- తహసీల్దార్ సోమ్లానాయక్ సేఫ్
- రైతు ఆత్మహత్యకు ఆయన కారణం కాదట
- చర్యలొద్దని స్పెషల్ సీఎస్ సిఫారసు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మండల రెవెన్యూ అధికారులు తన భూమిని వెబ్‌ల్యాండ్ రికార్డుల్లోకి ఎక్కించడం లేదని, తీవ్ర అన్యాయం చేస్తున్నారంటూ మనస్తాపానికి గురైన రైతు ఆరేళ్ల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసుపై నాటి జగన్ ప్రభుత్వం ఆగమేఘాలపై స్పందించి ఇద్దరు మండల తహశీల్దార్లపై సమగ్ర విచారణ జరిపించింది. ఏళ్ల తరబడి సా..గిన ఈ విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అధికారులకు విముక్తి లభించింది. రైతు ఆత్మహత్యకు నాటి తహసీల్దార్ సోమ్లానాయక్ కారణం కాదని రెవెన్యూ శాఖ తీర్పు ఇచ్చేసింది. ఆయన సురక్షితంగా బయటపడ్డారు. మరి ఆ రైతు ఆత్మహత్యకు కారణమెవరో రెవెన్యూ శాఖ నిగ్గుతేల్చలేదు. రైతుకు న్యాయంగా, చట్టబద్ధంగా జరగాల్సిన పని ఎందుకు జరగలేదు.. అందుకు బాధ్యులైన అధికారులెవరో తేల్చనేలేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలానికి చెందిన రైతు నడిపినేని రత్తయ్య తన భూమిని మ్యుటేషన్ చేయాలని.. వెబ్‌ల్యాండ్‌లో వివరాలు తాజాపరచాలని 2019 జూలైకి ముందు అనేక దఫాలు తహశీల్దార్ ఆఫీసు చుట్టూ తిరిగాడు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు వెబ్‌ల్యాండ్‌లో వివరాలను తాజాపరచలేదు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన రత్తయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై 2019 జూలై 17న అప్పటి ప్రకాశం కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. నాటి తహసీల్దార్.. అంతకు ముందు పనిచేసిన తహసీల్దార్లు సరైన న్యాయం చేయలేదని రైతు ఆరోపణలు చేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అయితే రైతు ఆత్మహత్య కారణాలకు, తమకు ఎలాంటి సంబంధం లేదని నాటి రెవెన్యూ అధికారులు కె. రాఘవయ్య, (రిటైర్డ్), సోమ్లానాయక్(తహసీల్దార్) భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు నివేదించారు. వీటి ఆధారంగా అప్పటి మార్కాపురం ఆర్డీవోతో విచారణ చేయించారు. సోమ్లానాయక్‌పై వచ్చిన ఆరోపణలు నిరూపితం కాలేదని ఆర్డీవో 2022 నవంబరు 25న ప్రభుత్వానికి రిపోర్టు ఇచ్చారు. ఇది జరిగిన 32 నెలల తర్వాత రెవెన్యూ శాఖ ఈ కేసును తెరపైకి తెచ్చింది. రైతు రత్తయ్య ఆత్మహత్య నేపథ్యంలో తహసీల్దార్ సోమ్లానాయక్‌పై వచ్చిన ఆరోపణలు రుజువు కానందున ఆయన వినతి మేరకు తదుపరి చర్యలను నిలిపివేస్తున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరి ఆ రైతు ఆత్మహత్య చేసుకోవడానికి కారణమెవరనేది ఇక్కడ ప్రధాన ప్రశ్న!



కళాకారుడిని సత్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేశ్. చిత్రంలో మండలి బుద్ధప్రసాద్, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి

నవంబరులో నంది నాటకోత్సవాలు

- భాషకు గొడుగు..గిడుగు: మంత్రి కందుల దుర్గేశ్
- 14 మందికి గిడుగు పురస్కారాల ప్రదానం

సిరిపురం (విశాఖపట్నం), ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వ్యవహారిక భాషకు గొడుగుపట్టిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో నంది నాటకోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. గిడుగు రామమూర్తి 162వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. తెలుగు జాతి ఔన్నత్యాన్ని, భాష గొప్పతనాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిలబెడుతున్నారన్నారు. అనంతరం గిడుగు పురస్కారాలను 14 మందికి అందించారు. రేగుళ్ల మల్లికార్జున రాసిన 'తెలుగు వెలుగు' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విధుల్లో ఉండగా.. పోలీసులు యూనిఫాం ధరించాల్సిందే!

- కానిస్టేబుల్‌పై దాడి ఘటన వీడియో ఫుటేజ్, కేసు డైరీని సమర్పించండి.. హైకోర్టు ఆదేశం
- నల్లపరెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ 8కి వాయిదా



అమరావతి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధ విధులు నిర్వర్తించే సమయంలో పోలీసులు యూనిఫాం ధరించాల్సిందేనని హైకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తులను.. పోలీసు అధికారులని సాధారణ ప్రజలు ఎలా గుర్తించగలరని ప్రశ్నించింది. నిందితుల అరెస్టు సమయంలో పోలీసులు యూనిఫాంలో ఉండాలనే దానిపై సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని గుర్తుచేసింది. వైసీపీ అధ్యక్షుడు జగన్ నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై దాడికి పాల్పడ్డారని స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య ఫిర్యాదు ఆధారంగా దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంటెలిజెన్స్ అధికారులు ఉన్నది ప్రభుత్వాలకు నివేదికలు, సమాచారం ఇవ్వడానికి తప్ప.. సివిల్ పోలీసుల విధులు ఎలా నిర్వర్తిస్తారని న్యాయస్థానం ప్రశ్నించింది. ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు డ్రెస్‌కోడ్ ఉండదన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను తోసిపుచ్చింది. బనియన్లు, డ్రాయర్లు, టీషర్ట్‌లు ధరించి వచ్చి తాము పోలీసులమంటే.. ప్రజలకు ఎలా తెలుస్తుందని వ్యాఖ్యానించింది. సివిల్ దుస్తుల్లో విధులు నిర్వహించే ప్రత్యేక వెసులుబాటు ఏమీ పోలీసులకు ఉండదని పేర్కొంది. డ్రెస్‌కోడ్ మాన్యువల్‌ను తమ ముందు ఉంచాలని డీజీపీకి ఆదేశాలు ఇస్తామని తెలిపింది. ఇదే సమయంలో ప్రస్తుత కేసులో ఫిర్యాదుదారుడి ఘటనలో ప్రసన్నకుమార్‌రెడ్డి పాత్ర ఉందని నిరూపించేందుకు ఆధారమైన వీడియో ఫుటేజ్‌తోపాటు కేసు డైరీని కోర్టు ముందు ఉంచాలని పీపీని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 8కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు.

వాదనలు.. ప్రతివాదనలు

ప్రసన్నకుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కానిస్టేబుల్‌ను పిటిషనర్ తోసివేయలేదని, ఘటన జరిగినప్పుడు ఆయన దూరంగా ఉన్నారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... ఘటనలో ప్రసన్నకుమార్‌రెడ్డిది కీలక పాత్ర అని.. పిటిషనర్, ఆయన అనుచరుల దాడిలో కానిస్టేబుల్ గాయపడ్డారని పేర్కొన్నారు. సర్జరీ కూడా జరిగిందన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఘటన సమయంలో ఫిర్యాదుదారు యూనిఫాంలో లేరని గుర్తుచేశారు. యూనిఫాంలో విధులు నిర్వర్తించినప్పుడు మాత్రమే ఆరోపణలకు బలం ఉంటుందని వ్యాఖ్యానించారు. పీపీ బదులిస్తూ.. ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు డ్రెస్ కోడ్ ఉండదని, శాంతిభద్రతలు పరిరక్షించేక్రమంలో సాధారణదుస్తుల్లోనూ విధులు నిర్వర్తిస్తుంటారన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.